# ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 6-7-2019 శనివారం సిటీ సంపుటి 45 సంచిక 327
రూ. 6-50. పేజీలు 20+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi







# సంపన్ను భారత్



## బడ్జెట్ మొత్తం
రూ. 27,86,349 కోట్లు

"దేశ భద్రత, ఆర్థిక వృద్ధి అనే రెండు కీలక లక్ష్యాల కోసం ప్రజలు మాకు భారీ మద్దతిచ్చారు. ఆ స్ఫూర్తితో నవభారత నిర్మాణం కోసం అడుగులు వేస్తున్నాం
- నిర్మలా సీతారామన్

### ప్రధానాంశాలు

- ఆదాయపు పన్ను శ్లాబులు యథాతథం
- సంపన్నులకు సర్‌ఛార్జి మోత
- ఏడాదికి రూ.కోటి దాటిన నగదు ఉపసంహరణలపై 2% పన్ను
- రూ.400 కోట్ల వరకు టర్నోవర్ కలిగిన కంపెనీలకు పన్ను 25 శాతమే
- వడ్డీపై పన్ను మినహాయింపుతో గృహనిర్మాణానికి ఊతం
- ఇక ఆధార్‌తోనూ ఐటీ రిటర్నుల దాఖలు
- ఆహారం, ఇంధనం, ఎరువుల రాయితీకి రూ.3.01 లక్షల కోట్లు
- ఆయుష్మాన్ భారత్‌కు రూ.6,400 కోట్లు
- ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.70వేల కోట్ల సహాయం
- అతివకు అందలం – స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు రూ.29 వేల కోట్లు
- త్వరలో కొత్త అద్దె ఇళ్ల చట్టం
- 2024 నాటికి ఇంటింటికీ నల్లా నీరు

## ఐదు లక్షల కోట్ల డాలర్ల భారీ స్వప్నం!

**సార్వత్రిక ఎన్నికల్లో జన భారతం పట్టిన బ్రహ్మరథం స్ఫూర్తితో మోదీ సర్కారు.. నవ భారత ఆవిష్కారం కోసం బడ్జెట్ వేదికగా లక్ష్యించిన భారీ ఆర్థిక యజ్ఞం ఇది!**

అత్యంత కీలకమైన ఆర్థిక శాఖ పగ్గాలు చేపట్టిన మహిళ.. దేశ ఆర్థికరంగ బలోపేతానికి ఎలాంటి దిశానిర్దేశం చేస్తారన్న సర్వత్రా ఆసక్తి నడుమ... నిర్మలా సీతారామన్ 'దిగ్గజ భారత' నిర్మాణమే తమ దృఢతర ధ్యేయమని తేల్చి చెప్పారు. అందుకోసం ప్రణాళికా రచనకే పెద్దపీట వేశారు. ఎక్కడా పెద్దగా ఊరడింపులూ, ఉదార కేటాయింపులూ లేకుండా గట్టి క్రమశిక్షణే పాటించారు. కొనసాగుతున్న పథకాలకు బాసటనివ్వటంతో పాటు కీలక రంగాల్లో విదేశీ పెట్టుబడులకు స్వాగతం పలికారు. భారీ కార్పొరేట్లకు ప్రోత్సాహకంగా పన్ను కొంత తగ్గించారు. ఆదాయ పన్నును ముట్టుకోలేదు. మొత్తానికి ఈ బడ్జెట్లో అంకెలకన్నా ఆలోచనలు.. భూరి గణాంకాల కన్నా భారీ ప్రణాళికలే ఎక్కువన్నది సుస్పష్టం. అలాగే పెట్రో వాతతో సామాన్యుడి నుంచీ.. బంగారం మోతతో మధ్యతరగతి నుంచీ.. కోటిపైన లావాదేవీలపై పన్నుతో సంపన్నుల నుంచీ.. నిర్మలమ్మ నిమ్మళంగా బాగానే గుంజారన్నది నిష్ఠుర సత్యం!

- మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట
- గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- రైతుకు మరింత మద్దతు
- పదేళ్ల దార్శనికత ఆవిష్కరణ
- విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం
- కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

పూర్తి వివరాలు లోపలి పేజీల్లో...

ఈ బడ్జెట్ 21వ శతాబ్దంలో భారత ప్రగతిరథాన్ని పరుగులు తీయిస్తుంది. పేదలను శక్తిమంతులను చేస్తుంది. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచుతుంది. దేశంలో మౌలిక వసతుల ఆధునికీకరణకు దోహదపడుతుంది. జనహితమైన ఈ బడ్జెట్ ప్రజలందరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.
- ప్రధాని మోదీ





బడ్జెట్ నిస్సారంగా ఉంది. సమాజంలో ఏ వర్గానికీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆశించిన ఉపశమనాన్ని కల్పించలేకపోయారు. - పి.చిదంబరం, కాంగ్రెస్ నేత

### ధరలు పెరిగేవి

| | | | |
|---|---|---|---|
| బంగారం, వెండి | స్ప్లిట్ ఏసీలు | సిరామిక్ టైల్స్ | పాలరాయి |
| సీసీ కెమెరాలు | జీడిపప్పు | న్యూస్ ప్రింట్ | సబ్బులు |
| ఆప్టికల్ ఫైబర్ | లౌడ్ స్పీకర్లు | సిగరెట్, తంబాకు | డిజిటల్ వీడియో రికార్డర్లు |

**దిగుమతి చేసుకునే వాటిలో పెరిగేవి**
- విదేశీ కార్లు
- స్టీల్ ఉత్పత్తులు
- ప్లాస్టిక్
- వాహన పరికరాలు
- పుస్తకాలు

**తగ్గేవి**
- విద్యుత్ వాహనాల విడిభాగాలు
- మొబైల్ ఫోన్ కెమెరాలు, ఛార్జర్లు
- సెట్‌టాప్ బాక్సులు
- దిగుమతి చేసుకున్న రక్షణ పరికరాలు (భారత్‌లో తయారుకానివి)

## ప్రైవేటు మార్గంలో రైలు

**పీపీపీ విధానానికి అగ్రతాంబూలం**

- ఏడాదికి 10,000 కిలోమీటర్ల పనులు
- రైల్వే ప్రతిపాదనలు సమర్పించిన ఆర్థిక మంత్రి

12లో

ఆదాయం రూ.2.16 లక్షల కోట్లు, వ్యయం రూ.2.07 లక్షల కోట్లు





## ఇంధనం మండింది

- పెట్రోలు, డీజిలుపై రూ.1 చొప్పున ఎక్సైజ్ సుంకం పెంపు
- రూపాయి చొప్పున పెరిగిన రోడ్డు, మౌలిక వసతుల సెస్సు
- తెలంగాణలో వాహనదారులకు ఏటా రూ. వెయ్యి కోట్ల భారం
- పరోక్షంగా మరో రూ.400 కోట్ల బాదుడు

2లో






## మాట లేదు... మూటా లేదు

- కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావనకు రాని కాళేశ్వరం జాతీయ హోదా
- పత్తాలేని పసుపు బోర్డు
- నిర్మలా సీతారామన్ ప్రసంగంలో వినిపించని విభజన హామీలు
- బయ్యారం ఉక్కు... రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీలకు దక్కని చోటు
- వెనుకబడిన జిల్లాలకూ లభించని ఊరట
- రాష్ట్రానికి తీవ్ర నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్

12లో

## నేటి నుంచి ఎంసెట్ ఆప్షన్లు

- తేలిన రుసుముల లెక్క
- 20 ఇంజినీరింగ్ కళాశాలల్లో రూ.లక్ష దాటిన ఫీజు
- 15 నుంచి 43 శాతం పెరిగిన రుసుములు
- 103 కళాశాలలకే శాశ్వత రుసుముల ఖరారు
- కమిటీ నిర్ణయించిన ఫీజులకు విద్యాశాఖ ఆమోదం

5లో

నేడు హైదరాబాద్‌కు అమిత్‌షా 5లో




# సంస్కరణలే ఎజెండా

## అతడు అహంభావే!

తాను సర్వ సమృద్ధుడను, సర్వ స్వతంత్రుడననీ, తనకు మరెవ్వరితో సంబంధం లేదని కేవలం ఓ అహంభావి మాత్రమే చెప్పగలడు!

– మహాత్మా గాంధీ

### పాత వాగ్దానాలే మళ్లీ

కాంగ్రెస్ పార్టీ లోక్‌సభా పక్ష నేత అధీర్ రంజన్ చౌధరీ



"నవభారత్ గురించి ప్రభుత్వం మాట్లాడుతోంది. ఇది 'కొత్త సీసాలో పాత సారా'లా ఉంది. బడ్జెట్‌లో పాత వాగ్దానాలనే మళ్లీ ప్రస్తావించారు. ప్రభుత్వం భారత్‌ను 'అభూత కల్పనలతో కూడిన సంపద ఉన్న ప్రాంతం'గా చూపిస్తోంది. వాస్తవంగా ఆర్థిక రంగం దెబ్బతింది. ఉపాధి కల్పించేందుకు గానీ, వ్యవసాయ కార్మిక రంగాలకు సౌకర్యాల కల్పనకు గానీ ఎలాంటి ప్రణాళికలు లేవు."

### హామీల అమలులో మోదీ సర్కారు విఫలం

తెరాస మాజీ ఎంపీ వినోద్

'హర్ ఘర్ జల్' కార్యక్రమానికి ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడం బాధాకరం. రాష్ట్రంలో 3,000 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం సమగ్ర నివేదికలు అందజేసినా.. కేంద్ర ఆర్థిక మంత్రి వాటిపై దృష్టి సారించలేదు. బడ్జెట్‌లో రైల్వేల గురించి ప్రస్తావించనే లేదు. సర్వశిక్ష అభియాన్‌కు కేటాయింపులను తగ్గించడం విద్య పట్ల నిర్లక్ష్యానికి సూచిక. కాళేశ్వరం, మిషన్ భగీరథలకు నిధులు ఇవ్వకపోవడం దారుణం. హామీల అమలులో మోదీ సర్కారు విఫలమైంది.

### భాజపాది కపట ప్రేమ

కొత్త ప్రభాకర్‌రెడ్డి, తెరాస ఎంపీ

తెలంగాణపై భాజపా కపట ప్రేమకు ఈ బడ్జెటే నిదర్శనం. మున్ముందు కూడా ఇలానే ఉంటే ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు. విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ ప్రస్తావించకుండా.. రాష్ట్రానికి మొండి చేయి చూపారు.

### అన్నివర్గాల సంక్షేమ బడ్జెట్

భాజపా ఎంపీ బండి సంజయ్

పేదలు, రైతులు, యువత, మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ బడ్జెట్‌తో నిరూపితమైంది. తెలంగాణ ప్రభుత్వం భేషజాలకు పోకుండా కేంద్ర పథకాలను అమలు చేయాలి

– ఈనాడు, దిల్లీ

## బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

ఈనాడు – దిల్లీ



2019–20 బడ్జెట్ ప్రతులతో శుక్రవారం పార్లమెంటుకు బయలుదేరడానికి ముందు ఆర్థిక శాఖ కార్యాలయం వద్ద కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆ శాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకుర్, అధికారులు

వ్యవస్థీకృత సంస్కరణలే ఎజెండాగా నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను రూపొందించింది. దేశాన్ని ప్రపంచంలోనే మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసింది. ఇందుకు విదేశీ పెట్టుబడులను ఆహ్వానించనుంది. ఎన్నికల్లో పేర్కొన్న మేరకు "గావ్, గరీబ్, కిసాన్" (గ్రామాలు, పేదలు, రైతులు)లకు కొన్ని కేటాయింపులు జరిపింది. గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలైన ఇళ్లు, తాగునీరు, రహదారుల వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. దేశ తొలి పూర్తి కాలపు మహిళా ఆర్థిక మంత్రి అయిన నిర్మలా సీతారామన్ శుక్రవారం సమర్పించిన ప్రప్రథమ బడ్జెట్‌ను కేవలం వార్షిక ఆదాయ- వ్యయాల పట్టికగా మాత్రమే కాకుండా, రానున్న పదేళ్లకు దార్శనిక పత్రంగా రూపొందించారు. 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల (రూ.350లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దాలని సంకల్పించుకొని అందుకుతగ్గ మార్గసూచీని ప్రకటించారు. సందర్భానుసారంగా సంస్కృతం, హిందీ, ఉర్దూ, తమిళ భాషల్లో సూక్తులను ఉటంకిస్తూ దీర్ఘ కాలిక ఉన్నత లక్ష్యాలను ప్రకటించారు. ఆ ఆశయాల మాట ఎలా ఉన్నా, తక్షణ భారం మోపి సామాన్యులు, మధ్యతరగతిని తీవ్ర నిరాశకు గురి చేశారు. పెట్రోలు, డీజిల్‌లపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం, రహదారులు-మౌలిక సదుపాయాల సెస్సును పెంచారు. ఆదాయపుపన్ను శ్లాబుల్లో ఎలాంటి ఊరట ఇవ్వలేదు. బంగారంపై దిగుమతి సుంకం పెంచి మహిళలకు అసంతృప్తి కలిగించారు. గృహ రుణాలపై కాస్త వెసులుబాటు కల్పించారు. ఆదాయం సమకూర్చుకోవడం కోసం అపర కుబేరులు (సూపర్ రిచ్)పై పన్ను వడ్డించారు. దాదాపు 75 వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచారు. మొత్తంగా చూస్తే ధనిక వర్గాలపై భారం మోపడం, మధ్యతరగతి వారితో ఇచ్చిపుచ్చుకోవడం అనే విధానాన్ని అనుసరించడం, జనాకర్షక పథకాలకు కోత విధించడం అన్న ధోరణిలో బడ్జెట్ సాగింది.

నవ భారత నిర్మాణమే ప్రజల ఆకాంక్షగా ఉందని పేర్కొన్న నిర్మలా సీతారామన్ అందుకోసం అనుసరించనున్న వ్యూహాన్ని తన ప్రసంగంలో ప్రస్తావించారు. "గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలు కదలివచ్చి ఓటు వేశారు. పనిచేసే ప్రభుత్వానికి ఆమోదం తెలిపారు. 'దేశమే ప్రథమం' అన్న విధానానికి విస్పష్టమైన మద్దతు తెలిపారు. దేశ భవిష్యత్తుపై రెండు లక్ష్యాలను ముందుంచారు. అవి: జాతీయ సమాజం రూపకల్పన, ఆర్థిక ప్రగతి" అని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని తొలి సర్కారు పనిచేసే ప్రభుత్వంగా పేరుపొందిందని, చివరి వ్యక్తికీ సంక్షేమ ఫలాలను అందించిందని తెలిపారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచడం, సహకార సమాఖ్య వ్యవస్థ, జీఎస్టీ మండలి ఏర్పాటు, ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడడం వంటి లక్ష్యాలతో ముందుకు సాగిందని వివరించారు. "నీతి ఆయోగ్ సహకారంతో నవ భారత నిర్మాణ ప్రయత్నాలను కొనసాగిస్తున్నాం. 'సంస్కరణలు, పనితీరు, రూపాంతీకరణ' అన్న నినాదంతో కార్యాచరణ చేపట్టాం" అని వివరించారు.

ప్రస్తుతం దేశం 3 ట్రిలియన్ డాలర్ల (రూ.205 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో ఆరో స్థానంలో ఉందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అయిదేళ్ల క్రితం 11వ స్థానంలో ఉందని అన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే చాలా వ్యవస్థీకృత సంస్కరణలను కొనసాగించవలసి ఉందని తెలిపారు. పరోక్ష పన్నులు, స్థిరాస్తి రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. సామాన్యుల జీవన ప్రమాణాల్లో మార్పుల కోసం ముద్ర రుణాలు, గ్యాస్, విద్యుత్తు కనెక్షన్లు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించామని అన్నారు. ప్రస్తుతం మౌలిక రంగం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాల కల్పనలో పెట్టుబడులు పెంచాల్సి ఉందని చెప్పారు. "గత 55 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ విలువ ఒక ట్రిలియన్ డాలర్లే. ప్రజల గుండెల్లో ఆశ, విశ్వాసం, ఆకాంక్ష నిండడంతో గత అయిదేళ్లలో దానిని మేం రెండు ట్రిలియన్ డాలర్ల విలువైనదిగా అభివృద్ధి చేశాం. ఇప్పుడు మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉంది. మేం అయిదు ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మార్చుతామన్నప్పుడు చాలా మంది అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ మాకు ప్రజల కృషిపై నమ్మకం ఉంది. అభివృద్ధి చెందాలన్న కాంక్ష వారిలో ఉంది. అంకితభావంతో పనిచేసే నాయకత్వం ఈ సభలో ఉంది" అని వివరించారు. దేశంలోని పరిశ్రమలను సంపద, ఉద్యోగాల సృష్టికర్తలని అభివర్ణించారు. పరస్పర విశ్వాసంతో సుస్థిర అభివృద్ధిని సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

> ఈ ఏడాది మహాత్ముని 150వ జయంతిని పురస్కరించుకొని గాంధీ సిద్ధాంతాలను నవ తరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'గాంధీపీడియా'ను అభివృద్ధి చేస్తాం. విజ్ఞాన సర్వస్వం ఎన్‌సైక్లోపీడియా తరహాలో మహాత్మునికి సంబంధించిన మొత్తం సమాచారం ఇందులో లభిస్తుంది

### మహాత్ముని స్మరించి గ్రామాల అభివృద్ధి

మహాత్మాగాంధీని స్మరించి గ్రామాల అభివృద్ధికి చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. "భారత దేశ ఆత్మ గ్రామాల్లోనే ఉంది" అన్న గాంధీజీ మాటలను ప్రస్తావించి.. పేదల్లోని నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చే అంత్యోదయ విధానమే తమ ప్రభుత్వానికి మార్గసూచీ అని ఆర్థిక మంత్రి తెలిపారు. "2022 నాటికి గ్రామాల్లోని ప్రతి ఒక్క కుటుంబానికి విద్యుత్తు, వంట గ్యాస్ సౌకర్యం కల్పిస్తామని దేశానికి హామీ ఇస్తున్నా" అని ఆర్థిక మంత్రి ప్రసంగంలో పేర్కొనడం ప్రభుత్వ ప్రాధాన్యతలను తేటతెల్లం చేస్తున్నాయి.

గ్రామాల అభివృద్ధిలో భాగంగా సంప్రదాయ పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించనున్నారు. ఇందుకోసం నూతనంగా 'స్ఫూర్తి' (స్కీం ఆఫ్ ఫండ్ ఫర్ అప్‌గ్రేడేషన్ అండ్ రిజెనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్-ఎస్ఎఫ్‌యూఆర్‌టీఐ) అనే పథకాన్ని రూపొందించారు. మహిళలకూ వరాలు ఇచ్చారు. వడ్డీలో రాయితీపై రుణాలు పొందే సౌకర్యం ప్రస్తుతం కొన్ని జిల్లాల స్వయం సహాయక బృందాల మహిళలకే ఉండగా, దాన్ని అన్ని జిల్లాలకు వర్తింపజేశారు. వ్యవసాయ రంగానికి గత ఆర్థిక సంవత్సరం సవరించిన బడ్జెట్‌లో రూ.75,752 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.1,38,563 కోట్లు కేటాయించారు. ఇందులో సింహభాగం అంటే దాదాపు రూ.75వేల కోట్లు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కిసాన్ సమ్మాన్ నిధికే వెళ్లనున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన నిధులతో సరిపోల్చినప్పుడు వ్యవసాయ రంగానికి 5 శాతం నిధులు లభించాయి.

### రూ.27.86 లక్షల కోట్ల బడ్జెట్

బడ్జెట్ పరిమాణం ఘనంగానే ఉంది. రూ.27,86,349 కోట్ల ఆదాయం-వ్యయ అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించారు. ఇందులో ద్రవ్యలోటు రూ.7,03,760 కోట్లుగా ఉంది. ఇది స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో 3.3 శాతం. లోటును పూడ్చడానికి ఈ ఏడాది విదేశీ మార్కెట్ నుంచి రూ.4.48 లక్షల కోట్లు రుణాలు సేకరించనున్నారు. గత ఏడాది రూ.4.22 లక్షల కోట్ల రుణాలు తీసుకోగా, ప్రస్తుతం అంతకన్నా ఎక్కువే తీసుకోనున్నారు. అన్ని రకాల రుణాలు కలిపి గత ఆర్థిక సంవత్సరంలో రూ.5.71 లక్షల కోట్ల మేర తీసుకోగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.7.1లక్షల కోట్ల మేర తీసుకోవాలని ప్రతిపాదించారు. వడ్డీల చెల్లింపులకు ఈ బడ్జెట్‌లో రూ.6,60,471 కోట్లు కేటాయించారు.

## ఇంధనం మండింది



ఈనాడు, హైదరాబాద్: ఇంధన ధరలు సామాన్యులకు మరింత భారమయ్యాయి. ప్రస్తుత బడ్జెట్‌లో పెట్రోలు, డీజిలుపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.1 చొప్పున పెంచారు. వాటిపై రోడ్డు-మౌలిక వసతుల సెస్సునూ లీటరుకు రూ.1 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.28 వేల కోట్లకుపైగా నిధులు సమకూరనున్నాయి. మూల ధరకు ఎక్సైజ్ సుంకం కలిపిన తర్వాత స్థానిక అమ్మకపు పన్ను లేదా వ్యాట్‌ను విధిస్తారు. వాటి పెరుగుదలను కూడా పరిగణనలోకి తీసుకుంటే పెట్రోలు ధర లీటరుకు రూ.2.58కిపైగా, డీజిలు ధర లీటరుకు రూ.2.38కిపైగా పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో పెట్రోలుపై రూ. 2.60, డీజిలుపై రూ. 2.56 మేర పెరిగింది. దీనివల్ల తెలంగాణలోని వాహనదారులపై ప్రత్యక్షంగా ఏడాదికి రూ. 1,095 కోట్లు, పరోక్షంగా మరో రూ. 400 కోట్ల వరకు భారం పడుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో 1.09 కోట్ల వరకు వాహనాలు ఉన్నాయి. అన్ని చమురు సంస్థలు కలిపి రాష్ట్రంలో సగటున రోజుకు 1.90 కోట్ల లీటర్ల పెట్రోలు, డీజిలును విక్రయిస్తున్నాయి. ఇందులో డీజిలు 1.30 కోట్ల లీటర్లు కాగా, పెట్రోలు 60 లక్షల లీటర్లు విక్రయం అవుతోంది. ఈ పెంపుదలతో ఏడాదికి లెక్కేస్తే వాహనదారులపై అధికభారం పడనుంది.

### కనిపించని భారం..

కేంద్ర సెస్సుతో పరోక్షంగా కూడా సామాన్యుల నడ్డి విరగనుంది. ప్రయాణ ఛార్జీల నుంచి నిత్యావసర వస్తువులపైనా ఇది ప్రభావాన్ని చూపనుంది. కూరగాయలు, ఇతర నిత్యావసరాలపై సుమారు రూ. 400 కోట్ల వరకు ప్రభావం పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే నష్టాల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణ ఆర్టీసీపై సెస్సు గణనీయ ప్రభావం చూపనుంది. ఆర్టీసీ రోజువారీగా ఆరున్నర లక్షల లీటర్ల డీజిలు వినియోగిస్తోంది. రూ. 2 పెంపుదలతో ఏడాదికి రూ. 45 కోట్ల వరకు భారం పడనుంది. ఇదేకాకుండా రోజువారీగా పెట్రోలు డీజిలు ధరల్లోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. డీజిల్ భారం తడిసి మోపెడు అవుతుందని అధికారులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

### ముడి చమురుపై దిగుమతి సుంకం

ముడి చమురుపై టన్నుకు రూపాయి చొప్పున కస్టమ్స్ లేదా దిగుమతి సుంకాన్ని విధించనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. మనదేశం ఏటా సగటున 22 కోట్ల టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ లెక్కన ఖజానాకు రూ.22 కోట్లు అదనంగా అందనున్నాయి. ప్రస్తుతం ముడి చమురుపై కస్టమ్స్ సుంకమేదీ లేదు.

| సుంకం | లీటరు పెట్రోలుపై.. | | లీటరు డీజిలుపై.. | |
|---|---|---|---|---|
| | ఇప్పటివరకు | తాజాబడ్జెట్‌లో | ఇప్పటివరకు | తాజబడ్జెట్‌లో |
| బేసిక్ ఎక్సైజ్ సుంకం | రూ.2.98 | రూ.2.98 | రూ.4.83 | రూ.4.83 |
| ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం | రూ.7 | రూ.8 | రూ.1 | రూ.2 |
| రోడ్డు–మౌలిక వసతుల సెస్సు | రూ.8 | రూ.9 | రూ.8 | రూ.9 |
| మొత్తం ఎక్సైజ్ సుంకం | రూ.17.98 | రూ.19.98 | రూ.13.83 | రూ.15.83 |

## రాష్ట్రానికి మరిన్ని విద్యుత్ బస్సులు

- హైదరాబాద్‌తో పాటు మరో మూడు నగరాల్లో పరుగు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో విద్యుత్తు బస్సులకు రూ.పది వేల కోట్లను కేటాయించడంతో రాష్ట్రానికి మరిన్ని విద్యుత్(ఎలక్ట్రిక్) బస్సులు లభించేందుకు మార్గం సుగమం అవుతోంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం 40 విద్యుత్ బస్సులు నడుస్తున్నాయి. కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఎంపిక చేసిన నగరాల్లో విద్యుత్తు బస్సులను ప్రయోగాత్మకంగా నడపాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఆ నగరాల జాబితాలో హైదరాబాద్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వంద బస్సులను కోరితే కేంద్రం ఒక్కో బస్సుకు రూ.కోటి వరకు రాయితీ ఇచ్చి 40 బస్సులకు అంగీకరించింది. రెండో దశలో ఒక్కో బస్సుకు రూ.50 లక్షల రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఎన్ని బస్సులు అవసరమో నివేదిక పంపాలని కేంద్రం ఇప్పటికే రాష్ట్రాన్ని కోరగా సుమారు 500 బస్సులు అవసరమని అధికారులు ప్రతిపాదనలను రూపొందించారు. హైదరాబాద్‌తోపాటు కరీంనగర్, వరంగల్, వికారాబాద్‌లలో విద్యుత్ బస్సులను నడపాలని అధికారులు యోచిస్తున్నారు. మునుపటితో పోలిస్తే కేంద్రం రాయితీని తగ్గించిన నేపథ్యంలో కనీసం వంద నుంచి 150 బస్సుల వరకు రాష్ట్రానికి కేటాయించే అవకాశం ఉందని ఉన్నతాధికారి ఒకరు శుక్రవారం 'ఈనాడు'తో చెప్పారు.

## చురుగ్గా చంద్రయాన్-2 ప్రయోగ సన్నాహాలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్‌లో చంద్రయాన్-2 ప్రయోగ సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. గురువారంనాటికి జీఎస్ఎల్‌వీ-మార్క్3 వాహకనౌక అనుసంధానం పూర్తయింది. రాత్రి వాహక నౌకకు మరిన్ని పరీక్షలు నిర్వహించారు. ఆదివారం జీఎస్ఎల్‌వీ-మార్క్3 వాహనాన్ని వాహన అనుసంధాన భవనం నుంచి రెండో ప్రయోగ వేదికకు తీసుకురానున్నారు. అక్కడికి చేరుకున్నాక వారంపాటు వివిధ పరీక్షలు నిర్వహించనున్నారు. చంద్రయాన్-2 ప్రయోగ ప్రత్యక్ష వీక్షణకు రాష్ట్రపతి రానున్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా వస్తారని తెలుస్తోంది. తెలుగురాష్ట్రాల గవర్నర్‌తో పాటు తమిళనాడు, పుదుచ్చేరి గవర్నర్లు కూడా వస్తారని తెలిసింది. రాజ్యసభ సభ్యులు వంద మంది కూడా ప్రయోగాన్ని వీక్షించనున్నట్లు తెలుస్తోంది.

## నేడు, రేపు తేలికపాటి వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శని, ఆదివారాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. శుక్రవారం అత్యధికంగా ముజాహిద్‌పూర్‌లో 44.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

## ఘనంగా తానా మహాసభలు ప్రారంభం

ఈనాడు, అమరావతి: అమెరికా వాషింగ్టన్ డీసీలోని వాల్టర్ ఈ వాషింగ్టన్ కన్వెన్షన్ సెంటర్‌లో తానా 22వ మహాసభలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సంఘం అధ్యక్షుడు సతీశ్ వేమన, నీలిమ దంపతులు జ్యోతి వెలిగించి సభలను ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ ముఖ్యఅతిథిగా హాజరై 'ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్' అంశంపై ప్రసంగించారు. రెండో రోజు శుక్రవారం... ఇదే వేదికపై 150 మంది చిన్నారులు ఒక్క చోట చేరి 60 నిమిషాల పాటు ప్రదర్శించిన నృత్యరూపకం ఔరా అనిపించింది. తొలుత వాషింగ్టన్ వీధుల్లో మేళతాళాలతో తానా పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీలు సీఎం రమేశ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మల్లు భట్టి విక్రమార్క, పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. విశ్వంజీ, పరిపూర్ణానంద స్వామీజీలు తమ ప్రసంగాలతో ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లారు.



తానా మహాసభలను ప్రారంభిస్తున్న అధ్యక్షుడు సతీష్ వేమన, నీలిమ. చిత్రంలో మూల్పూరి వెంకటరావు, ఎడ్ల హేమప్రసాద్

తానా కాన్ఫరెన్స్ ఛైర్మన్ కొడాలి నరేన్, సమన్వయకర్త మూల్పూరి వెంకట్రావు, రవి గోగినేని, తానా కాబోయే అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి, తానా పూర్వ అధ్యక్షుడు జయరామ్ కోమటి, జంపాలచౌదరి, నాదెండ్ల గంగాధర్, తానా ఎగ్జిక్యూటివ్, ఫౌండేషన్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో వరుణ యాగం

శ్రీశైలం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న కారీరీష్టి(వరుణ)యాగం శనివారం పూర్ణాహుతితో ముగియనుంది. శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని అక్క మహాదేవి అలంకార మండపంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న యాగాన్ని ఈవో శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షించారు. ఈ హోమ క్రతువులో నల్లటి గుర్రాన్ని, పొట్టేలును మంత్రజలంతో సంప్రోక్షించారు. పండితులు నల్లని దుస్తులు ధరించి హోమాన్ని నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది.

## గొలుసు కట్టు నిర్లక్ష్యం!

- తూముల నిర్మాణంలో ఎడతెగని జాప్యం
- పాత బిల్లులకు గుత్తేదారుల పట్టు
- మూడో వంతు కూడా పూర్తికాని పనులు

| తూముల నిర్మాణ పురోగతి ఇలా | |
|---|---|
| మొత్తం తూములు | : 2911 |
| సాంకేతికంగా మంజూరైనవి | : 2123 |
| నిర్మాణ వ్యయం | : రూ.418 కోట్లు |
| ఇప్పటివరకు పూర్తయింది | : 552 |

ఈనాడు, హైదరాబాద్: ప్రాజెక్టులను చెరువులతో అనుసంధానించి ఏడాది పొడవునా నీటితో కళకళలాడేలా చేయాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ ఏడాది నెరవేరేలా లేదు. దీనికోసం ప్రాజెక్టుల కాలువలపై తూములను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినా పనులు అనుకున్న స్థాయిలో ముందుకు సాగడం లేదు. గుత్తేదారులు పాత బిల్లుల కోసం పట్టుబడుతుండటం.. చెల్లింపుల దిశగా ఇంజినీర్లు హామీ ఇవ్వకపోవడం పనులకు ప్రధాన అడ్డంకిగా మారింది.

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ప్రాజెక్టుల్లోకి చేరే నీటిని మళ్లించే క్రమంలో కాల్వలకు సమీపంలో ఉన్న గొలుసు కట్టు చెరువులను ప్రభుత్వం గుర్తించింది. కాలువలకు తూములు నిర్మించి వాటి ద్వారా గొలుసు కట్టు వ్యవస్థలోకి నీటిని వదిలి, ఒక్కో చెరువును నింపుతూ వెళ్లాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా కాళేశ్వరం పరిధిలో 785, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మొదటి దశ కింద 782, రెండో దశ కింద 309, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద 162, కల్వకుర్తి ఎత్తిపోతల కాల్వలపై 230, దేవాదుల పరిధిలో 113, ఏఎంఆర్‌పీ కింద 39, సింగూరు ప్రాజెక్టు కాల్వలపై 67, ఇలా పలు ప్రాజెక్టులపై తూములను నిర్మించేందుకు నిర్ణయించారు. కాలువపై ఎక్కడ తూము నిర్మిస్తే నీళ్లు చెరువులకు నేరుగా చేరుతాయనేది గూగుల్ పటాలు, క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి నిర్ణయించి టెండర్లు పిలిచారు.

### ముందుకు పడని అడుగులు

తొలి దశలో 5731 చెరువులను నింపేలా ప్రధాన ప్రాజెక్టుల కాలువలపై 2,911 తూములు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 552 మాత్రమే పూర్తయ్యాయి. ఈ నెల 15 నాటికి అన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించగా పలు కారణాలతో పనుల్లో ముందడుగు పడటం లేదు.

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తూముల నిర్మాణానికి గుత్తేదారులు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. "గతంలో చేసిన మిషన్ కాకతీయ చెరువులు, ఇతర పనుల్లో తమకు బిల్లులు అందలేదని, ఇప్పుడు ఈ పనుల బిల్లులైనా సకాలంలో వస్తాయో? లేదో" అనే సందేహాలను గుత్తేదారులు ఇంజినీర్ల వద్ద వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో నిర్మాణాలు చేపట్టేందుకు మరికొన్ని రోజులు గడువు వచ్చిందని, పూర్తయిన నిర్మాణాల చిత్రాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే బిల్లులు విడుదలవుతాయని ఇంజినీర్లు సూచిస్తున్నా గుత్తేదారులు ఆ దిశగా స్పందించడం లేదని సమాచారం. ఈ పరిస్థితి ఇలా కొనసాగితే గొలుసుకట్టు చెరువులు నింపడం అసాధ్యమని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

## గ్రహం అనుగ్రహం

6–7–2019 శనివారం

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; ఆషాఢ మాసం; శుక్ల పక్షం
చవితి: సా.4.41 తదుపరి పంచమి
మఘ నక్షత్రం: రా.2.19 తదుపరి పుబ్బ
అమృతఘడియలు: రా.12.04 నుంచి 1.34 వరకు
వర్జ్యం: మ.3.07 నుంచి 4.36 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.34 నుంచి 7.17 వరకు
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.5-34; సూర్యాస్తమయం: సా.6.33
పునర్వసు కార్తె –ప్రారంభం

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| నెల్లూరు | 39.0 | 32.0 |
| తిరుపతి | 38.4 | 29.5 |
| కడప | 37.0 | 28.0 |
| తాడేపల్లిగూడెం | 37.0 | 27.0 |
| నల్గొండ | 36.0 | 23.8 |
| సూర్యాపేట | 35.0 | 29.0 |
| ఆదిలాబాద్ | 34.8 | 26.2 |
| రామగుండం | 34.6 | 27.0 |
| గుంటూరు | 34.0 | 27.8 |
| నిజామాబాద్ | 33.9 | 26.1 |
| విజయవాడ | 33.6 | 27.4 |
| ఖమ్మం | 33.0 | 28.0 |
| హన్మకొండ | 33.0 | 27.0 |
| మహబూబ్‌నగర్ | 31.9 | 24.6 |
| హైదరాబాద్ | 30.6 | 24.6 |
| విశాఖపట్నం | 30.0 | 26.8 |
| కరీంనగర్ | 30.0 | 24.0 |

గ్రూప్-2&3 SI-PC
TET & GURUKULA LONG TERM
RRB NTPC BATCHES
హరీష్ THE BEST అకాడమీ
HANAMKONDA. 8341116915, 83175 31594

TET EM/TM PAPER-I PAPER-II
FREE DEMO July 7th @10am
గురుకుల టీచర్స్ All Subjects
కొత్త బ్యాచ్‌లు జులై 14న ప్రారంభం
Winners STUDY CIRCLE
హన్మకొండ 9701100660

షైన్ ఇండియా అకాడమీ
TSPSC GROUP-II
LONG TERM BATCH
JULY 8th
Hyd: 95731 93746

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.
NOTIFICATION
Separate Online Applications are invited from Indian Citizens and Others, who have secured cut off score and more in NEET-2019 for admission into Management Quota (Category B & C) seats in MBBS/BDS Courses in Private Un-aided Non-Minority, Minority Medical and Dental Colleges and NRI Quota Seats in Sri Padmavathi Medical College for Women in the State of Andhra Pradesh for the academic year 2019-20 from 11.00 AM on 07.07.2019 upto 5.00 PM on 15.07.2019 on http://appvtmedadm.apntruhs.in.
For details read the prospectus available on the University website: http://ntruhs.ap.nic.in. On 06.07.2019 AN. Candidates are advised to watch the University website regularly for further Notifications and Instructions
VIJAYAWADA. Date: 05.07.2019. Sd/- REGISTRAR

Eenadu epaper




## మేడిగడ్డ వద్ద 11,000 క్యూసెక్కుల ప్రవాహం

### బ్యారేజీ గేట్ల మూసివేత ప్రారంభం

కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి నిల్వకు అనుగుణంగా తొలి బ్యారేజీ మేడిగడ్డ గేట్లు మూసివేసే ప్రక్రియ శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. 85కు గాను 20 గేట్లను ఇంజినీరింగ్ అధికారులు మూసివేశారు. రెండు రోజుల్లో అన్ని గేట్లను మూసివేస్తారు. గేట్లను మూసివేస్తుండడంతో బ్యారేజీ జల కళను సంతరించుకుంది. ప్రస్తుతం అక్కడ 11,000 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. మరోవైపు కన్నెపల్లి పంపుహౌజ్‌లోని పంపులకు ట్రయల్‌రన్ మొదలుకాగా పంపుహౌజ్ నుంచి 13.2 కిలోమీటర్ల పొడవున్న గ్రావిటీ కాలువ ద్వారా నీరు అన్నారం బ్యారేజీకి చేరుతోంది. మూడో పంపులో ట్రయల్‌రన్ నిర్వహణకు శుక్రవారం సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 20 లేదా 28న ముఖ్యమంత్రి కేసీఆర్ మరోమారు కాళేశ్వరానికి వచ్చే అవకాశం ఉన్నందున పంపుల ట్రయల్‌రన్ పనులను అధికారులు వేగవంతం చేస్తున్నారు. సీఎం వచ్చేలోపు కనీసం ఆరు పంపులకు వెట్‌రన్ నిర్వహించి పూర్తిస్థాయిలో గోదావరి జలాలను గ్రావిటీ కాలువలో ఎత్తిపోసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాళేశ్వరంలోని సాధారణ ఘాట్ల వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం 4.04 మీటర్లుగా నమోదైంది.

– న్యూస్‌టుడే, మహదేవ్‌పూర్, కాళేశ్వరం

## ఇది తెలంగాణ ఘనత

### మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

ఈనాడు, హైదరాబాద్: కేంద్రప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వేలో జీఎస్‌డీపీకి సంబంధించి..దేశంలోనే మొట్టమొదటి స్థానంలో తెలంగాణ నిలవడం గర్వకారణమని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ సాధించిన ఘనతకు ఇది నిదర్శనమని శుక్రవారం ట్విటర్ ద్వారా తెలిపారు. రాష్ట్ర ఆర్థిక రంగం- జాతీయ సగటు (11 శాతం) కంటే అధికంగా (14.9 శాతం) వృద్ధి (సాధించిందని పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను కేంద్ర ఆర్థిక సర్వే ప్రశంసించిందని, కుటుంబ సర్వే 25 శాఖలకు ఉపయోగపడినట్లు వెల్లడించిందని ఆమె వివరించారు.

## అమెరికాకు సోనియా, రాహుల్

### గాంధీ కుటుంబీకులు లేకుండానే ఈసారి సీడబ్ల్యూసీ

ఈనాడు, దిల్లీ: త్వరలో నిర్వహించనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో సోనియాగాంధీ కుటుంబానికి చెందిన ఎవరూ పాల్గొనే అవకాశం లేదు. ఆమె వైద్య పరీక్షల నిమిత్తం శుక్రవారం అమెరికాకు బయల్దేరారు. రాహుల్‌గాంధీ కూడా ఆమెతో ఉన్నారు. ప్రియాంక గాంధీ వాద్రా తన భర్త రాబర్ట్ వాద్రా చికిత్స నిమిత్తం ఇప్పటికే అమెరికాలో ఉన్నారు. కాంగ్రెస్ తదుపరి అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియ కోసం వచ్చే వారంలోనే సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

## మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టండి: సీఎస్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎస్ ఎస్‌కే జోషి, మున్సిపల్ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం యాదాద్రి భువనగిరి, మెదక్ జిల్లాలకు ప్రత్యేక బృందాలను పంపిందన్నారు. ఆ బృందాలు పరిశీలించి సంతృప్తి చెందాకే ఎన్నికల షెడ్యూలు ప్రకటించే అవకాశం ఉందన్నారు. శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులతో కొత్త ప్రెసిడెన్షియల్ ఆర్డర్ (రాష్ట్రపతి ఉత్తర్వులు), మున్సిపల్ ఎన్నికలపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. 2021 జనాభా లెక్కల నిర్వహణకు సంబంధించి మహబూబ్‌నగర్, వరంగల్ అర్బన్, నిజామాబాద్ జిల్లాల్లో ప్రీ టెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా తెలిపారు. ఆగస్టు 12 నుంచి సెప్టెంబరు 30 వతేదీ వరకు ఈ పరీక్షను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

# మీ ఇంట్లో ఎందరో మీరే చెప్పండి

- ఎవరి సమాచారం వారే ఆన్‌లైన్లో నమోదు చేయొచ్చు
- ఆ వివరాలతో ఇంటి వద్దకు జనగణన సిబ్బంది
- ప్రత్యేక యాప్‌ను రూపొందించిన కేంద్రం
- జనాభా లెక్కల్లో తొలిసారి ప్రయోగం



ఈనాడు, హైదరాబాద్: దేశమంతటా కొత్త జనాభా లెక్కల సేకరణ యజ్ఞం నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. తొలిసారి ప్రజలు ఎవరికి వారే ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసేందుకు ప్రయోగాత్మకంగా అవకాశం కల్పించబోతున్నారు. గతంలో జనగణన సిబ్బంది ఇంటింటికి వచ్చి ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేసేవారు. ఈసారీ అదే విధానం కొనసాగుతుంది. దాన్ని మరింత వేగంగా, పక్కాగా చేసేందుకు ప్రజల నుంచి నేరుగా ఆన్‌లైన్ ద్వారా మొబైల్ యాప్‌లో వారి కుటుంబ వివరాలు సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఎలా అంటే..

పదేళ్లకోసారి జనాభా లెక్కలను ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సిబ్బంది సేకరిస్తారు. గతంలో 2010-11లో దేశమంతా జనగణన జరిగింది. తిరిగి 2020-21లో పూర్తిచేయాలి. ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి జనగణన 2010-11లో జరిగింది. రాష్ట్ర విభజన తరవాత తొలిసారి వచ్చే ఆర్థిక సంవత్సరంలో జరగనుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు విడివిడిగా జనగణన చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల ఉమ్మడి జనగణన కార్యాలయం ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉంది. ఏపీకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జనగణనలో తొలి దశ కింద దేశవ్యాప్తంగా కట్టడాలు, ఇళ్లు, భవనాలు, పాకలు ఇలా ప్రతీ ఒక్కదానిని లెక్కిస్తారు. దీంతో సమాంతరంగా 2020 జూన్-సెప్టెంబరు మధ్యకాలంలో ప్రతీ కుటుంబం వివరాలను నమోదు చేస్తారు. వీటిని సేకరించే సమయంలోనే ప్రతీ కుటుంబంలో ఒకరి సెల్‌ఫోన్ నంబరును సేకరిస్తారు. మొబైల్ యాప్ ద్వారా కుటుంబ వివరాలను ఇస్తామని ఆసక్తి చూపేవారి సెల్‌ఫోన్ నంబరుకు యాప్ లింకును జనాభా లెక్కల శాఖ పంపుతుంది. ఈ లింకును 2021 జనవరిలో పంపే అవకాశాలున్నాయి. దానిని డౌన్‌లోడ్ చేసుకుని 2021 ఫిబ్రవరిలోగా కుటుంబ వివరాలన్నీ నమోదు చేయాలి.

### వచ్చే నెలలో ప్రయోగాత్మకంగా..

ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో జరిపే ముందు వచ్చే నెలలో ప్రయోగాత్మకంగా నిర్వహించబోతున్నారు. తెలంగాణ, ఏపీల్లో నిజామాబాద్, గుంటూరు జిల్లాలను ఇందుకు ఎంపిక చేయాలని తాజాగా ప్రతిపాదించారు. ఈ జిల్లాల్లో ఏదైనా ఒక పట్టణం, గ్రామంలో 150 ఇళ్ల బ్లాక్‌ను గుర్తించి అక్కడ ప్రయోగాత్మకంగా వివరాలు సేకరిస్తారు. అక్కడ ఎదురయ్యే లోటుపాట్లను సమీక్షించి వచ్చే ఏడాది సమగ్ర జనగణనకు వెళతారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలను తీసుకుని సదరు వ్యక్తి ఇంటికి జనగణన ఉద్యోగి వచ్చి ఇంటి పెద్ద సంతకం సేకరిస్తారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలు కచ్చితమేనా? కాదా? అన్నది పరిశీలిస్తారు. అవి నిర్ధరణ అయిన తరవాత తుది రికార్డుల్లో కంప్యూటరీకరిస్తారు. కుటుంబాల లెక్కలన్నీ తేలిన తరవాత వ్యక్తిగత వివరాల గురించి సమాచారం సేకరిస్తారు. వృత్తి, ఎస్సీ, ఎస్టీ, మతం, భాష, విద్యార్హత తదితర అనేక అంశాల గురించి వివరాలు నమోదు చేస్తారు.

ఈ సేకరణ అంతా 2021 మార్చిలోగా పూర్తిచేయాలి. తరవాత వాటిని వివిధ విభాగాల కింద క్రోడీకరించి దశలవారీగా కేంద్రం విడుదల చేస్తుంది. జనాభా లెక్కల సేకరణ అంతా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే చేస్తారు. సాధారణంగా ఉపాధ్యాయులను ఈ క్రతువుకు వినియోగిస్తారు. అధికారికంగా లెక్కలను మాత్రం కేంద్రమే విడుదల చేస్తుంది. 2022 నాటికి ఈ వివరాలు బయటికి వచ్చే అవకాశం ఉంది.

## చిత్ర పరిశ్రమలో మహిళలపై వేధింపుల నిరోధానికి ఉపసంఘం

- సినీ ప్రముఖులు, సంఘాలతో భేటీ
- ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపుల నిరోధానికి ఉపసంఘాన్ని వేయాలని ప్రభుత్వ ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయించింది. ఈ కమిటీ ద్వారా చలనచిత్ర ప్రముఖులను, పరిశ్రమకు సంబంధించిన సంస్థలను, సంఘాలను కలిసి వారి అభిప్రాయాలను తీసుకోవాలని తీర్మానించింది. రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు అధ్యక్షతన శుక్రవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఇందులో స్త్రీశిశు సంక్షేమ సంచాలకురాలు విజయేంద్ర, ప్రాజెక్టు మేనేజర్ బి.గిరిజ, రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్, సీఐడీ అదనపు ఎస్పీ కవిత, సైబరాబాద్ అదనపు డీసీపీ పి.ఇందిర, ఏసీపీ నర్మద, కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఇ.గంగాధర్, కమిటీ సభ్యులు వాసంతి, రమాదేవి, ఝాన్సీ, సుప్రియ, ప్రతినిగం, సినీప్రముఖులు ఎన్.శంకర్, తమ్మారెడ్డి భరద్వాజ, సి.కల్యాణ్, మురళీమోహన్‌రావు, కేఎల్ నారాయణ, పరుచూరి గోపాలకృష్ణ, ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. వేధింపుల నిరోధక చర్యల గురించి చర్చించారు. ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై పూర్తి సమాచారం సేకరించి, అధ్యయనం చేయాలని భావించారు. ఉప సంఘం ద్వారా సినీప్రముఖులను కలిసి సలహాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయించారు.

## 87 డిగ్రీ కళాశాలల్లో ఒక్కరూ చేరలేదు

### వాటిని మూసివేస్తే మంచిది: నవీన్ మిత్తల్

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) పరిధిలోని 87 డిగ్రీ కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ప్రవేశం పొందలేదు. దోస్త్ పరిధిలో 980 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలుండగా.. ఇప్పటివరకు మూడు విడతల్లో సీట్లను కేటాయించారు. శుక్రవారంతో సీట్లు నిర్ధారణ చేసుకునే గడువు కూడా పూర్తయింది. 87 కళాశాలల్లో చేరేందుకు ఎవరూ ఐచ్ఛికాలు ఇచ్చుకోలేదని.. వాటిని మూసివేస్తే మంచిదని కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ అభిప్రాయపడ్డారు.

## టీజీజీడీఏ (డీహెచ్) అధ్యక్షులుగా డా.లాలూప్రసాద్ రాఠోడ్

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ- డీహెచ్) అధ్యక్షులుగా డా.లాలూప్రసాద్ రాఠోడ్ ఎంపికయ్యారు. ఇప్పటి వరకు ఈ పదవిలో కొనసాగిన డా.సుధాకర్ పదోన్నతిపై వికారాబాద్ జిల్లా డీహెచ్‌ఓగా వెళ్లడంతో లాలూప్రసాద్‌ను నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన కార్యనిర్వాహక అధ్యక్షులుగా డా.కల్యాణ్ చక్రవర్తి, సెక్రెటరీ జనరల్‌గా డా.దీన్ దయాళ్, కోశాధికారిగా డా.ప్రశాంత్‌లు నియమితులయ్యారు.

MBBS, MD, MS
India & Abroad
MCI Regd. Colleges. Low Pack
Starts from 20 L, Year Wise Payment
India, Nepal, Central America, Armenia
GURU MITHRA, DSNR, HYD
9121317836, 9553170170

# రాతల్లోనే..రహదారి భద్రత

- ఏళ్లుగా ముసాయిదాల రూపకల్పనకే పరిమితం
- రెండింటిని సిద్ధం చేసినా లభించని ఆమోదం
- అభ్యంతరాల నేపథ్యంలో వాటిని సమీక్షించాలని ప్రభుత్వ యోచన



ఈనాడు, హైదరాబాద్: రహదారి భద్రత ముసాయిదా దస్త్రాలను దాటటం లేదు. రెండు మూడేళ్లుగా కాగితాలకే పరిమితమవుతోంది. రెండు ముసాయిదాలను రూపొందించినా ఆమోదానికి నోచుకోలేదు. త్వరలో జరిగే శాసనసభ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని భావించినా తాజా పరిణామాల నేపథ్యంలో అది కార్యరూపం దాల్చే అవకాశాలు కనిపించటంలేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

రోడ్డు ప్రమాదాలు అంతకంతకూ పెరుగుతుండటంతో సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ప్రమాదాల నియంత్రణకు ఆ కమిటీ పలు సూచనలు చేయటంతోపాటు కేరళ తరహాలో ప్రతి రాష్ట్రంలోనూ రహదారి భద్రత చట్టాన్ని రూపొందించాలని సిఫార్సు చేసింది. అందుకు అనుగుణంగా గడిచిన రెండు, మూడేళ్లుగా చట్టాన్ని రూపొందించేందుకు తెలంగాణ అధికారులు విస్తృతంగా అధ్యయనం చేశారు. ఆరేడు నెలల కిందట ఒక ముసాయిదాను రూపొందించారు. దాన్ని న్యాయశాఖ అధ్యయనానికి పంపేందుకు కసరత్తు చేస్తున్న తరుణంలో అసెంబ్లీ ఎన్నికలు రావటంతో ఆ వ్యవహారం అటకెక్కింది.

### అసమగ్రతతో మళ్లీ సందిగ్ధం

రహదారి భద్రతపై సురక్షిత రహదారి, రవాణా బిల్లు పేరుతో అధికారులు తాజాగా మరో ముసాయిదాను సిద్ధం చేశారు. దానికి చట్టబద్ధత కల్పించిన తర్వాత అవసరమైన మేరకు మరిన్ని అంశాలను చేర్చాలని భావించినా.. ఆ బిల్లు పూర్తిగా పోలీసు యంత్రాంగం కోణంలో ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. పోలీసు శాఖ నిర్వహించాల్సిన విధులకు తోడు, మరిన్నింటిని కూడా వారికే అప్పగించడం ఎంతవరకు సబబు? అనే ప్రశ్నలు ఉదయించినట్లు, అదనపు సిబ్బంది నియామకంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో దాని స్థానంలో మరొకటి సిద్ధం చేయాల్సిందిగా ప్రభుత్వం అధికారులను కోరింది. ఆ మేరకు అధికారులు మరోదఫా కసరత్తు చేసి మరో ముసాయిదాను రూపొందించారు. రహదారి భద్రత వ్యవస్థ(రోడ్ సేఫ్టీ అథారిటీ) సమావేశంలో దానిపై చర్చ జరుగుతుందని, ఆ తరవాత జరిగే మంత్రివర్గ సమావేశంలో దానికి ఆమోదం లభిస్తుందని అంచనా వేశారు. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో ముసాయిదాకు చట్టబద్ధత కల్పించాలనే కృతనిశ్చయంతో అధికారులుండగా.. అది కూడా సమగ్రంగా లేదన్న అభిప్రాయం వివిధ వర్గాల నుంచి వ్యక్తమైనట్లు సమాచారం. రహదారి భద్రత వ్యవస్థ సమావేశంలో కనీసం ఆ అంశం చర్చకు కూడా రాకపోవడానికి అదే కారణమని తెలిసింది. అందుకే దాన్ని సమీక్షించాలని రహదారులు-భవనాలు, రవాణా మంత్రిత్వ శాఖలు అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ పరిణామాలతో ముసాయిదాకు ఇప్పట్లో మోక్షం లభించే అవకాశాలు కనిపించటం లేదు.

## అమెరికా స్వాతంత్య్ర వేడుకల్లో సైనిక కవాతు

### మునుపెన్నడూ లేని రీతిలో నిర్వహించిన ట్రంప్

వాషింగ్టన్: దేశ సైనిక శక్తిని చాటిచెప్పేలా భారీ కవాతుతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'అమెరికాకు వందనం' పేరుతో ప్రత్యేకంగా ప్రసంగించారు. గత 70 ఏళ్లలో స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం చేసిన తొలి అధ్యక్షుడిగా ఆయన నిలిచారు. ప్రస్తుతం తమ దేశం మునుపెన్నడూ లేనంత బలీయంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. మిలిటరీ శక్తికి తోడుగా త్వరలో అంతరిక్ష బలగాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. అంగారకుడిపై అమెరికా జెండా ఎగిరే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు. దేశ రాజధాని వాషింగ్టన్‌లో నిర్వహించిన ఈ స్వాతంత్య్ర వేడుకలకు గురువారం వేలాదిమంది హాజరయ్యారు. అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్, దేశ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ తదితరులు పాల్గొన్నారు. 1776 జులై 4న బ్రిటన్ నుంచి అమెరికా స్వాతంత్య్రం పొందింది.

## తిరుమలేశుడి జూన్ నెల హుండీ ఆదాయం రూ.100 కోట్లు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలేశుడికి జూన్ నెలలో రూ.100.37 కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. మొత్తం 24.66 లక్షల మంది భక్తులు దర్శించుకోగా.. 1.13 కోట్ల లడ్డూలను తితిదే అందజేసింది.

**ఆన్‌లైన్‌లో 55 వేల సేవా టికెట్లు విడుదల:** తిరుమల స్వామివారి ఆర్జిత సేవలకు సంబంధించి అక్టోబరు మాసానికి 55,355 టికెట్లను శుక్రవారం ఉదయం తితిదే విడుదల చేసింది.

VASAVI COLLEGE OF ENGINEERING
(AUTONOMOUS)
(Private Un-aided Non-minority Institution)
(Sponsored by Vasavi Academy of Education)
(Affiliated to Osmania University & Approved by AICTE)
9-5-81, Ibrahimbagh, Hyderabad - 500 031. TS.

NOTIFICATION

Academic Rules & Regulations for B.E. Course

The College has been conferred with autonomous status by the University Grants Commission and Osmania University from the academic year 2014-15 for a period of six years. In pursuance of the provisions of autonomy and its objectives, the College has made changes in the curriculum including introduction of courses in emerging areas, employability skills etc., and in the rules relating to examination, promotion and assessment of students which collectively have been detailed under "Academic Rules & Regulations for B.E. Course" after necessary approval of the Academic Council and the Board of Governors. The College has also implemented Choice Based Credit System (CBCS) with effect from the academic year 2016-17. Students are advised to visit the College website (www.vce.ac.in) and read these Rules & Regulations before opting for admission in the College for the academic year 2019-20.

6th July, 2019 Principal

# కిడ్నీ అమ్మితే రూ.కోటి ఇస్తా

- డబ్బు ఎరచూపి

### మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



సూర్యశివరాం శివ

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: మూత్రపిండం(కిడ్నీ) అమ్మితే రూ.కోటి ఇప్పిస్తానంటూ జనాన్ని నమ్మించి రూ.లక్షలు కాజేస్తున్న వ్యక్తిని రాచకొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రం మదురైలోని తెన్ని అంబసముద్రం గోవిందనగరం కన్నన్‌కోవిల్ స్ట్రీట్‌లో ఉంటున్న దీనదయాళన్ సూర్యశివరాంశివ (30) వ్యాపారి. ఇతను ఆన్‌లైన్‌లో 'కిడ్నీ డోనార్స్ బయర్స్ నెట్‌వర్క్' పేరుతో ఓ వెబ్‌సైట్ నిర్వహిస్తున్నాడు. కిడ్నీ ఫెడరేషన్ ఏజెంట్‌గా తనను తాను ప్రచారం చేసుకున్నాడు. దాన్ని చూసిన కొందరు అతన్ని సంప్రదించగా.. మూత్రపిండం అమ్మితే రూ.కోటి, అంతకన్నా ఎక్కువ ధర ఇప్పిస్తానంటూ నమ్మబలికేవాడు. మూత్రపిండం ఇచ్చే వారి ఖాతాలో ముందుగా 50 శాతం మొత్తాన్ని జమ చేస్తానని, ఇచ్చాక మిగతా 50 శాతం ఇస్తానని చెప్పేవాడు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో వారు ఎంచుకున్న ఆసుపత్రిలో మూత్రపిండం ఇవ్వవచ్చని కూడా నమ్మించేవాడు. తనను సంప్రదించిన వారికి కిడ్నీ ఫెడరేషన్ నకిలీ డోనార్ ధ్రువపత్రాన్ని, పలువురి ఖాతాలలో రూ.కోటి జమైనట్లు చూపే సంక్షిప్త సందేశాలను వాట్సాప్ చేసేవాడు. ముందుగా రూ.15 వేలు చెల్లించి ఫెడరేషన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించేవాడు. అతని సూచన మేరకు చాలామంది ఖాతాలో నగదు జమ చేశారు. పలుమార్లు హైదరాబాద్‌కు వచ్చిన అతను తనను సంప్రదించిన వారిని నేరుగా కలుసుకుని వైద్య పరీక్షలు, ఇతర రుసుముల కోసమంటూ మరింత దండుకున్నాడు. కొందరు అనుమానంతో అతనిచ్చిన చిరునామాకు వెళ్లగా అది బోగస్ అని తేలింది. వారిచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారని, మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు నిందితుడిని శుక్రవారం నేరేడ్‌మెట్‌లో అరెస్టు చేశారని సీపీ మహేష్ భగవత్ వెల్లడించారు.

పెద్దకర్మ



మా తండ్రిగారైన మీలా సత్యనారాయణ గారు 25 జూన్ 2019న మ. 3.50 గం॥లకు ఆకస్మిక మరణానికి చింతిస్తూ.. 07-07-2019 ఆదివారం 13వ దినమున G.V.V. ఫంక్షన్‌హాల్, శ్రీ అయ్యప్పస్వామి గుడి ఎదురుగా, సూర్యాపేట వద్ద మధ్యాహ్నం 1-00 గం॥లకు జరుపబడే పిష్టబంతికి హాజరై మా తండ్రిగారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని ప్రార్థిస్తూ...

ఆహ్వానించువారు:

కూతుళ్లు - అల్లుళ్లు: కోటగిరి విజయకుమారి - రాధాకృష్ణ; అనంతుల ఇందిర - ప్రభాకర్; సోమా రత్నకుమారి - మురళీమోహన్

కొడుకులు - కోడళ్లు: మీలా మహదేవ్ - విజయకుమారి; మీలా వాసుదేవ్ - వీరమణి; మీలా జయదేవ్ - నిర్మల

మనుమలు & మనుమరాళ్లు, మునిమనుమలు, మునిమనుమరాళ్లు

గమనిక: కార్డు అందనివారు ఇదే కార్డుగా భావించగలరు

PrithviSai Ads: 98499 72349

AMRITA
VISHWA VIDYAPEETHAM
School of Engineering
Inspired by Love, Guided by Knowledge



337/1A, Vengal Village, Thiruvallur Taluk & District, Tamil Nadu. Pin: 601 103

B.Tech.
– admissions at –
Chennai Campus

For more information
Visit
amrita.edu/chennai
Or Contact
+91 70360 31188

Eligibility Criteria
Physics, Chemistry & Mathematics - 50% of marks in each subject with an aggregate minimum of 60% in 10+2 examination or equivalent.
Age: Candidates, whose date of birth falls on or after 1st July, 1998

జరుపుకుంటున్నారు
3,00,000+
సంతృప్తి చెందిన Renault KWID కుటుంబాలు
RENAULT
Passion for life




రేంజ్ ₹ 2.86 లక్షల నుంచీ మొదలు#
₹ 3 333^ తక్కువ EMI
+ అదనపు ప్రయోజనాలు ₹ 20 000* వరకు
షోరూమ్ ఎక్స్‌ఛేంజ్ మేళా 6 మరియు 7 జూలై నాడు
Book on Paytm ₹5000 Paytm Cashback
4 YEARS OR 100 000 km** CATEGORY-FIRST WARRANTY
For further details, visit renault.co.in

For a test drive, SMS 'KWID' to 53030 or call on 1800 300 44444 (Open from Monday to Sunday, 7:00 am -11:00 pm). Also available in CSD. Special offers for Defence Personnel, Government, PSU and Corporate employees.

Terms and conditions apply. #Price mentioned is for KWID base variant for ex-showroom Hyderabad and is exclusive of local taxes. Offers may vary across variants and cities. Benefits are applicable only on select variants of 2019 manufacturing. **Warranty of 4 Years includes Manufacturer Warranty 2 Years or 50 000 km + Extended Warranty 2 Years or 50 000 km. ^₹ 3 333/- EMI is calculated on a loan amount of ₹ 199 400/- for a tenure of 84 months. Rate of interest may vary based on loan amount and tenure. Finance at the sole discretion of Renault Finance *Benefits up to ₹ 20 000 include cash benefit of ₹ 10 000 and exchange bonus of ₹ 10 000 for all versions except STD 0.8L, RXE 0.8L and RXL 0.8L. Exchange at the sole discretion of Renault Selection. For STD 0.8L, RXE 0.8L, RXL 0.8L- Benefits include cash benefit of ₹10 000 only. Additional offers available on select stocks only. The abovementioned offers are valid till 31st July, 2019. ##PayTM offer available on KWID variants across all authorised dealerships of Renault India Pvt Ltd. For detailed offers, visit www.renault.co.in/offers. Renault India Pvt. Ltd. reserves the right to change or modify the mentioned schemes and conditions without prior notice.

SHOWROOMS: TELANGANA: KARIMNAGAR: RENAULT Karimnagar Mob: +91 9582305983. MAHBUBNAGAR: RENAULT Mahbubnagar Mob: +91 7799766431. NIZAMABAD: RENAULT Nizamabad Mob: +91 7799739175. NIRMAL: RENAULT Nirmal Mob: +91 8527232744. KHAMMAM: RENAULT Khammam Mob: +91 8527234093. SIDDIPET: RENAULT Siddipet Mob: +91 8527235114. MANCHERIAL: RENAULT Mancherial Mob: +91 9582571953. WARANGAL: RENAULT Warangal Mob: +91 9582230038.

LOK | SAATCHI & SAATCHI

ఈనాడు

# లౌక్యంగా వడ్డన

నవీన భారత రూపకల్పనకు ప్రణాళికలు రచిస్తున్నామంటూ తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్- ఎన్డీయే రెండో ప్రభుత్వ తొలి బడ్జెట్ సమర్పణలో తనదైన ముద్ర వేశారు. సార్వత్రిక ఎన్నికల దరిమిలా ఆర్థిక మంత్రిత్వ శాఖ పగ్గాలు చేతులు మారాక సమయాభావం దృష్ట్యా మొన్న ఫిబ్రవరినాటి అనామతు ప్రతిపాదనల బాణీలోనే ఈసారి బడ్జెట్ వంటకం కొనసాగుతుందన్న అంచనాల్ని ఆమె చెల్లాచెదురు చేశారు. అప్పట్లో వెలుగుచూసిన ఎన్నికల పద్దుకు భిన్నంగా ఈసారి మహిళా ఆర్థికమంత్రి బడ్జెట్ కూర్పు విధివిధానాలనే మార్చేశారు! 2024నాటికి భారత్ అయిదు లక్షల కోట్ల డాలర్ల భారీ ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి కనీసం ఎనిమిది శాతం వృద్ధిరేటు అత్యావశ్యకమన్న తాజా సర్వే ఉద్బోధ నేపథ్యంలో- ఆ స్వప్న సాకారమే లక్ష్యమంటూ మంత్రి దశసూత్ర అజెండా వల్లెవేశారు. మౌలిక రంగానికి నవోత్తేజం మొదలు నదుల శుద్ధి వరకు, సేంద్రియ పద్ధతిలో ఆహారోత్పత్తి నుంచి ప్రజారోగ్య భద్రత దాకా విస్తృత కార్యాచరణను లక్షిస్తున్న బడ్జెట్ పరిమాణం 27 లక్షల 86 వేలకోట్ల రూపాయలకు ఎగబాకింది. నిరుటి బడ్జెట్ ప్రతిపాదనలకన్నా ఈ రాశి మూడు లక్షల 44 వేలకోట్ల రూపాయలు అధికం! తమ ప్రభుత్వ ప్రతి పథకానికి, కార్యక్రమానికి 'గావ్, గరీబ్, కిసాన్' కేంద్ర బిందువులని ఘనంగా చాటిన ఆర్థిక మంత్రి వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలకు ప్రత్యేకించింది మొత్తం బడ్జెట్‌లో సుమారు అయిదు శాతమే! పెట్టుబడి లేని వ్యవసాయంపై దృష్టి సారించామని, రైతుల రాబడి రెండింతలయ్యేందుకు అది దోహదపడుతుందన్న హామీ ఉత్తచేతులతో మూరలేసిన చందమే. 'కిసాన్ సమ్మాన్' అల్పసంతోషులను కొంత ఊరడిస్తున్నా, రైతుకు జీవన భద్రత కల్పించగల విశేష చొరవ ఈ బడ్జెట్ కసరత్తులోనూ కొరవడింది. రైతాంగంలో కేవలం ఆరు శాతానికే దక్కుతున్న కనీస మద్దతు మదింపు విధానంపై విమర్శల్ని గాలికొదిలేసిన ప్రభుత్వం, కొత్తగా గ్రామీణ వ్యవసాయాధారిత పరిశ్రమలకు విస్తృత ప్రాధాన్యం ఇస్తామంటోంది. పొలాల్లో సంతోషం విరబూయనిదే గ్రామీణ భారత సముద్ధరణ కోసమంటూ ఎవరేం చర్యలు తలపెట్టినా, ఆ యత్నం అసంపూర్ణంగా అరకొరగానే మిగులుతుంది!

మోదీ ప్రభుత్వం మూడేళ్ల క్రితమే 'సాగరమాల' పేరిట రేవుల్ని నవీకరించి, నూతనంగా విశ్వశ్రేణి నౌకాశ్రయాలు నిర్మించి, వాటన్నింటినీ అనుసంధానిస్తూ కోస్తా ఆర్థిక మండళ్ల నెలకొల్పుతామన్నా- జలసిరుల మార్గావతరణ చురుకందుకోలేదు. ఇప్పుడు హైవేల గ్రిడ్ ఏర్పరచి జాతీయ రహదారుల పునర్నిర్మాణాన్ని కదం తొక్కిస్తామంటున్న కేంద్రం- రోడ్లు, రైల్వేలపై విపరీత తాకిడిని తగ్గించేందుకు నదీరవాణా విధానానికి ఓటేయడం వినసొంపుగా ఉంది. అంతే ఉత్సాహంతో 'గ్రామీణ సడక్ యోజన'ను ఉరకలెత్తిస్తామంటున్నా- నిరుటి కేటాయింపుల్ని పూర్తిగా ఖర్చు చేయకుండా, ఈసారి మళ్ళీ అంతే మొత్తం ప్రత్యేకించడం శంకలు రేకెత్తిస్తోంది. నిన్నటి బడ్జెట్ ప్రసంగంలో విస్తారంగా ప్రస్తావించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు కేటాయింపులు నిరుటికన్నా తెగ్గోసుకుపోయాయి. సాంకేతికత మప్పి కొత్తపుంతలు తొక్కిస్తామంటున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, 2018-19 సవరించిన అంచనాలతో పోలిస్తే కేటాయింపులు తరుగుపడ్డాయి. అటువంటి ఉపాధి హామీ పథకాలపై ఆధారపడే పరిస్థితే ఉత్పన్నం కాకుండా సేద్యాన్ని కుదుటపరచి గ్రామీణులు సొంతకాళ్లపై నిలదొక్కుకునేలా చేసే గట్టి కృషి కొన్నేళ్లుగా కొరవడుతోంది. ఈసారి బడ్జెట్లో సృజనాత్మక కళాకారులకు తోడ్పాటు ప్రకటించడం, భారత్‌నెట్ ద్వారా ప్రతి పంచాయతీని అనుసంధానిస్తామనడం- కొంతలో కొంత గుణాత్మక మార్పును సూచిస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, అంకుర సంస్థల బాగుసేతకు ఇప్పటిదాకా చేసింది తక్కువ, చేయాల్సింది మరెంతో ఉంది. ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలలో 60 శాతం దాకా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నందువల్ల వాటికి రుణాలు, విపణి సదుపాయాలను ఇనుమడింపజేస్తే- అటు వలసలూ తగ్గుతాయి, ఇటు నిరుద్యోగ సమస్యా ఉపశమిస్తుంది! విద్యుత్ వాహనాలు, డిజిటల్ చెల్లింపులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచిన బడ్జెట్- కనిష్ఠ కార్పొరేట్ పన్ను పరిధిలోకి రూ.400 కోట్ల వార్షిక టర్నోవరు కలిగిన కంపెనీలన్నింటినీ చేర్చడం ఎందరికో తీపి కబురు. ఒక్క రైల్వే మౌలిక సదుపాయాల నిమిత్తమే 2030 సంవత్సరంలోగా రూ.50 లక్షల కోట్లు కావాల్సి ఉండగా, వచ్చే అయిదేళ్ల అవసరాలకు నిధుల సమీకరణ నిమిత్తం కమిటీనొకదాన్ని నెలకొల్పుతామంటున్నారు. క్రితంసారి ద్రవ్యలోటు హద్దుల్లోనే ఉన్నట్లు చూపడానికి ఎకాయెకి లక్షా 45 వేలకోట్ల రూపాయల మేర బడ్జెట్ కేటాయింపులకు అంటకత్తెర వేశారన్న విశ్లేషణల నేపథ్యంలో- కార్యాచరణ ఒక కొలిక్కి వస్తేగాని ఏ పథకాన్నీ విశ్వసించే పరిస్థితి లేకుండాపోయింది.

ప్రధాని మోదీ మానస పుత్రికలనదగ్గ కిసాన్ సమ్మాన్ నిధి, జనారోగ్య యోజన, ఉజ్జ్వల యోజన, స్మార్ట్ నగరాలు, స్వచ్ఛభారత్ సహా ముఖ్యపద్దులు వేటికీ ఎంతెంత కేటాయించారో చెప్పకుండానే బడ్జెట్ ప్రసంగం ముగించిన నిర్మల- పన్నుల వడ్డన రూపేణా చేకూరే రాబడి విషయంలోనూ గోప్యత పాటించారు. బడ్జెట్ పత్రాల్ని తరచి చూస్తే బయటపడ్డ లోగుట్టు ఆమె గణిత చాణక్యానికి రుజువు. గత ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే కార్పొరేట్ పన్ను కింద రూ.1,45,000 కోట్లు, దిగుమతి సుంకం రూపేణా సుమారు రూ.43 వేలకోట్లు అదనంగా జమపడనున్నాయన్నది తాజా అంచనా. అత్యంత సంపన్నులు త్యాగాలకు సిద్ధపడాలంటూ మూడు శాతం, ఏడు శాతం చొప్పున రెండు శ్రేణుల్లో సర్‌ఛార్జీల బాదుడు ద్వారా రాబోయే ఆదాయం దాదాపు రూ.12 వేలకోట్లు. ప్రభుత్వానికి జమ పడే ప్రతి రూపాయిలోనూ 18 పైసలు వడ్డీ చెల్లింపులుగా తరలిపోతున్న దశలో ప్రభుత్వరంగ సంస్థల నుంచి లక్షా అయిదు వేల కోట్ల రూపాయల మేర పెట్టుబడుల ఉపసంహరణను లక్షిస్తున్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టే సూచనలున్నాయంటూనే పెట్రోలు, డీజిలుపై లీటరుకు రూపాయి ప్రత్యేక సుంకం వడ్డించిన అమాత్యులు, బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 12.5 శాతానికి పెంచేశారు. భారీ మౌలిక అజెండాను పట్టాలకు ఎక్కించడానికి ఈ వసూళ్లు అక్కరకు రావన్న స్పృహతోనే ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యాన్ని అభిలషిస్తోంది. వెలుపలి పెట్టుబడుల్నీ స్వాగతిస్తామంటోంది. మాటలు ఒకెత్తు, చేతలు మరొకెత్తు. సత్వర అనుమతులు, పారదర్శక నిబంధనలకు మారుపేరైన స్విట్జర్లాండ్, సింగపూర్ వంటివి విశ్వపోటీతత్వ సూచీలో తొలివరస ర్యాంకుల్ని ధీమాగా ఒడిసిపడుతున్నాయి. శ్రామిక శక్తి నైపుణ్యాలకు పదును పెట్టి, మౌలిక వసతుల రంగానా కాంతులీనడమే వాటి విజయరహస్యం. కోట్లాది భారతీయుల జీవన ప్రమాణాల మెరుగుదలకు, దీర్ఘకాలిక ప్రణాళికతో సమతులాభివృద్ధికి దోహదపడాలి బడ్జెట్లు. 'కనిష్ఠ ప్రభుత్వం- గరిష్ఠ పాలన'తో దశాబ్దకాలంలో అభివృద్ధి భారతాన్ని కళ్లకు కట్టే సత్తా ప్రస్ఫుటమైతేనే నిర్మలా సీతారామన్ బడ్జెట్ పరీక్షలో నెగ్గినట్లు!



తుమ్మల కిశోర్



# ఉపాధి పట్టుకొమ్మకు ఊతమేదీ?

అఖండ మెజారిటీతో రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన మోదీ ప్రభుత్వంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తొలి బడ్జెట్ కూర్పుపై కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. స్థూల దేశీయోత్పత్తి అయిదేళ్ళ కనిష్ఠానికి చేరడం; తయారీ, వ్యవసాయం సహా అన్ని కీలక రంగాల వృద్ధి క్షీణించడం, ఎగుమతులు తగ్గడం, నిరుద్యోగం గరిష్ఠ స్థాయికి చేరడం వంటి పలు ప్రతికూలతల మధ్య ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఏ ఒక్కరంగంపైనా వరాల జల్లులు కురిపించలేదు. రాబోయే అయిదేళ్లలో అద్భుత లక్ష్యాలను నిర్దేశించిన ఆర్థికమంత్రి వాటిని సాకారం చేసుకోడానికి నిర్దిష్ట కార్యాచరణనూ సూచించలేదు. గ్రామీణ భారతానికి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతోపాటు ఆ రంగానికి వచ్చే అయిదేళ్లలో వంద లక్షలకోట్ల రూపాయల పెట్టుబడుల లక్ష్యాన్ని ఆర్థికమంత్రి నిర్దేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ) రంగాన్ని ఆదుకొనే దిశలో బడ్జెట్‌లో కొన్ని ప్రతిపాదనలు చేయడం అభినందనీయం. ఈ రంగానికి రాయితీలు కల్పించేందుకు రూ.350 కోట్ల నిధులు మంజూరు చేయడంతోపాటు, ఈ రంగాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు ఓ ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నందువల్ల బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులు ఈ రంగానికి ఏ మాత్రం ఆదుకుంటాయన్నది ప్రశ్నార్థకం!

## సమస్యల సుడిగుండం

దేశంలో వ్యవసాయం తరవాత సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ)ల రంగం ఎంతో ప్రాధాన్యం సంతరించుకొంది. వృద్ధిరేటు పెంచే చోదకశక్తిగా, ఉద్యోగాల కల్పనలో అగ్రగామిగా నిలిచిన ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ రంగం కొన్నేళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రపంచవ్యాప్తంగా తయారీరంగంలో పెరుగుతున్న పోటీ, నూతన ఆవిష్కరణలు, ప్రభుత్వ విధానాలవల్ల ఈ రంగం పలు సమస్యలను ఎదుర్కొంటోంది. సకాలంలో బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల ద్వారా రుణాలు అందకపోవడం, మౌలిక సదుపాయాల కొరత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేకపోవడం వంటి సమస్యలతోనూ ఈ రంగం సతమతమవుతోంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు ప్రభావం తీవ్రంగా పడటంతో సంక్షోభం మరింత ముదిరింది. దీంతో నాలుగైదేళ్లుగా అటు ప్రభుత్వం, ఇటు రిజర్వు బ్యాంకు అనేక చర్యలు చేపట్టాయి. పలు పథకాలు ప్రవేశపెట్టాయి. ఈ రంగాన్ని ఆర్థికంగా ఆదుకొని సత్వర రుణసదుపాయం కల్పించే దిశలో ఆర్‌బీఐ రుణ పునర్ వ్యవస్థీకరణను వర్తింపజేసింది. అయినా ఆశించిన ఫలితాలు రాకపోగా, సంక్షోభం తీవ్రమై కొన్ని యూనిట్లు ఖాయిలా దిశగా అడుగులేస్తున్నాయి.

బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు (బీసీజీ) నివేదిక ప్రకారం, దాదాపు 40 శాతం ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలు వాటి రుణావసరాలను అనధికారిక మార్గాల (వడ్డీవ్యాపారులు, స్నేహితులు, బంధువులు) ద్వారానే తీర్చుకుంటున్నాయి. కేవలం 60 శాతం రుణాలనే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇతరత్రా ఆర్థిక సంస్థల ద్వారా పొందుతున్నాయి. అనధికారిక రుణాలపై అధిక వడ్డీవల్ల ఆయా సంస్థలు రుణ చెల్లింపులు చేయలేక ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మరో నివేదిక ప్రకారం దేశంలో ఉన్న ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలకు దాదాపు రూ.37 లక్షలకోట్ల మేర రుణసదుపాయం కావాల్సిఉండగా, కేవలం రూ.17 లక్షల కోట్లు మాత్రమే అందుతున్నాయి. మిగిలిన రూ.20 లక్షల కోట్ల రుణావసరాలకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. కొన్నేళ్లుగా పీఎస్‌బీలు మొండి బకాయిల సమస్యతో సతమతమవుతుండటం, కొన్ని బ్యాంకులు ఇంకా సత్వర దిద్దుబాటు (పీసీఏ) పరిధిలోనే ఉండటంతోపాటు ఇటీవల ఎన్‌బీఎఫ్‌సీలు తీవ్ర చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కోవడంవల్ల- చిన్న పరిశ్రమలకు కొత్త రుణాలు సకాలంలో అందడంలేదు. ఇక ఈ రంగంలో నిరర్థక ఆస్తుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. అందువల్ల ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈల సమస్యలకు పరిష్కారం చూపి, ఈ రంగాన్ని పునరుత్తేజపరచే లక్ష్యంతో రిజర్వుబ్యాంకు జనవరిలో 'సెబి' మాజీ ఛైర్మన్ యూకే సిన్హా ఆధ్వర్యంలో కమిటీని నియమించింది. సమగ్ర అధ్యయనం అనంతరం కమిటీ నివేదిక సమర్పించింది.

## చిన్న పరిశ్రమలకు దక్కని సాంత్వన

చిన్న పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఈ రంగానికి చేయూత ఇచ్చేందుకు కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖలు దాదాపు 140 పథకాలను అమలు చేస్తున్నాయి. ఆర్‌బీఐ ఈ రంగానికి అవసరమైన రుణసాయాన్ని అందించే దిశలో ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూ ఈ రంగంలో నిరర్థక ఆస్తుల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం ఈ రంగానికి అవసరమైన రుణసదుపాయాన్ని సకాలంలో అందించేందుకు పీఎస్‌బీలు తక్షణ చర్యలు చేపట్టాలని ఇందుకోసం ప్రతి బ్యాంకులోను ఒక జనరల్ మేనేజర్ స్థాయి ఉన్నతాధికారి ఆధ్వర్యంలో పూర్తి పర్యవేక్షణ జరగాలని ఆదేశాలు జారీచేసింది. ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈల నుంచి అందుకొన్న వస్తుసేవల తాలూకు బిల్లుల్ని నెలన్నర రోజులకు మించి పెండింగులో పెట్టినట్లయితే ఆ సంగతిని అన్ని ప్రైవేటు కంపెనీలూ అర్ధ సంవత్సర ఆదాయపన్ను పత్రాల్లో తప్పనిసరిగా వెల్లడించాలంటూ నిరుడు మోదీ ప్రభుత్వం ఆదేశించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలకూ ఈ నిబంధనను వర్తింపచేయాలని, ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈల బిల్లులకు సత్వరం మోక్షం దక్కేలా చూడాలని బడ్జెటుకు ముందస్తు సంప్రతింపుల్లో విజ్ఞాపనలు వెలుగుచూశాయి. ఆయా సంస్థలకు ప్రభుత్వాల నుంచి రావాల్సిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రిఫండుల్లోనూ తీవ్రజాప్యం జరుగుతుండటం- మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందమవుతోంది. అన్ని ప్రభుత్వ విభాగాలూ తమ మొత్తం సేకరణల్లో 20 శాతాన్ని అంకుర సంస్థల నుంచే తీసుకోవాలన్న నిబంధనలకు మన్నన దక్కకపోవడం వంటి సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇక్కడి ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలు విదేశీ మార్కెట్లనూ ఒడిసిపట్టేలా 'మార్కెట్ ఇంటెలిజెన్స్ సెల్' ఏర్పాటు చేసి వాటికి తగు సమాచారం, శిక్షణలు అందిస్తే- గోరంత దీపాల కాంతి సరిహద్దులు దాటగలదన్న ఆకాంక్షలూ వెలుగుచూశాయి. చిన్న సంస్థలకు చెల్లింపుల సమస్యలు తలెత్తకుండా ఓ వేదిక ఏర్పాటును ప్రస్తావించడానికే విత్తమంత్రి చొరవ పరిమితమైంది!

### ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ రంగ ముఖచిత్రం

- స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటా 28 శాతం.
- దేశ ఎగుమతుల్లో ఈ రంగం తయారుచేసిన ఉత్పత్తులు 40 శాతం పైగా ఉన్నాయి.
- దేశ తయారీరంగంలో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈల వాటా 45 శాతం పైనే ఉంది.
- దేశంలో దాదాపు 6.3 కోట్ల ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ యూనిట్లు ఉన్నాయి. అందులో 31 శాతం తయారీరంగంలో, 36 శాతం వ్యాపార రంగంలో, మిగిలిన 33 శాతం సేవల రంగంలో ఉన్నాయి.
- 12 కోట్లమందికి పైగా ఈ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.
- 2019 మార్చినాటికి ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ రంగ రుణాలు రూ.17.4 లక్షల కోట్లకు చేరాయి.

## ఆదుకోవాల్సిన తీరిది...

మొన్నీమధ్య సిన్హా కమిటీ కొన్ని కీలక సిఫార్సులు చేసింది. పలు విధానపరమైన మార్పులు, పర్యావరణానికి హాని కలిగించే కొన్ని ఉత్పత్తుల తయారీపై నిషేధం, విదేశాలనుంచి ఇబ్బడిముబ్బడిగా చవకగా దిగుమతులు చేసుకోవడం (డంపింగ్) వంటి వాటివల్ల దేశంలో పెద్దయెత్తున ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలు సంక్షోభంలో పడ్డాయి. కొన్ని పాక్షికంగా మూతపడ్డాయి. ఫలితంగా ఈ తయారీ యూనిట్లకిచ్చిన రుణాలు మొండిబకాయిలుగా మారాయి. బాహ్య పరిస్థితుల ప్రాబల్యంతో సంక్షోభంలో ఉన్న క్లస్టర్ యూనిట్లను ఆదుకొనే దిశలో సిన్హాకమిటీ రూ.5,000 కోట్లతో ఓ నిధిని (డిస్ట్రెస్డ్ అసెట్‌ఫండ్) ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ఈ రంగంలో నిరర్థక ఆస్తులను తగ్గించేందుకు గతంలో ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన 'రుణ పునర్ వ్యవస్థీకరణ' పథకం (రూ.25 కోట్ల వరకు ఉన్న రుణాలకు) అమలుతోపాటు ప్రతిపాదిత నిధినీ సమకూర్చాలని సూచించింది. ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలో పెట్టుబడులు పెట్టే వెంచర్ క్యాపిటల్ (వీసీ), ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థలకు మద్దతుగా మరో రూ.10 వేలకోట్లతో ప్రభుత్వ ప్రాయోజిత నిధి ఏర్పాటుచేయాలని కమిటీ సూచించింది. ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలను బలోపేతం చేసే దిశలో సిడ్బి (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) క్రియాశీల పాత్ర పోషించాలని సూచించింది. ఈ రంగానికి ఆర్థిక సాయం అందించేందుకు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, సూక్ష్మరుణ (మైక్రో ఫైనాన్స్) సంస్థల సమన్వయంతో కొత్త రుణ, మూలధన సమీకరణ విధానాలను రూపొందించేందుకు తోడ్పడాలని సూచించింది. ప్రభుత్వరంగ బ్యాంకులు 59 నిమిషాల్లో ఇచ్చే ముద్రా రుణాలను మరింత సరళీకృతం చేయాలని, సూత్రప్రాయ అంగీకారం తెలిపిన తరవాత కేవలం ఏడు నుంచి పది రోజుల్లోనే రుణవితరణ ప్రక్రియ పూర్తిచేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం చాలా సందర్భాల్లో 59 నిమిషాల్లో సూత్రపాయ అంగీకారం తెలిపిన తరవాతా రుణవితరణకు చాలా సమయం పడుతోందని అభిప్రాయపడింది. ప్రస్తుతం ఈ పథకం కింద ఉన్న రుణపరిమితిని కోటి రూపాయల నుంచి అయిదు కోట్ల రూపాయలకు పెంచాలని సిఫార్సు చేసింది. ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలకు బ్యాంకులు ఎటువంటి తనఖా, హామీలు వంటివి లేకుండా రూ. 10 లక్షల దాకా రుణాలనందిస్తున్నాయి. ఈ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని; ఈ సౌకర్యాన్ని ముద్రా రుణాలకు, స్వయం సహాయక బృంద రుణాలకూ వర్తింపజేయాలని కమిటీ సిఫార్సు చేసింది.

దేశార్థికాభివృద్ధికి చేయూతనిస్తూ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఆశించిన స్థాయిలో సృష్టించడంలో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈల పాత్ర ఎంతో కీలకం. అదే విధంగా ఎగుమతులు వృద్ధి చెందాలన్నా, 'భారత్‌లో తయారీ' సంకల్పం నెరవేరాలన్నా చిన్నపరిశ్రమలు ఎదుర్కొంటున్న సంక్షోభాలను నివారించి వాటిని బలోపేతం చేసే దిశలో ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పథకంతోపాటు సిన్హా కమిటీ సిఫార్సుల అమలుకు సత్వరం నడుంబిగించాలి. ఈ రంగం కోలుకొని వృద్ధి బాటపట్టకపోతే ఆర్థికవ్యవస్థ గాడి తప్పినట్లే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏడు శాతం వృద్ధిరేటు సాధించాలన్నా, భవిష్యత్తులో (2025 మార్చినాటికి) భారత్ అయిదు లక్షలకోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నా ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ రంగానికి పెద్దయెత్తున సాయం అందించాల్సిన అవసరం ఉంది. లేకుంటే వృద్ధి అంచనాలు తారుమారవుతాయి.

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

# క్రీడల్లో క్రీనీడలు

ప్రపంచ పరుగుల దిగ్గజం ఉసెన్ బోల్ట్, తాను కోచ్‌లు తీర్చిదిద్దిన క్రీడాకారుడినని అథ్లెటిక్స్‌ వీడ్కోలు చెబుతూ వ్యాఖ్యానించాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనలోని పరుగుల ప్రతిభను గుర్తించింది వారేనన్న బోల్ట్ మాటల్లో క్రీడావ్యవస్థలకు గల ప్రాధాన్యం ఏమిటో తేటతెల్లం అవుతోంది. సానపడితేనే రాయి వజ్రమవుతుంది. ప్రతిభాసామర్థ్యాలున్నా సరైన మార్గనిర్దేశం, ప్రోత్సాహం కల్పిస్తేనే క్రీడా ప్రపంచంలో రాణించగలరనడానికి బోల్ట్ సహా ఎందరో క్రీడాకారుల గాథలే నిదర్శనాలు. మనదేశంలో పరిస్థితులు అందుకు పూర్తిగా విరుద్ధం. అడుగడుగునా రాజకీయాలు తిష్ఠ వేసుకుని సమర్థులైన ఆటగాళ్లను నిరాశపరుస్తున్నాయి. ప్రతిభావంతుడైన క్రికెటర్‌గా పేరొందిన అంబటి రాయుడు ప్రపంచకప్పు క్రికెట్‌కు జట్టు ఎంపికలో సెలక్టర్ల ధోరణులకు నిరసనగా అర్ధాంతరంగా ఆటకు వీడ్కోలు పలకడం అందుకు తాజా దృష్టాంతం.

ప్రపంచంలో 40 క్రీడాంశాల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీలు జరుగుతుంటాయి. ఒలింపిక్స్‌లో 26 క్రీడాంశాలపై పోటీలు నిర్వహిస్తారు. 2016 వరకు 24 సార్లు ఒలింపిక్స్ పోటీలు జరగ్గా, భారత్ సాధించిన పతకాల సంఖ్య 28 మాత్రమే. బ్యాడ్మింటన్, రెజ్లింగ్, షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, టెన్నిస్‌లలో భారత్ ఒలింపిక్ పతకాలు సాధించింది. క్రికెట్, హాకీ, కబడ్డీలలో ప్రపంచ కప్పులు గెలుచుకుంది. చైనా వంటి పొరుగు దేశంతో పోల్చుకుంటే ఆటల్లో భారత్ ఎంతో వెనకంజలో ఉందన్నది సుస్పష్టం. మన దేశ జనాభా 135 కోట్లు. ఈ విషయంలో ప్రపంచంలో మనది రెండో స్థానం. ఆటలో మాత్రం అట్టడుగు స్థానాల్లోనే ఉంటోంది. 2016 ఒలింపిక్స్‌లో మనకు వచ్చిన పతకాలు రెండు. ఒకటి రజతం. మరొకటి కాంస్యం. ప్రభుత్వాల వైఖరి, అధ్వాన అపసవ్య విధానాలు, మౌలిక సదుపాయాల లేమి క్రీడారంగంలో దేశం వెనకబాటుకు ప్రధాన కారణాలు. ఇప్పటివరకు దేశానికి పకడ్బందీ క్రీడా విధానం లేదు. అంతర్జాతీయ స్థాయిగల కోచ్‌లు ఎక్కువ మంది లేరు. చైనా, జపాన్ వంటి దేశాల్లో ప్రాథమిక స్థాయి నుంచి క్రీడాశిక్షణ ప్రారంభమవుతుంది. మన దేశంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆటలకు చోటే ఉండదు. 22 శాతం ఉన్నత పాఠశాలల్లో, 11 శాతం కళాశాలల్లో, ఏడు శాతం విశ్వవిద్యాలయాల్లో మాత్రమే శిక్షకులున్నారు. 95 శాతం పాఠశాలలు, 99 శాతం కళాశాలల్లో మైదానాల జాడ లేదు. క్రీడారంగానికి నిధుల కేటాయింపులోనూ నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2019-20లో క్రీడలకు కేటాయించిన బడ్జెట్ రూ.2,216 కోట్లు మాత్రమే. బ్రిటన్ క్రీడారంగానికి ఏటా తొమ్మిది వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది.

క్రీడా పోటీలకు సన్నద్ధత సైతం దారుణంగా ఉంటోంది. విద్యార్థులకు నాసిరకం సామగ్రితో శిక్షణ ఇస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యం అందుబాటులో లేదు. ప్రతిభను గుర్తించి ఎంపిక చేసి, ప్రోత్సహించాల్సి



## శాపమవుతున్న రాజకీయాలు

ఉండగా క్రీడాశిక్షకులు, సమాఖ్య, సంఘాల ప్రతినిధులు తమకు అనుకూలంగా ఉన్నవారినే పోటీలకు ఎంపిక చేస్తున్నారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, రోయింగ్ సమాఖ్య వంటి కొన్ని వ్యవస్థలు కొన్ని కుటుంబాల చేతుల్లోనే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలు, సంఘాల్లోని పిల్లలు, బంధువులకే క్రీడాపోటీల్లో అవకాశాలు కల్పిస్తున్నారు. క్రీడారంగంలో అవినీతి వేళ్లూనుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద ఇచ్చే నిధులు దుర్వినియోగమవుతున్నాయి. కామన్వెల్త్ కుంభకోణం దేశాన్ని నివ్వెరపరచింది. జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) పోటీల కోసం విడుదల చేసే నిధులు సద్వినియోగం కావడం లేదు. క్రీడా పురస్కారాలకు ఆటగాళ్ల ఎంపిక విధానంలోనూ దుర్విచక్షణ కనిపిస్తోంది.

భారతీయ క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అత్యంత లాభదాయక సంస్థగా పేరొందింది. రాష్ట్రస్థాయిలో క్రికెట్ సంఘాలు పనిచేస్తున్నాయి. క్లబ్ క్రికెట్ ఆధారంగా వివిధ వయో విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేస్తున్నారు. రంజీ పోటీలకు ఎంపికైతే జాతీయ స్థాయి జట్టు ఎంపికకు దోహదపడుతుంది. కొందరు క్రీడాకారులపై ఎంపిక మండలి అవ్యాజానురాగం కనబరుస్తోంది. ప్రపంచ క్రికెట్ పోటీలకు ఎంపిక చేసిన జట్టులో అంబటి రాయుడికి చోటు కల్పించకపోవడం లోటే. నిలకడగా రాణించడంతో పాటు ప్రత్యర్థి దేశాల బౌలర్లను సమర్థంగా ఎదుర్కొనే సత్తా ఉన్నప్పటికీ, ఎంపిక కమిటీ అంబటికి అవకాశం కల్పించలేదు. పలువురు క్రీడాకారులు గాయపడినా, బ్యాటింగ్ విభాగం పటిష్ఠత కోసం రాయుడిని ఎంపిక చేయాల్సి ఉన్నా పరిగణనలోనికి తీసుకోలేదు. ప్రతిభకు దక్కే గౌరవం ఇలాఉంటే భారత క్రీడారంగం గాడిలో పడేదెన్నడు?

దేశంలోని అన్ని రకాల క్రీడల్లో ప్రతిభకే పట్టం కట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. అందుకు తగిన క్రీడా విధానాలు రావాలి. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ అంశాన్ని సైతం ప్రస్తావించారు. 'ఖేలో ఇండియా'లో భాగంగా అన్ని స్థాయుల్లో క్రీడలకు ఆదరణ పెంచడానికి జాతీయ క్రీడావిద్యా బోర్డు' ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రంలోనే కాదు, రాష్ట్రాల్లోనూ క్రీడాపాలన విషయంలో అనేక మార్పులు రావాలి. ప్రాథమిక స్థాయి నుంచి పారదర్శకంగా ఎంపిక జరగాలి. క్రీడాసమాఖ్యలు, సంఘాల్లో రాజకీయ జోక్యాన్ని తొలగించాలి. చైనా, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో క్రీడా సమాఖ్యల్లో రాజకీయ నాయకులు ఉండరు. మాజీ అంతర్జాతీయ క్రీడాకారుల ఆధ్వర్యంలో అవి నడుస్తున్నాయి. సచిన్ తెందూల్కర్‌ను భారతరత్న పురస్కారంతో గౌరవించిన దేశంలో ప్రతీ క్రీడాకారుడిని ఓ రత్నంలా మలిచేందుకు ప్రభుత్వాలు, సంస్థలు, సమాజం కంకణబద్ధం కావాలి. క్రీడల విస్తరణ దేశాన్ని ఆరోగ్య భారత్‌గా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపకరిస్తుంది.

– ఆకారపు మల్లేశం

## ఈనాడు లేఖలు

### విద్యార్థి సంఘాల విహిత బాధ్యత

విద్యారంగం అనేక సమస్యలతో సతమతమవుతోంది. దీనివల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థి సంఘాలు ఈ సమస్యలపై పోరాటం చేస్తే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కొంతవరకైనా న్యాయం జరిగే అవకాశం ఉంది. విద్యావ్యవస్థలోని సమస్యలకు పరిష్కారమార్గాలను సూచించాల్సిన గురుతర బాధ్యత విద్యార్థి సంఘాలపై ఉంది. కొన్ని విద్యార్థి సంఘాలు ధర్నాలు, రాస్తా రోకోలకే పరిమితమవుతున్నాయి. ఇరు రాష్ట్రాల్లో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై ఈ సంఘాలు దృష్టి సారించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి.

- ఎనుగుల సోమశేఖర్, హైదరాబాద్

### ఆగని అఘాయిత్యాలు!

ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేస్తున్నా, మహిళలపై అఘాయిత్యాలు ఆగడంలేదు. నిర్భయ చట్టం వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదనడానికి నిత్యం చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులే నిదర్శనం. అత్యాచారంతో ఆగని మానవ మృగాలు బాధితులను కిరాతకంగా హతమారుస్తున్నాయి. అతివలు నిర్భయంగా జీవించే పరిస్థితులు కొరవడ్డాయి. చట్టాలను మరింత కఠినతరం చేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడే విచారణలు నిర్వహించాలి. మరికొందరు మహిళలు మానప్రాణాలు కోల్పోకముందే ప్రభుత్వం వేగంగా స్పందించి దీటైన చర్యలు తీసుకోవాలి.

- బండారు హరీశ్, తాళ్లపూసపల్లి, మహబూబాబాద్

## నామ ప్రాశస్త్యం

మనిషిలో జీవుడి రూపంలో ఆత్మ చైతన్యం ఉంటుంది. అవతార పురుషుల్లో ఉండే చైతన్యాన్ని 'ఈశ్వర చైతన్యం' అనేవారు రామకృష్ణ పరమహంస.


భక్తులు భగవన్నామం జపించి ఆనందం పొందుతారు. అది వారి వేయి జన్మల పాపాలను తొలగిస్తుందంటారు. కలియుగంలో జీవుడికి తరుణోపాయం నామ జపమే!

భగవన్నామాన్ని వినడానికి భక్తుడికి లక్ష చెవులు ఉన్నా చాలవు. ఆ అమృత శబ్దాన్ని ఒక్క నోటితో జపించడం వల్ల నిజానికి అతడికి తృప్తి కలగదు. నామం భక్తుడి మదిలో ప్రకంపన సృజించినప్పుడు అతడి సమస్త ఇంద్రియాలు పరిశుద్ధమవుతాయి.

మానవులు లౌకిక వ్యవహారాల్లో తలమునకలై ఉంటారు. వారి మనసులు నైతం ఆలోచనలతో నిండి ఉంటాయి. మంచి ఆలోచనలతో మనసు ఆనందపరవశమైనా చెడు ఆలోచనలు వారి మనసులను దాడి చేసి దెబ్బతీస్తుంటాయి. చెడు ఆలోచనలతో అపవిత్రమయ్యే అంతఃకరణను పవిత్ర భగవన్నామంతో పరిశుద్ధం చేసుకోవాలంటారు పెద్దలు. నామ జపం కలియుగ మానవులకు రుషులు నిర్దేశించిన తరుణోపాయం! అది అతి సులభమైన మార్గం. భగవన్నామం చాల మహిమాన్వితమైనది. నామమే సర్వం, నామమే సర్వస్వం అన్నట్లు వ్యక్తి జీవించాలి. నామం భగవంతుడికి భిన్నమైనది కాదు.

ప్రతి కర్మా నిర్దేశిత ఫలితాన్ని ఇస్తుందంటారు. వెలుగును అనుసరించే నీడలా కర్మను అనుసరించి కర్మఫలం ఉంటుంది. ఎంతటివారికైనా కర్మఫలం అనుభవించక తప్పదు. దాన్ని తప్పించడం విధాతకైనా సాధ్యం కాదంటారు. పవిత్రమైన భగవన్నామ జపంవల్ల కర్మఫలం తొలగుతుంది లేక తగ్గుతుందని జ్ఞానులు చెబుతారు.

మనఃప్రకృతిని అనుసరించి మనిషి ఆలోచనలు ఉంటాయి. మహాత్ముల ఆలోచనలు లోకసంక్షేమం కోసం అలరారగా నీచ మానవుల ఆలోచనలు అధోస్థాయిలో స్వార్థపూరితంగా ఉంటాయి. రాబందు ఆకాశంలో విహరిస్తున్నా దాని దృష్టి శ్మశానంలో ఉండే శవాలపైనే ఉంటుందట! లోకాల్లో అందరినీ ఉద్ధరించడం కోసమే భగవంతుడు శబ్దాన్ని సృష్టించాడు. ఆ పరమ పవిత్రమైన ఓంకారనాదంతో మిళితమై ప్రవర్తిల్లే భగవన్నామం ఎంతో ఉత్కృష్టమైనది. అది మానవుల సర్వ పాపాలనూ హరించి వేయగల దివ్యౌషధం!




కేనోపనిషత్తులో ఓ చిత్రమైన అంశం కనిపిస్తుంది. బ్రహ్మను ఎవరు తెలుసుకోలేదో ఆతడే సంపూర్ణంగా తెలుసుకున్నవాడు. భగవంతుడి శక్తి సముద్రాలకన్నా లోతైనది. హద్దులు లేనిది. మానవ మేధకు అందనిది. అలాగే భగవత్తత్వం సైతం అంతుపట్టనిది. దైవాన్ని అంతుపట్టనివాడిగా తెలుసుకున్నవాడే నిజానికి ఆయనను తెలుసుకున్నవాడు. ఒకే చంద్రుడు, ఒకే సూర్యుడు ఉదయిస్తూ, అస్తమిస్తున్నట్లుగా ఒకే దైవం వివిధ రూప నామాలతో అవతారాలు ధరిస్తూ లోకకార్యాలు చక్కబెట్టి అంతర్హితుడవుతుంటాడు. నిజానికి దైవం తనను ఎవరూ తెలుసుకోకూడదని భావిస్తే ఆయనను తెలుసుకోగలవారు లోకంలో ఎవరూ ఉండరు. ఆయన అనుగ్రహంతోనే భక్తులు భగవదవతారాలను గుర్తించగలుగుతారని పెద్దలు చెబుతారు.

ఆధ్యాత్మిక జీవితంలో మానసిక ప్రశాంతత ఎంతో అవసరం! నిష్కామంగా కర్మలు చేయడం, మంచి గ్రంథాలు చదవడం, సదాచారం కలిగి ఉండటం నామాన్ని పవిత్రంగా మననం చేయడానికి సాధకుడికి ఉపకరించే ఉపకరణాలు. ఉషోదయంలో ధ్యానాది సాధనా కార్యక్రమాలతో మనసును పవిత్రం చేసుకొని భగవన్నామాన్ని అనుష్ఠించి సాధకులు భగవదనుగ్రహం పొందగలవీలుంది.

– గోపాలుని రఘుపతిరావు

Eenadu epaper

## న్యాక్‌కు దరఖాస్తు చేస్తామంటే రూ.లక్ష సాయం

### విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: జాతీయ మదింపు, గుర్తింపు మండలి (న్యాక్) హోదా సాధనకు దరఖాస్తు చేస్తామంటే ఉన్నత విద్యామండలి తరఫున రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామని విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి ప్రకటించారు. 8, 9 తేదీల్లో ఉన్నత విద్యలో అక్రిడేషన్, నాణ్యత తదితర అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో30-40శాతం కళాశాలలకు న్యాక్ గుర్తింపు ఉందని, తెలంగాణలో అది 10శాతం కళాశాలలకు మాత్రమే ఉందన్నారు. కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 64 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు న్యాక్ గుర్తింపు ఉందన్నారు. జోనల్ విధానంపై రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ వస్తే ఖాళీగా ఉన్న అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు.

## అంబేడ్కర్ వర్సిటీ బీఈడీ ఫలితాల విడుదల

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ బీఈడీ ఫలితాలను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి. బీఈడీతో పాటు బీఈడీ(ప్రత్యేక విద్య) 2019 ఫలితాలను విడుదల చేశామన్నారు. ఫలితాలు ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.braouonline.in లో పరిశీలించాలని చెప్పారు.

## రాజ్యసభ సభ్యుడిగా కేంద్ర మంత్రి జయ్‌శంకర్ ఎన్నిక

గాంధీనగర్: విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్, మరో భాజపా నేత జుగల్ ఠాకూర్‌లు రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. శుక్రవారం గుజరాత్‌లో జరిగిన శాసనసభ్యుల కోటా రాజ్యసభ ఉప ఎన్నికల్లో... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై వారు గెలుపొందినట్లు ఎన్నికల సంఘం వర్గాలు వెల్లడించాయి.

# నేటి నుంచి ఎంసెట్ ఆప్షన్లు

- తేలిన రుసుముల లెక్క
- 103 కళాశాలలకే శాశ్వత రుసుముల ఖరారు
- కమిటీ నిర్ణయించిన ఫీజులకు విద్యాశాఖ ఆమోదం

ఈనాడు - హైదరాబాద్

మూడుసార్లు వాయిదా పడిన ఎంసెట్ ఆప్షన్ల ప్రక్రియ ఎట్టకేలకు శనివారం నుంచి ప్రారంభం కానుంది. కళాశాలలు, కోర్సులను ఎంచుకునేందుకు ఈనెల 8వ తేదీ వరకు గడువు ఇచ్చారు. మొత్తం 191 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలకు రుసుము ఎంతన్న దానిపై శుక్రవారం రాత్రి విద్యాశాఖ జీఓ జారీ చేసింది. వాటిలో హైకోర్టుకు వెళ్లిన 80 కళాశాలలతో పాటు మొత్తం 103 కళాశాలలకు తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) శాశ్వత రుసుము నిర్ణయించింది. వచ్చే మూడేళ్ల వరకు ఆ కళాశాలలకు అవే అమలులో ఉంటాయి. ఇక మిగిలిన 88 కళాశాలలకు (కోర్టుకు వెళ్లనివి) తాత్కాలిక రుసుములు నిర్ణయించారు. గత ఏడాది కంటే ఈసారి 15 నుంచి 43 శాతం వరకు రుసుములు పెరిగాయి. సగటున 20 శాతం పెరిగినట్లు అంచనా. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం రూ.లక్ష రుసుము దాటిన కళాశాలల సంఖ్య 20కి చేరింది. గతంలో అలాంటి కళాశాలలు నాలుగు మాత్రమే ఉండేవి. రాష్ట్రంలో 2019-20 విద్యాసంవత్సరం నుంచి 2021-22 విద్యా సంవత్సరానికి వార్షిక రుసుము అత్యధికంగా సీబీఐటీలో రూ.1.34 లక్షలుగా టీఏఎఫ్ఆర్‌సీ ఖరారు చేసింది.

**మరికొన్ని కళాశాలల్లో...**

బీవీఆర్ఐటీ(మహిళ)- రూ.90 వేలు, ఎంఆర్ఈసీ-రూ.లక్ష, ఏస్ కళాశాల-రూ.82 వేలు, వాగ్దేవి(వరంగల్)- రూ.86 వేలు, గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- రూ.94 వేలు, జేబీఐటీ-రూ.87 వేలు, ఐఏఈ, దుండిగల్- రూ.90 వేలు, శ్రీదేవి (మహిళ)- రూ.85 వేలు, శ్రేయాస్- రూ.81 వేలు, స్టాన్లీ- రూ.78 వేలు, వీబీఐటీ- రూ.85 వేలు, శ్రీదత్త- రూ.82 వేలు, టీకేఆర్ఈటీ- రూ.89 వేలు

**ఈ రుసుములు అదనం**

- విద్యార్థులు ఆయా కళాశాలల్లో ప్రవేశం పొందే సమయంలో ప్రవేశం/రిజిస్ట్రేషన్/ గుర్తింపు రుసుము పేరిట రూ.2 వేలు చెల్లించాలి. అందులో రూ.500 కళాశాల యాజమాన్యం విశ్వవిద్యాలయానికి చెల్లిస్తుంది.
- ప్రత్యేక సేవలు అందించేందుకు కళాశాలలకు రూ.1000 చెల్లించాలి. ఉత్సవాలు, ఆరోగ్య కేంద్రం సేవలు, రీడింగ్ రూమ్, కళాశాల మేగజైన్, ప్రయోగశాల, గ్రంథాలయ, కంప్యూటర్, అంతర్జాలం, క్రీడలు, ప్రాంగణ నియామకాల విభాగానికి ఈ రుసుము చెల్లించాలి.
- కళాశాలకు విశ్వవిద్యాలయం కామన్ సర్వీస్ అందించేందుకు రూ.1500 చెల్లించాలి. పరీక్షలకు సంబంధించిన, పాఠ్య ప్రణాళిక మార్పు, అధ్యాపకుల శిక్షణ, వెబ్‌సైట్ నిర్వహణ తదితర సేవలకు వాటిని వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని కళాశాల వసూలు చేసి విశ్వవిద్యాలయానికి పంపిస్తుంది.
- గ్రంథాలయ డిపాజిట్ కింద రూ.500, లేబొరేటరీ డిపాజిట్ కింద రూ.500.. మొత్తం రూ.వెయ్యి చెల్లించాలి. వాటిని కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థికి చెల్లిస్తారు.
- కళాశాలల్లోని కోర్సులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు ఉంటే ప్రవేశాల సమయంలో ట్యూషన్ రుసుంకు అదనంగా ఏడాదికి మరో రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

**ఫార్మసీకి పాత ఫీజులే**

ఎంపీసీ అభ్యర్థులు బీఫార్మసీ, ఫార్మా-డి కోర్సుల్లో చేరవచ్చు. దానివల్ల ఈ కౌన్సెలింగ్‌లో ఫార్మసీ కళాశాలలను కూడా చేర్చాలి. అవి 120కి పైగా ఉన్నాయి. వాటికి పాత రుసుములే ఉంటాయి. తర్వాత టీఏఎఫ్ఆర్‌సీ ఖరారు చేసిన రుసుములను కళాశాలల యాజమాన్యాలు వసూలు చేసుకోవచ్చు. ఈ షరతుకు యాజమాన్యాలు అంగీకరించడంతో తాత్కాలిక ఫీజు కూడా వాటికి నిర్ణయించలేదని తెలిసింది.

**రూ.లక్ష రుసుము దాటిన కళాశాలలు**

| పేరు | తాజా రుసుము (రూ.లక్షల్లో) |
|---|---|
| సీబీఐటీ | 1.34 |
| శ్రీనిధి | 1.30 |
| వాసవి | 1.30 |
| వర్ధమాన్ | 1.25 |
| సీవీఎస్ఆర్ | 1.25 |
| నారాయణమ్మ | 1.22 |
| గోకరాజు రంగరాజు | 1.22 |
| బీవీఆర్ఐటీ | 1.20 |
| సీవీఆర్ | 1.15 |
| విద్యాజ్యోతి | 1.15 |
| ముఫకంజా | 1.10 |
| ఎంజీఐటీ | 1.08 |
| గురునానక్ టెక్నికల్ | 1.07 |
| కేఎంఐటీ | 1.03 |
| ఎంఆర్ఈసీ | 1.03 |
| గీతాంజలి | 1.02 |
| **తాత్కాలిక రుసుములు నిర్ణయించినవి** | |
| కిట్స్(వరంగల్) | 1,20,750 |
| వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి | 1,13,275 |
| ఎంవీఎస్ఆర్ | 1,09,250 |
| ఎస్ఆర్ కళాశాల | 1,09,250 |




ఈఎఫ్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాపినీడు ఆధ్వర్యంలో కేక్ కోస్తున్న సిబ్బంది

## సందడిగా ఈఎఫ్ఎం ప్రథమ వార్షికోత్సవం

### తొలి ఏడాదిలో 'బెస్ట్ లాంచ్ 2019' అవార్డుతో జాతీయ స్థాయిలో గుర్తింపు

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం శ్రోతలను ఈఎఫ్ఎం.. మీ ఎఫ్ఎం అంటూ పలకరిస్తూ తొలి ఏడాదిని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈఎఫ్ఎం తొలి వార్షికోత్సవాలు శుక్రవారం ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడిగా ప్రారంభమయ్యాయి.

శ్రోతలకు, ఉద్యోగులకు 'ఈనాడు' ఎండీ సీహెచ్.కిరణ్ (వీడియో కాన్ఫరెన్స్‌లో) శుభాకాంక్షలు తెలిపారు. ఈఎఫ్ఎం విజయవాడ 91.9, వరంగల్ 104.8, తిరుపతి 104, రాజమండ్రి 92.7 కేంద్రాలు మనోరంజకంగా కార్యక్రమాలను అందిస్తూ శ్రోతలకు దగ్గరవుతూ తొలి ఏడాదిలోనే ఐఆర్ఎఫ్ (ఇండియన్ రేడియో ఫోరం) నుంచి జాతీయ స్థాయి బెస్ట్ లాంచ్-2019 అవార్డును దక్కించుకోవడం విశేషం. రామోజీ ఫిల్మ్ సిటీలోని ఈఎఫ్ఎం కార్యాలయంలో శుక్రవారం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాపినీడు, సీనియర్ ప్రొడ్యూసర్ చేతన్ ఉద్యోగులతో కలిసి కేక్ కోసి వేడుకలు ప్రారంభించారు. పలువురు ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు.

## సీజీఎస్టీ చీఫ్ కమిషనర్‌గా శేషగిరిరావు



ఈనాడు, హైదరాబాద్: కస్టమ్స్, కేంద్ర జీఎస్టీ హైదరాబాద్ జోన్ చీఫ్ కమిషనర్‌గా వాసా శేషగిరిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పుణె కస్టమ్స్, కేంద్ర జీఎస్టీ చీఫ్ కమిషనర్‌గా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. 1987 ఐఆర్ఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన గతంలో బరేలీ, చెన్నై, హైదరాబాద్‌లలో వివిధ హోదాల్లో పని చేశారు. తెలంగాణ రాష్ట్రం పరిధిగా ఉన్న హైదరాబాద్ కేంద్ర జీఎస్టీ జోన్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఉన్న బంకి బేహారి అగ్రావాల్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శేషగిరిరావు నియమితులయ్యారు.

## నేడు హైదరాబాద్‌కు అమిత్‌షా

ఈనాడు-హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా శనివారం నగరానికి వస్తున్నారు. మధ్యాహ్నం 2.40 గంటల నుంచి రాత్రి 8.40 వరకు.. ఆరు గంటల పాటు పర్యటన సాగనుంది. విమానాశ్రయంలో తొలుత సీఐఎస్ఎఫ్ అధికారులతో సమావేశమవుతారు. తర్వాత శంషాబాద్ సమీపంలో రంగానాయకుల తండాలోని గిరిజన మహిళ సోనినాయక్ ఇంటికి వెళ్లి ఆమెకు తొలి సభ్యత్వాన్ని ఇస్తారు. సాయంత్రం 4.30 గంటలకు శంషాబాద్‌లోని కేఎల్‌సీసీ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. సభ్యత్వ నమోదు అనంతరం.. రాత్రి 7 గంటలకు శంషాబాద్‌లోని నోవాటెల్‌కు చేరుకుని పార్టీ కోర్‌కమిటీ సమావేశంలో పాల్గొంటారు. తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు తెలుసుకోవడంతో పాటు రానున్నరోజుల్లో అనుసరించాల్సిన వ్యూహంపై అమిత్‌షా సూచనలు చేసే అవకాశం ఉంది. నేతలతో కలిసి విందు భోజనం అనంతరం రాత్రి 8.40కి తిరుగుప్రయాణమవుతారు.


**NATIONAL INSTITUTE OF TECHNOLOGY ANDHRA PRADESH**
TADEPALLIGUDEM - 534101, A.P, INDIA
Advt. No. NITAP/CS-01/2019-20 Date: 05-07-2019
**TENDER NOTIFICATION FOR SUPPLY OF THE FOLLOWING ITEMS**
Sealed tenders are invited from reputed firms / agencies for the supply of the following items:
A. Procurement and establishment of various Engineering laboratories
B. Supply of RO Plants for NIT-AP Hostels
All the details can be obtained from the institute website:
www.nitandhra.ac.in DIRECTOR



**ఫారం G**
**ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానము**
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ (ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36A (1) క్రింద)

| | సంబంధిత వివరాలు | |
|---|---|---|
| 1 | కార్పొరేట్ డెటార్ పేరు | ల్యాంకో కొండపల్లి పవర్ లిమిటెడ్ |
| 2 | కార్పొరేట్ డెటార్ ఏర్పాటు చేయబడిన తేదీ | 21 ఆగస్టు 1995 |
| 3 | [illegible] | కంపెనీల చట్టం, 1956 క్రింద రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ - హైదరాబాద్ |
| 4 | [illegible] | U40101TG1995PLC021459 |
| 5 | [illegible] | నమోదిత కార్యాలయం: [illegible] హైదరాబాద్, తెలంగాణ 500081. ప్లాంట్ కార్యాలయం: [illegible] |
| 6 | [illegible] | 23 ఏప్రిల్ 2019 |
| 7 | ఆసక్తి వ్యక్తీకరణ ఆహ్వాన తేదీ | 06 జూలై 2019 [illegible] www.lancogroup.com [illegible] |
| 8 | [illegible] | www.lancogroup.com [illegible] |
| 9 | [illegible] | [illegible] |
| 10 | ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు చివరి తేదీ | 21 జూలై 2019 |
| 11 | [illegible] | 31 జూలై 2019 |
| 12 | [illegible] | 05 ఆగస్టు 2019 |
| 13 | [illegible] | 14 ఆగస్టు 2019 |
| 14 | [illegible] | 05 ఆగస్టు 2019 |
| 15 | [illegible] | [illegible] |
| 16 | [illegible] | 4 సెప్టెంబరు 2019 |
| 17 | [illegible] | [illegible] |
| 18 | [illegible] | 5 అక్టోబరు 2019 |
| 19 | [illegible] | పేరు: పంకజ్ ధనూక రిజిస్ట్రేషన్ నెం.IBBI/IPA-001/IP-P01205/2018-2019/11911 |
| 20 | [illegible] | పేరు: పంకజ్ ధనూక [illegible] ఇమెయిల్: pankajdhanuka@gmail.com |
| 21 | [illegible] | [illegible] ఐడి: inlancokpl@deloitte.com |
| 22 | [illegible] | http://www.lancogroup.com/ |
| 23 | ఫారం జి ప్రచురణ తేదీ | 6 జూలై 2019 |

తేదీ: 6 జూలై 2019
ప్రదేశం: కోల్‌కత
సం/-
రిజల్యూషన్ ప్రొఫెషనల్
పంకజ్ ధనూక


# ట్రిగ్గర్ నొక్కింది అస్గర్ అలీనే

- గుజరాత్ హోంమంత్రి హత్య కేసులో జీవిత ఖైదు విధించిన సుప్రీం కోర్టు
- నల్గొండకు చెందిన అస్గర్‌తోపాటు హైదరాబాదీ రవూఫ్‌కు కూడా శిక్ష


జీవితఖైదు పడిన రవూఫ్, అస్గర్ అలీ

ఈనాడు, హైదరాబాద్: గుజరాత్ హోంమంత్రి హరేన్‌పాండ్య హత్యకేసులో నిందితులకు సుప్రీంకోర్టు శుక్రవారం శిక్ష విధించడంతో నల్గొండకు చెందిన కరడుగట్టిన ఉగ్రవాది అస్గర్‌అలీ, హైదరాబాద్‌కు చెందిన రవూఫ్ పేర్లు మరోసారి తెరపైకి వచ్చాయి. గుజరాత్‌కు చెందిన రసూల్‌ఖాన్ అనే చమురుదొంగ అక్కడ పోలీసుల ఒత్తిడి పెరగడంతో 1994లో హైదరాబాద్ పారిపోయి వచ్చాడు. బాబ్రీమసీదు విధ్వంసం తాలూకా ఉద్రిక్తతలు అప్పటికి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొంతమంది యువత ఉగ్రవాద భావజాలంతో ఊగిపోతున్నారు. వారిలో అస్గర్‌అలీ, రవూఫ్‌లు కూడా ఉన్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న రసూల్‌ఖాన్ పిస్తీ వారితోపాటు మరికొందరిని చేరదీసి ఉగ్రవాదం నూరిపోశాడు. అలా ఉగ్రవాద కార్యకలాపాలు మొదలుపెట్టిన అస్గర్ అలీ కొన్నాళ్లకు పోలీసులకు పట్టుబడ్డాడు. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు 1996లో పాకిస్థాన్ వెళ్లి ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాడు. తిరిగి వచ్చి ఇక్కడ కార్యకలాపాలు ముమ్మరం చేశాడు. 2002 సంవత్సరం గుజరాత్‌లో మతపరమైన అల్లర్లు చెలరేగడంతో అప్పటికి పాకిస్థాన్‌లో తిష్టవేసిన రసూల్‌ఖాన్ ప్రతీకారంతో రగిలిపోయాడు. ఆ రాష్ట్ర హోంమంత్రి హరేన్‌పాండ్యను హత్యచేయాలని కుట్రపన్నాడు. కాల్పులు జరపడంతో సుశిక్షితుడైన అస్గర్ అలీకి ఆ బాధ్యత అప్పగించారు. ఉదయపు నడకకు వచ్చిన హరేన్ పాండ్యను అస్గర్ అలీ అతి సమీపం నుంచి కాల్చి చంపేసి హైదరాబాద్ పారిపోయి వచ్చాడు. ఈ కేసులో అస్గర్‌అలీతోపాటు అతనికి సహకరించిన రవూఫ్, అబ్దుల్‌బారీ, ఇఫ్తికార్‌లను 2003లో సీబీఐ అరెస్టు చేసింది. 2011లో గుజరాత్ హైకోర్టు ఆ కేసు కొట్టివేయడంతో అస్గర్‌అలీ నల్గొండ చేరుకొని సాధారణ జీవితం గడపడం మొదలుపెట్టాడు. గత సెప్టెంబరులో మిర్యాలగూడాలో జరిగిన ప్రణయ్‌హత్య సందర్భంలో అస్గర్ పేరు మరోమారు తెరపైకి వచ్చింది. తన కుమార్తెను ప్రేమ వివాహం చేసుకున్నాడన్న కోపంతో మారుతీరావు అనే వ్యాపారి ప్రణయ్‌ను హత్య చేయించిన సంగతి తెలిసిందే. ప్రణయ్‌ను హతమార్చిన సుభాష్‌శర్మను మారుతీరావుకు పరిచయం చేసింది అస్గర్‌అలీ, అబ్దుల్‌బారీలే. ఆ నేరంపై వారిద్దరూ ప్రస్తుతం వరంగల్ జైల్లో ఉన్నారు. తాజాగా హరేన్‌పాండ్య కేసులో సుప్రీంకోర్టు అస్గర్‌అలీతోపాటు అతని సహచరుడైన రవూఫ్‌కు జీవిత ఖైదు విధించింది. హైదరాబాద్‌కు చెందిన రవూఫ్ హరేన్‌పాండ్య హత్యతోపాటు అనేక ఉగ్రవాద కార్యకలాపాల్లో అస్గర్‌అలీకి సహకరించాడు.

## ఎర్రమంజిల్ భవనం కూల్చివేతపై మరో పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చివేసి అసెంబ్లీ నిర్మాణం చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మరో పిటిషన్ దాఖలైంది. తెజస ఉపాధ్యక్షుడు పి.ఎల్.విశ్వేశ్వరరావు వేసిన పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులైన సీఎస్, ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. పిటిషన్‌ను ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నవాటితో జత చేసి 8న విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది.

## ప్రజా సమస్యలపై పోరాటం: కోదండరాం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా భవనాల కూల్చివేతకు అధిక ప్రాధాన్యమిస్తోందని తెజస రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలకు తెజస సిద్ధంగా ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం కోదండరాం మాట్లాడారు. భాజపా పాలనలో ఆటోమొబైల్ రంగం పడిపోయిందని.. జీడీపీ కూడా తగ్గిందని.. ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం సైతం ఉందన్నారు. ఈనెల 13న తెజస పార్టీ ప్రథమ ప్లీనరీని హైదరాబాద్‌లోని నాగోల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ప్లీనరీ గోడపత్రికను ఆవిష్కరించారు.


**EDUCATION**
★ B.Sc (Agri) Seats Available @ Hyd.
9951664202, 7337393909



**SBI ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
(ఎస్‌బిఐ పూర్తి స్వంతమైన అనుబంధ సంస్థ)
[illegible] హైదరాబాద్- 95. ఫోన్: 040-23466310/ 23466346
**లీజుపై ఆవరణ కావలెను**
ఎ. నిజామాబాద్, ఆర్‌బిఓ సిద్దిపేట్ పరిధిలో దిగువతెలిపిన ప్రదేశాల వద్ద లీజు ఆధార ప్రాతిపదిక ప్రధానంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో వాణిజ్య/ కార్యాలయ వసతి కొరకు యజమానులు/ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ల నుండి SBI ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌వారు ఎస్‌బిఐ తరఫున ఆఫర్లను కోరుతున్నారు.
1. ఎడిబి చెరియాల్ 2. దుబ్బాక 3. గజ్వేల్
సుమారు కార్పెట్ విస్తీర్ణం, దరఖాస్తును చూడండి
ఆసక్తిగల పార్టీలు 'procurement news' క్రింద బ్యాంక్ వెబ్‌సైట్ www.sbi.co.in నుండి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. పూరించిన దరఖాస్తులను సీల్డు కవరులో ఎ. నిజామాబాద్ పరిధిలోని 'ఆర్ఎం, ఆర్‌బిఓ- సిద్దిపేట్‌వద్ద 30-7-2019 మ.3.00 గం.లోగా దాఖలు చేయవలెను.
తేది: 6-7-2019 వైస్ ప్రెసిడెంట్


## కోర్టు ధిక్కరణ కేసులో అధికారులకు జైలు శిక్ష

- మల్లన్నసాగర్ భూసేకరణలో హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన

ఈనాడు, హైదరాబాద్: మల్లన్నసాగర్ ప్రాజెక్టు భూసేకరణలో సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్‌లో వ్యవసాయ కూలీల అభ్యంతరాలను పరిష్కరించకుండా పనులను కొనసాగించరాదన్న ఉత్తర్వులను ఉల్లంఘించిన కేసులో ముగ్గురు అధికారులకు హైకోర్టు జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ఆర్డీవో జయచంద్రారెడ్డి, తొగుట ఎమ్మార్వో ఎల్.వీర్‌సింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు గజ్వేల్ డివిజన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ టి.వేణులకు మూడు నెలల జైలు శిక్ష, రూ.2 వేల చొప్పున జరిమానా విధించింది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిమిత్తం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో కూలీల అభ్యంతరాలను పరిష్కరించకుండా భూములను స్వాధీనం చేసుకోరాదంటూ గతేడాది జులైలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీచేశారు. వారికి అవసరమైన సమాచారాన్ని అందించి, వ్యక్తిగతంగా వారి అభ్యంతరాలను పరిష్కరించాలని ఆర్డీవోను ఆదేశించారు. దీనికి విరుద్ధంగా భూములను స్వాధీనం చేసుకుని ప్రాజెక్టు పనులను చేపట్టడంతో జె.రాజవ్వ మరో 13 మంది హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు శుక్రవారం తీర్పు వెలువరిస్తూ కోర్టు ధిక్కరణకు పాల్పడిన ఆర్డీవో, ఎమ్మార్వో ఎస్ఈలకు 3 నెలల జైలు శిక్ష విధించారు. కోర్టుకు తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా ఆర్డీవో, ఎమ్మార్వోలు, కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ పనులు చేపట్టడం ద్వారా ఎస్ఈలు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్నారు. అధికారులకు సివిల్ జైలు శిక్ష విధించిన నేపథ్యంలో వారికయ్యే ఖర్చు రోజుకు ఒక్కొక్కరికి రూ.150 చొప్పున మొత్తం సొమ్మును డిపాజిట్ చేయాలని పిటిషనర్లను ఆదేశించారు. అప్పీలుకు వీలుగా తీర్పు అమలును 6వారాల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## 'పోడుభూముల సమస్యకు త్వరలో పరిష్కారం'

ఈనాడు, హైదరాబాద్: అటవీహక్కు పట్టాల పంపిణీ, పోడుభూముల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదో విడత హరితహారం, అటవీ హక్కుల గుర్తింపు పట్టాలు, భూరికార్డుల ప్రక్షాళనపై సీఎస్ ఎస్.కె.జోషితో కలిసి శుక్రవారం ఆయన సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అటవీహక్కు పత్రాలపై ప్రధానంగా చర్చించారు.

## నియామకాల్లో వయోపరిమితి సడలింపు

### ఒప్పంద ఆయుష్ వైద్యులకు వెసులుబాటు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ వైద్యంలో దీర్ఘకాలంగా ఒప్పంద ప్రాతిపదికన సేవలందిస్తున్న ఆయుష్ వైద్యులకు శాశ్వత నియామకాల్లో ఐదేళ్ల వయోపరిమితి అర్హతను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయుష్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయడం కోసం ప్రభుత్వం గతేడాది నియామక ప్రకటన విడుదల చేసింది. ఓసీ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయసు 41 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 45 ఏళ్లుగా నిర్ణయించడంతో.. దీర్ఘకాలంగా ప్రభుత్వ వైద్యంలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఆయుష్ వైద్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు వయోపరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, వారికి న్యాయం చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ మేరకు ఓసీ అభ్యర్థులకు 41 నుంచి 46 ఏళ్లకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 45 నుంచి 50 ఏళ్లకు వయోపరిమితిని ప్రభుత్వం పెంచింది. ప్రభుత్వ వైద్యంలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఆయుష్ వైద్యాధికారులు, లెక్చరర్లకు మాత్రమే ఈ ఆదేశాలు ఈ ఒక్కసారి నియామకాలకు మాత్రమే వర్తిస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయుష్ కమిషనర్ అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

## మై హోం కార్యాలయాల్లో రెండో రోజూ ఐటీ సోదాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ స్థిరాస్తి వ్యాపార సంస్థ మై హోంలో ఐటీ సోదాలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా కొన్ని పత్రాలు, హార్డ్‌డిస్కులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఔషధ ఉత్పత్తి సంస్థ హెటిరో డ్రగ్స్ కార్యాలయాల్లో సోదాలు గురువారమే ముగిశాయి. బెంగళూరుకు చెందిన స్థిరాస్తి సంస్థ ఆర్ఎంజెడ్ కార్పొరేషన్‌తో కలిసి మై హోం, హెటిరో డ్రగ్స్ సంస్థలు 2017లో స్థిరాస్తి వ్యాపారానికి సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆర్ఎంజెడ్ సంస్థ లావాదేవీలకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన బెంగళూరు ఐటీ అధికారులు.. ఆ సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంజెడ్, మైహోం, హెటిరోల మధ్య స్థిరాస్తి వ్యాపారానికి సంబంధించి ఒప్పందం జరిగినట్లు గుర్తించారు. బెంగళూరు నుంచి ఐటీ అధికారుల బృందం గురువారం హైదరాబాద్ వచ్చి.. నందిహిల్స్‌లోని మైహోం అధినేత జూపల్లి రామేశ్వరరావు ఇంటితోపాటు నగరంలో ఐదు ప్రాంతాల్లోని ఆ సంస్థ కార్యాలయాలతోపాటు హెటిరో డ్రగ్స్ కార్యాలయాల్లోనూ సోదాలు నిర్వహించారు. మైహోం కార్యాలయాల్లో సోదాలు శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగుతూనే ఉన్నాయి.

## జూనియర్ సివిల్ జడ్జి సస్పెన్షన్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: అవినీతి ఆరోపణలపై రంగారెడ్డి జిల్లాలో ఓ జూనియర్ సివిల్ జడ్జిని హైకోర్టు సస్పెండ్ చేసింది. రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రధాన భవన సముదాయంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.హేమలత అవినీతికి పాల్పడుతున్నారంటూ హైకోర్టుకు రెండు ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం హేమలతను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఇన్‌ఛార్జి న్యాయమూర్తిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న మాధవిని నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.


**తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి**
ప్రాంతీయ కార్యాలయము, నల్లగొండ.
ఇం.నెం. 8-15, మొదటి అంతస్తు, శ్రీలక్ష్మీ కాంప్లెక్స్, ఆర్.టి.ఓ. ఆఫీస్ దగ్గర, శ్రీ వినాయక నగర్, హైద్రాబాద్ రోడ్, నల్లగొండ - 508 001. తెలంగాణ. ఫోన్: 08682-248005

**పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన**


పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం యొక్క ప్రకటన నెం. యస్.ఓ. 1533, తేది: 14 సెప్టెంబర్ 2006ను అనుసరిస్తూ మెస్సర్స్ యస్.ఆర్.ఆర్. లాబొరేటరీస్ వారు సర్వే నెంబర్ 290 & భాగాలు, దొండపాడు గ్రామం, చింతలపాలెం మండలం, సూర్యాపేట జిల్లాలో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ (బల్క్‌డ్రగ్ & ఇంటర్మీడియట్స్) తయారు చేయుటకు నూతన పరిశ్రమను నిర్మించుటకు ప్రతిపాదన చేయడమైనది. ఇట్టి ప్రతిపాదనను వారు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఈ ప్రకటనను జారీ చేయడం జరుగుతున్నది.

| | | |
|---|---|---|
| 1 | కంపెనీ పేరు టెలిఫోన్ నెం. | మెస్సర్స్ యస్.ఆర్.ఆర్. లాబొరేటరీస్, ఫోన్ నెం. 7702194899 |
| 2 | రిజిస్టర్డ్ ఆఫీస్ | డోర్ నెం. 3-60, దొండపాడు గ్రామం, చింతలపాలెం మండలం, సూర్యాపేట జిల్లా - 508 246. |
| 3 | ప్లాంటు ప్రతిపాదన ప్రదేశం | సర్వే నెంబర్ 290 & భాగాలు, దొండపాడు గ్రామం, చింతలపాలెం మండలం, సూర్యాపేట జిల్లా |
| 4 | సంప్రదించవలసిన అధీకృత అధికారి | శ్రీ ఆర్. రాఘవేంద్ర, పార్టనర్ ఫోన్ : 7702194899 |
| 5 | ప్రాజెక్టు పెట్టుబడి | రూ॥ 15.0 కోట్లు |
| 6 | చేపట్టబడు కార్యక్రమములు | సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ (బల్క్‌డ్రగ్ & ఇంటర్మీడియట్స్) తయారు చేయుటకు నూతన పరిశ్రమను నిర్మించుటకు ప్రతిపాదన |
| 7 | ప్రజాభిప్రాయ సేకరణ జరుగు తేదీ, సమయం మరియు ప్రదేశము | తేది. 08-08-2019, ఉదయం 10 గం॥లకు ప్రతిపాదిత పరిశ్రమ యొక్క స్థలము వద్ద, సర్వే నెం. 290 & భాగాలు, దొండపాడు గ్రామం, చింతలపాలెం మండలం, సూర్యాపేట జిల్లా. |
| 8 | ప్రాజెక్టు / పర్యావరణ కన్సల్టెంట్ | మెస్సర్స్ రైట్‌సోర్స్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ ప్రై.లి., హైద్రాబాద్. ఫోన్: 040-23070602 |
| 9 | ప్రతిపాదిత ప్రాజెక్టుపై ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు / ఆంగ్లము) మరియు డ్రాఫ్ట్ ఇ.ఐ.ఎ. నివేదిక లభించు ప్రదేశాలు<br>1) జిల్లా కలెక్టర్ కార్యాలయం, సూర్యాపేట.<br>2) జిల్లా పరిషత్ కార్యాలయం, సూర్యాపేట.<br>3) జిల్లా పరిశ్రమల కేంద్రం, సూర్యాపేట.<br>4) తహశీల్దార్ కార్యాలయము, చింతలపాలెం మండలం, సూర్యాపేట జిల్లా.<br>5) గ్రామ పంచాయతి కార్యాలయము, గ్రా॥ దొండపాడు, మం॥ చింతలపాలెం, జి॥ సూర్యాపేట.<br>6) ప్రాంతీయ కార్యాలయం, పర్యావరణము, అడవులు మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, చైన్నై.<br>7) తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవనము, ఎ-3, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సనత్‌నగర్, హైద్రాబాద్.<br>8) తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయం, రామచంద్రాపురం, సంగారెడ్డి జిల్లా.<br>9) తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, నల్లగొండ. | |

ప్రభావితం అయ్యేటటువంటి ప్రాజెక్టు స్థలం / డిస్‌ప్లేస్‌మెంట్ స్థలాల వద్ద ఉన్న ప్రామాణిక నివాసితులు, పర్యావరణ గ్రూపులు, ఇతరులతో సహా అందరు వ్యక్తుల నుండి ఎవరికైనా ఏదేని అభ్యంతరాలు మరియు సలహాలు, ఉద్దేశ్యాలు మరియు వ్యాఖ్యలు ఉన్నట్లయితే ప్రకటన ప్రచురణ తేది నుండి 30 రోజులలోగా కోరబడుతున్నవి. పై అందరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి దిగువ సంతకందారులకు వ్రాతపూర్వక సలహాలు కూడా దాఖలు చేసుకొనవచ్చును. ఆసక్తి గల వ్యక్తులు పై నిర్దేశించిన తేది మరియు ప్రదేశమున జరుగు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనవచ్చును. డ్రాఫ్ట్ ఇ.ఐ.ఎ. మరియు ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు మరియు ఆంగ్లము) టి.యస్.పి.సి.బి. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడును.

సం/-
**పర్యావరణ ఇంజనీర్**
తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయము, నల్లగొండ.
ప్రదేశం : నల్లగొండ.
తేది. 05-07-2019


Eenadu epaper




# సంధాన యోగం

అత్యంత కీలకమైన మౌలిక వసతుల రంగాన్ని మరింత పరిపుష్టం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. దేశంలో రోడ్డు, రైలు, జల రవాణాకు సంబంధించిన సదుపాయాలను మెరుగుపరచేందుకు ప్రాముఖ్యత ఇచ్చింది. సదుపాయాలపరంగా గ్రామీణ-పట్టణ అంతరాలను పూడ్చేందుకు రవాణా, ఇంటర్నెట్ అనుసంధానతలకు భారీగా ఊతమివ్వాలని నిర్ణయించింది. హరిత పరిజ్ఞానం, వ్యర్థ ప్లాస్టిక్, కోల్డ్ మిక్స్ పరిజ్ఞానం ద్వారా 30వేల కిలోమీటర్ల మేర ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) రోడ్ల అభివృద్ధి చేయనుంది. సంధానతకు సంబంధించిన మౌలిక వసతులను మరింత మెరుగుపరచేందుకు విద్యుత్ రంగంలో విజయవంతమైన 'ఒకే దేశం, ఒకే గ్రిడ్' తరహాలో గ్యాస్ గ్రిడ్‌లు, నీటి గ్రిడ్‌లు, ఐవేస్(సమాచార అనుసంధానత), ప్రాంతీయ విమానాశ్రయాలను అభివృద్ధి చేయడానికి ఈ ఏడాది ప్రణాళికలు సిద్ధం చేయనుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఉద్యోగ సృష్టికి చర్యలు చేపట్టడం ద్వారా 5లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వ దార్శనికతను ఆవిష్కరించారు.

- మౌలిక వసతులకు భారీ ఊతం
- రోడ్డు, రైలు, జల రవాణా వ్యవస్థల మెరుగుకు ప్రాధాన్యం
- పెట్టుబడుల సమీకరణపై దృష్టి
- బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ వెల్లడి



**వచ్చే ఐదేళ్లలో మౌలిక వసతుల కోసం రూ.100 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ఈ రంగంలో ఆర్థిక అవసరాలు ఏటా రూ.20లక్షల కోట్ల మేర ఉండొచ్చని అంచనా. మౌలిక వసతుల కోసం పెట్టుబడులను అందించే వనరులను పెంచనున్నాం. 'క్రెడిట్ గ్యారంటీ ఎన్‌హెన్స్‌మెంట్ కార్పొరేషన్' ఏర్పాటు కూడా ఇందులో ఉంది. నిధుల సమీకరణ అంశాన్ని అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయనున్నాం.**

సంధానత అనేది ఆర్థిక వ్యవస్థకు జీవనాడి అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రైల్వే మౌలిక వసతుల పెంపునకు రూ.50లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని అంచనావేశారు. పీఎంజీఎస్‌వై, పారిశ్రామిక కారిడార్లు, ప్రత్యేక సరకు రవాణా నడవాలు, భారతమాల, సాగరమాల, జలమార్గ్ వికాస్, ఉడాన్ వంటి పథకాల ద్వారా అన్ని రకాల రవాణా సంధానతలకు ప్రభుత్వం భారీగా ఊతమిస్తున్న సంగతిని ఈ బడ్జెట్‌లో వివరించారు. భారతమాల ప్రాజెక్టులోని రెండో దశ కింద రోడ్డు మార్గాలను అభివృద్ధి చేయడంలో రాష్ట్రాలకు సాయం అందిస్తామని తెలిపారు. భారీ ప్రజా మౌలిక వసతులను కేంద్రంలోని వివిధ మంత్రిత్వశాఖలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వద్ద ఉన్న భూముల్లో నిర్మించవచ్చన్నారు.

## గ్రామాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్

సార్వత్రిక సేవా నిధి తోడ్పాటుతో భారత్‌నెట్ ప్రాజెక్టు కింద గ్రామీణ భారత్‌లో ఇంటర్నెట్ సంధానత వేగాన్ని పెంచడానికి చర్యలు చేపట్టనుంది. గ్రామీణ-పట్టణ డిజిటల్ అంతరాలను పూడ్చేందుకు భారత్‌నెట్.. దేశంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని స్థానిక సంస్థల్లో ఇంటర్నెట్ సంధానతను కల్పించాలని, 2020 మార్చి నాటికి 2.5 లక్షల గ్రామ పంచాయతీలను హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌తో సంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరతా అభియాన్ కింద 2కోట్ల మందికిపైగా గ్రామీణ భారతీయులకు డిజిటల్ అక్షరాస్యత కల్పించినట్లు ఆర్థిక మంత్రి వివరించారు.

## కార్డుతో చెల్లింపులు

నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) ప్రమాణాల ఆధారంగా మొట్టమొదటిసారిగా దేశీయంగా చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీన్ని ఈ ఏడాది మార్చిలో ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఈ కార్డు వల్ల దేశవ్యాప్తంగా మెట్రో సర్వీసులు, టోల్ ట్యాక్స్ వంటి అన్ని రకాల రవాణా రుసుములను చెల్లించడానికి వీలవుతుంది. జాతీయ హైవే కార్యక్రమాన్ని పునర్‌వ్యవస్థీకరించి, అవసరమైన స్థాయిలో జాతీయ హైవే గ్రిడ్‌ను సిద్ధం చేసే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## అంతర్గత జలరవాణా..

జాతీయ జలమార్గాల్లో నౌకాయానం పెంపొందించేందుకు జల మార్గ్ వికాస్ ప్రాజెక్టు చేపట్టినట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. రోడ్డు, రైలు నుంచి గణనీయ స్థాయిలో సరకు రవాణాను అంతర్గత జలమార్గాలకు మళ్లించాలని ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్‌లో కోరారు. జలమార్గ్ వికాస్ ప్రాజెక్టులో భాగంగా గంగా నదిలో నౌకాయానాన్ని పెంపొందించేందుకు వారణాసిలో మల్టీమోడల్ టెర్మినల్ 2018 నవంబర్‌లో వినియోగంలోకి వచ్చింది. 2019-20లో సాహిబ్‌గంజ్, హల్దియాల్లో మరో రెండు టెర్మినళ్లు పూర్తవుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం తెలిపింది. గంగానదిపై సరకు రవాణా వచ్చే నాలుగేళ్లలో నాలుగు రెట్లు పెరుగుతుందని అంచనా వేసింది. తాజా బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.1902.56 కోట్లను కేటాయించింది. 2018-19లో రూ.1881.13 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో అది రూ.1938.76 కోట్లకు చేరింది.


## విమానయానం..

విమాన ఫైనాన్సింగ్, లీజింగ్ కార్యక్రమాల్లోకి ప్రవేశించేందుకు భారత్‌కు ఇదే అనువైన సమయమని ప్రభుత్వం ప్రకటించింది. స్వయం సమృద్ధ విమానయాన పరిశ్రమ అభివృద్ధికి, విమానయాన ఫైనాన్స్‌లో ఉద్యోగ సృష్టికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపింది. ఉడాన్ వంటి పథకాలు గ్రామీణ-పట్టణ అంతరాలను పూడ్చడంలో సాయపడుతున్నాయని, చిన్న నగరాలకు విమాన సంధానత పెరుగుతోందని ఆర్థిక మంత్రి చెప్పారు. రవాణా రంగంలో పర్యావరణ అనుకూల విధానాలకు పెద్ద పీట వేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాయితీలు, ఛార్జింగ్‌కు సంబంధించిన మౌలిక వసతులను కల్పించడం ద్వారా విద్యుత్ వాహనాలు వేగంగా మళ్లేలా చూడటం కోసం ఎఫ్ఏఎంఈ-2 పథకం కింద ఈ ఏడాది ఏప్రిల్ 1న రూ.10వేల కోట్లు కేటాయించడానికి ఆమోదం తెలిపిన సంగతిని ఆర్థిక మంత్రి గుర్తు చేశారు.

## గ్రామీణ రోడ్లకు ఊతం

గ్రామాల్లో అర్హత ఉన్న ఆవాసాలకు సార్వత్రిక సంధానతను సాధించే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు లక్ష్యాన్ని 2022 నుంచి 2019కి ప్రభుత్వం కుదించింది. ఇలాంటి 97 శాతం ఆవాసాలకు అన్నికాలాల్లోనూ రవాణా యోగ్యత కల్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గత వెయ్యి రోజుల్లో రోడ్డు నిర్మాణ వేగాన్ని రోజుకు 130 నుంచి 135 కిలోమీటర్లకు పెంచింది. ఆర్థిక వ్యవస్థలో మార్పుల దృష్ట్యా గ్రామాల్లోని రోడ్లను గ్రామీణ మార్కెట్లను సంధానించడం చాలా ముఖ్యమని స్పష్టం చేసిన ప్రభుత్వం ఇందుకోసం పీఎంజీఎస్‌వై-3 కింద రూ.80,250 కోట్లతో 1.25 లక్షల కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లను బలోపేతం చేయనుంది.

– దిల్లీ



## గాంధీపీడియా

దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మాగాంధీ సిద్ధాంతాలు, బోధనలు, ఆయన నేర్పిన విలువలను యువతరానికి తెలియజెప్పేందుకు వీలుగా 'గాంధీపీడియా'ను రూపొందించనున్నారు. సైన్స్ మ్యూజియంల జాతీయమండలి దీన్ని అభివృద్ధి చేయనుంది. బాపూజీ సిద్ధాంతాలకు అనుగుణంగా మనల్ని మనం పునరంకితులు చేసుకోడానికి ఆయన 150వ జయంతి సంవత్సరం మంచి అవకాశమని బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ తెలిపారు. 2019 అక్టోబరు 2వ తేదీ నాటికి బాపూజీ కలలుగన్న స్వచ్ఛభారతాన్ని సాధించాలని ప్రధాని సంకల్పించారన్నారు. ఈ లక్ష్యాన్ని సాధిస్తున్న సందర్భంగా రాజ్‌ఘాట్‌లోని గాంధీదర్శన్ వద్ద అక్టోబరు 2న రాష్ట్రీయ స్వచ్ఛత కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు.




## స్వచ్ఛం అద్భుతం

స్వచ్ఛభారత్ అభియాన్ ఉద్యమం దేశ ప్రజల ఆత్మప్రబోధంగా మారింది..తద్వారా ఆరోగ్య వృద్ధితో పాటు పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతోంది. 2014లో ప్రవేశపెట్టిన ఈ పథకం అద్భుత విజయం సాధించింది. ఇది ప్రారంభమైన తరువాత దేశంలో 9.6 కోట్ల మరుగుదొడ్లు నిర్మితమయ్యాయి. 5.6 లక్షల గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా రూపుదిద్దుకున్నాయి. స్వచ్ఛ ఉద్యమం ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడంతో పాటు..అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వ్యర్థాల నుంచి శక్తి ఉత్పాదన జరుగుతోంది. స్వచ్ఛభారత్ ఉద్యమం మరింతగా విస్తరించడం ద్వారా గ్రామాలలో ఘన వ్యర్థాల నిర్వహణ మరింత మెరుగుపడుతుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.




## ఆధార్‌తో ఐటీ

ఈనాడు, హైదరాబాద్: ఆదాయపు పన్ను(ఐటీ) రిటర్నులు దాఖలు చేసేందుకు శాశ్వత ఖాతా సంఖ్య(పాన్) అవసరమన్న నిబంధనను తాజా బడ్జెట్‌లో తొలగించారు. ఆధార్ సంఖ్య ఆధారంగానూ ఇకపై రిటర్నులు దాఖలు చేయొచ్చు. పాన్ పేర్కొనాల్సిన ప్రతి సందర్భంలోనూ ప్రత్యామ్నాయంగా ఆధార్‌ను వినియోగించవచ్చు. ఐటీ రిటర్నుల దాఖలును మరింత సరళీకృతం చేసేలా పలు మార్పులు రాబోతున్నాయి. ఇందులో భాగంగా ముందే పూరించిన రిటర్నుల పత్రాలు పన్ను చెల్లింపుదారులకు అందుబాటులోకి రానున్నాయి. వేతనం, సెక్యూరిటీల ద్వారా వచ్చిన మూలధన లాభం, బ్యాంకుల నుంచి వచ్చిన వడ్డీ, డివిడెండ్లు ఇలా అన్ని ఆదాయాల వివరాలు అందులో ఉంటాయి. వచ్చిన ఆదాయాలను ఆదాయపు పన్ను శాఖకు తెలియకుండా దాచిపెట్టడం ఇకపై సాధ్యం కాకపోవచ్చు.

మన దేశ పాస్‌పోర్టు ఉన్న ప్రవాస భారతీయులకు ఆధార్ కార్డు ఇవ్వడానికి నిర్దేశిత గడువు నిబంధనను తొలగించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం వారు ఆధార్‌కార్డు పొందడానికి 180 రోజులు నిరీక్షించాలి.



## కొత్త నాణేలు


దిల్లీ: కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త నాణేలను విడుదల చేయాలని నిర్ణయించింది. 'ఒకటి, రెండు, ఐదు, పది, ఇరవై రూపాయిల విలువైన నాణేలను ఈ నెల 7న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేస్తారు. ఇవి చూపులేని వారు కూడా సులభంగా గుర్తించేలా ఉంటాయి. వీటిని ప్రజలు వినియోగించుకునేందుకు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాము' అని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

## కేంద్ర బడ్జెట్ సమగ్ర స్వరూపం


(రూ.కోట్లలో)

| | 2017–18 వాస్తవ గణాంకాలు | 2018–19 బడ్జెట్ అంచనాలు | 2018–19 సవరించిన అంచనాలు | 2019–20 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 14,35,233 | 17,25,738 | 17,29,682 | 19,62,761 |
| మూలధన వసూళ్లు | 7,06,740 | 7,16,475 | 7,27,553 | 8,23,588 |
| మొత్తం వసూళ్లు | 21,41,973 | 24,42,213 | 24,57,235 | 27,86,349 |
| మొత్తం వ్యయం | 21,41,973 | 24,42,213 | 24,57,235 | 27,86,349 |
| రెవెన్యూ లోటు | 4,43,600 | 4,16,034 | 4,10,930 | 4,85,019 |
| కోశలోటు | 5,91,062 | 6,24,276 | 6,34,398 | 7,03,760 |
| ప్రాథమిక లోటు | 62,110 | 48,481 | 46,828 | 43,289 |

## వడ్డీ చెల్లింపులకే 18 పైసలు




| రూపాయి రాక | రూపాయి పోక |
|---|---|
| అప్పులు | కేంద్ర ప్రాయోజిత పథకాలు |
| కార్పొరేట్ పన్ను | కేంద్ర రంగ పథకాలు |
| ఆదాయపు పన్ను | వడ్డీ చెల్లింపులు |
| కస్టమ్స్ సుంకాలు | రక్షణ |
| కేంద్ర ఎక్సైజ్ సుంకాలు | రాయితీలు |
| జీఎస్‌టీ | ఆర్థిక సంఘం, ఇతర బదిలీలు |
| పన్నేతర రాబడి | పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటా |
| రుణేతర మూలధన రాబడి | పింఛన్లు |
| | ఇతర వ్యయం |



## విద్యుత్ రంగానికి ప్యాకేజీ

- సంస్థాగత సంస్కరణలూ అమలు
- 2022 నాటికి కోరిన ప్రతి ఇంటికీ విద్యుత్, గ్యాస్ కనెక్షన్

దిల్లీ: 'ఒకే దేశం, ఒకే గ్రిడ్' లక్ష్యాన్ని సాధించేందుకు విద్యుత్ రంగానికి ప్రభుత్వం త్వరలో ఒక ప్యాకేజీని ప్రకటించనుంది. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో ఉజ్వల, సౌభాగ్య పథకాల కింద 2022 నాటికి గ్రామాల్లో కోరుకున్న ప్రతి ఇంటికీ వంటగ్యాస్, విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపింది. నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాలు వెల్లడించారు. ప్యాకేజీ తీరుతెన్నులపై వివరాలు చెప్పలేదు.


క్రాస్ సబ్సిడీ ఛార్జీలు, ఓపెన్ యాక్సెస్ విక్రయాలు లేదా పరిశ్రమల్లో క్యాప్టివ్ విద్యుదుత్పత్తి, భారీ విద్యుత్ వినియోగదారులపై అవాంఛనీయ సుంకాలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పనిచేయనున్నట్లు బడ్జెట్‌లో కేంద్రం తెలిపింది. సంస్థాగతమైన ఈ సంస్కరణలతోపాటు ధరల విధానంపై గణనీయ స్థాయిలో సంస్కరణలు అవసరమని పేర్కొంది. విద్యుత్ రంగ టారిఫ్, నిర్మాణపరమైన సంస్కరణలతో కూడిన ఒక ప్యాకేజీని త్వరలో ప్రకటించనున్నట్లు వివరించింది. పాత, సమర్థత లేని విద్యుత్ కర్మాగారాలను ఉపసంహరించడం, సహజవాయువు లభ్యత తక్కువగా ఉన్నందువల్ల గ్యాస్ ఆధారిత కర్మాగారాలను చాలా తక్కువ స్థాయిలో పనిచేయించడం వంటి అంశాలపై అత్యున్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సులను త్వరలోనే అమలు చేయనున్నట్లు పేర్కొంది.

ఉజ్వల యోజన కింద దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఇప్పటి వరకు 7 కోట్లకుపైగా వంట గ్యాస్ కనెక్షన్లను అందించింది. సౌభాగ్య పథకం కింద 2.63 కోట్ల కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ లభించింది. ఛత్తీస్‌గఢ్ మినహా మిగతా రాష్ట్రాల్లో 100 శాతం విద్యుద్దీకరణం సాధ్యమైంది. మెరుగైన జీవన నాణ్యతకు, స్వచ్ఛమైన వాతావరణ పరిరక్షణకు ఇది ముఖ్యమని పేర్కొన్నారు. ఉజ్వల యోజన కింద 35 కోట్ల ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేసినట్లు చెప్పారు. దీనివల్ల ఏటా రూ.18,341 కోట్లు ఆదా అవుతున్నట్లు పేర్కొన్నారు.

> తాజా బడ్జెట్‌లో ఎన్‌టీపీసీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సహా ప్రభుత్వ రంగంలోని ఏడు విద్యుత్ కంపెనీలకు ప్రభుత్వం పెట్టుబడులను 23 శాతం మేర తగ్గించింది. అత్యధికంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు 47.34 శాతం మేర కోత పడింది. గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాలు రూ.56,742.49కోట్లుగా ఉంది.

## ప్రగతి బాటలు

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దఎత్తునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మన జాతీయ రహదారుల్లో 24 శాతమే 4 వరసలున్నాయి. మిగతా వాటిని అభివృద్ధి చేసేందుకు వేగవంతమైన కృషి జరుగుతోంది. ప్రస్తుతం రోజుకు సుమారు 30 కి.మీ. మేర జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నట్లు అంచనా.





దేశంలో జాతీయ రహదారుల పొడవు: **1,31,326** కిమీ

ఆంధ్రప్రదేశ్‌లో: **6,529** కిమీ

తెలంగాణలో: **3,795** కిమీ

**జాతీయ రహదారుల పరంగా తొలి 5 రాష్ట్రాలు**




మొత్తం రహదారుల పరంగా ప్రపంచంలోనే మనది **రెండో** స్థానం!

అమెరికా: **68.5** లక్షల కిమీ

భారత్: **59.03** లక్షల కిమీ


# నవ్యపథం నిర్మల రథం!

కేంద్ర బడ్జెట్ 2019-20

'కార్య పురుష కరేణ లక్ష్యం సంపద్యతే' అన్నది చాణక్య నీతి. మన ప్రయత్నం, సంకల్పం దృఢంగా ఉంటే పని తప్పక పూర్తవుతుంది! ఈ ఐదేళ్లలో మేం చేపట్టిన భారీ కార్యక్రమాలు, సేవలు ఇప్పుడు మరింత వేగవంతమవటం ఖాయం.



# రైతే రాజు



రైతుల ఆదాయాన్ని 2022కల్లా రెట్టింపు చేయాలన్న నరేంద్ర మోదీ తొలి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించే దిశగా నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు జరిపారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు, రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. రైతుల ఆదాయ వృద్ధికి, వారిలో వ్యాపార సామర్థ్యాల పెంపు, వ్యవసాయంలో మౌలిక వసతుల వృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. ఆహారశుద్ధి పరిశ్రమలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించనున్నారు.

- వ్యవసాయ రంగానికి రూ.1.39 లక్షల కోట్లు
- కిసాన్ సమ్మాన్ నిధికి రూ.75వేల కోట్లు
- వడ్డీ రాయితీకి గత ఏడాది కన్నా పెరిగిన నిధులు
- ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

దిల్లీ: వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వశాఖకు 2019-20 బడ్జెట్‌లో రూ.1.39లక్షల కోట్లను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం కిసాన్ సమ్మాన్ నిధికి రూ.75 వేల కోట్లను కేటాయించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఆహార శుద్ధిరంగంలో ప్రైవేటును ప్రోత్సహించటం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల విలువలు పెరిగి రైతుల ఆదాయం అధికమవుతుందని పేర్కొన్నారు. సులభతర వాణిజ్యం, సులభతర జీవనం విధానాలను రైతులకూ వర్తింపజేయాలన్నారు. అన్నదాత శక్తిదాతగా కూడా మారాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. సహకార సంఘాల ద్వారా పాడి పరిశ్రమను వృద్ధి చేయటం, పశువుల మేత తయారీ, పాల సేకరణ, శుద్ధి, మార్కెటింగ్‌ను ప్రోత్సహించటం ద్వారా ఆదాయ మార్గాలను విస్తరింపజేస్తామని వివరించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో దేశాన్ని స్వయంసమృద్ధిగా మార్చినట్లుగానే నూనె గింజల ఉత్పత్తినీ అధికం చేయాలని అన్నదాతలకు ఆర్థిక మంత్రి సూచించారు.

- వచ్చే అయిదేళ్లలో దేశంలో కొత్తగా 10 వేల రైతు ఉత్పాదక సంఘాల (ఎఫ్‌పీఓ) ఏర్పాటును లక్ష్యించారు.
- ఇ-నామ్‌ల ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేయటం.
- రైతులపై రుణ భారాన్ని తగ్గించేలా, పంటల సాగు ఖర్చును తగ్గించేలా ప్రకృతి వ్యవసాయానికి (జీరో బడ్జెట్ ఫార్మింగ్‌కు) కార్యాచరణ.
- వ్యవసాయ వ్యాపార సామర్థ్యాలు పొందేలా 75 వేల మందికి తర్ఫీదు.
- గ్రామాల్లోని సంప్రదాయ పరిశ్రమలను పునరుజ్జీవింపజేసి, ఉన్నతీకరించేందుకు నిధులు అందించటం, తద్వారా వాటిని ఉత్పాదక కేంద్రాలుగా తీర్చిదిద్ది, ఉపాధి కల్పన కేంద్రాలుగా మలచటం. ఈ తరహా పరిశ్రమలతో కూడిన 100 క్లస్టర్ల ఏర్పాటు చేయటం. తేనె, వెదురు, ఖాదీ తదితర ఉత్పత్తులపై దృష్టి సారించటం.
- ప్రధాన ఆర్థిక స్రవంతిలోకి వచ్చేలా 50వేల మంది చేతి వృత్తిదారులకు తర్ఫీదు ఇవ్వటం. గ్రామీణ వ్యాపారాలకు ప్రోత్సాహం వంటివి మంత్రి ప్రతిపాదించిన వాటిలో ఉన్నాయి. అయితే, వీటికి నిధుల కేటాయింపుపై స్పష్టత రాలేదు

## సాగుకు సాయం ఇలా..

| పథకం | బడ్జెట్‌లో కేటాయింపు (రూ.కోట్లలో) |
|---|---|
| కిసాన్ సమ్మాన్ | 75,000 |
| పంటల బీమా యోజన | 14000 |
| రుణాలకు వడ్డీ రాయితీ | 18,000 |
| హరిత విప్లవం (18 పథకాలను కలిపి) | 12,560 |
| పీఎంకెఎస్‌వై | 3,500 |
| మార్కెట్ జోక్యం కోసం | 3000 |
| అన్నదాత ఆయ్ సంరక్షణ్ యోజన | 1500 |
| వ్యవసాయ యాంత్రీకరణ | 600 |

## మత్స్యశాఖకు కొత్తపథకం

**రూ.3737 కోట్ల నిధులు**

మత్స్య పరిశ్రమ ఆధునికీకరణ, సముద్రంలో చేపల అన్వేషణ, ఉత్పత్తి, వేట తర్వాత నిల్వ పద్ధతులు, నాణ్యత పరిరక్షణ, చేపల ఉత్పత్తులకు అదనపు విలువల జోడింపు తదితరాల కోసం నూతన పథకాన్ని ప్రకటించారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) అమలుకు రూ.3,737 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

## పీఎం కిసాన్ సమ్మాన్ నిధి

**అర్హులు 14.50 కోట్లు.. అందేది ఎందరికో?**



మొదట 2 హెక్టార్లలోపున్న రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.6 వేలు ఇస్తామన్న మోదీ సర్కారు.. రెండో దఫా అధికారంలోకి వచ్చాక 2 హెక్టార్ల నిబంధన తొలగించి అందరికీ సాయం అందించాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారుల సంఖ్య 12.50 కోట్ల నుంచి 14.50 కోట్లకు పెరిగింది. రూ.6 వేల మొత్తాన్ని ఏడాదిలో 3 విడతలుగా అందజేస్తారు. కొత్తగా ఈ పరిధిలోకి వచ్చిన వారికి మాత్రం తొలి రెండు విడతలూ అందవు.



పథకంపై ఈ ఏడాది కేంద్రం చేసే ఖర్చు

**రూ.75 వేల కోట్లు**

| ఆంధ్రప్రదేశ్‌లో అర్హులు | తెలంగాణలో అర్హులు |
|---|---|
| సుమారు 60 లక్షల మంది | సుమారు 35 లక్షల మంది |
| ఇప్పటి వరకూ గుర్తించిన లబ్ధిదారులు | ఇప్పటి వరకూ గుర్తించిన లబ్ధిదారులు |
| 34,92,785 | 23,64,395 |

## 62,659 కోట్లు ఆరోగ్య రంగానికి

దిల్లీ: ఆరోగ్య భారత్‌కు ఆర్థికంగా అండ దక్కింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఈ రంగానికి రూ.62,659.12 కోట్లు కేటాయించారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఇది అత్యధికం. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.52,800 కోట్లు కేటాయించగా ఈసారి 19 శాతం కేటాయింపుల్ని పెంచారు. వీటిలో ఆయుష్మాన్‌భారత్‌కు రూ. 6,400 కోట్లు, పట్టణ ఆరోగ్య మిషన్ ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలకు రూ.249.96 కోట్లు, గ్రామీణ ఆరోగ్య మిషన్ ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలకు రూ.1,349.97 కోట్లు, జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ. 32,995 కోట్లు, జాతీయ ఎయిడ్స్, ఎస్టీడీ నియంత్రణ కార్యక్రమానికి రూ.2,500 కోట్లు, ఎయిమ్స్‌కు రూ.3,599.65 కోట్లు కేటాయించారు.

## 4,000 కోట్లు ఈవీఎంలకు

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల కోసం 2018-19లో ఈవీఎంలను సమకూర్చుకునేందుకు కేంద్రం దాదాపు రూ.4 వేల కోట్లను ఖర్చుపెట్టినట్లు బడ్జెట్ పత్రాన్ని బట్టి తెలుస్తోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సాధారణ ఎన్నికల వ్యయంలో తిరిగి చెల్లింపులకు సంబంధించిన కేంద్రవాటా కింద రూ. 339.54 కోట్లను కేటాయించారు. కాలం చెల్లిన ఈవీఎంలను నిర్వీర్యం చేసేందుకు ఈ నిధులు వినియోగిస్తారు.

## 6,815 కోట్లు గిరిపుత్రులకు

గిరిజన సంక్షేమానికి కేంద్రం పెద్దపీట వేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గిరిజన వ్యవహారాల శాఖకు 2018-19 బడ్జెట్(రూ.6000కోట్లు) కంటే 15 శాతం అధికంగా రూ.6,814.96 కోట్లు కేటాయించింది. గిరిజన విద్యకు రూ.1953.50కోట్లు కేటాయించింది. 275(1) అధికరణం కింద 46 శాతం అధికంగా రూ.2,662.55 కోట్లను గ్రాంట్లుగా కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.5,659.24 కోట్లు, వనబంధు కల్యాణ్ యోజనకు రూ.406.52కోట్లు, ఉన్నత విద్య చదివే ఎస్టీ విద్యార్థుల ఉపకారవేతనాలకు రూ.102 కోట్లు, గిరిజన సంస్థలకు రూ.83 కోట్లు ప్రకటించింది.

## 235 కోట్లు సిబ్బంది మంత్రిత్వ శాఖకు

బ్యూరోక్రాట్ల శిక్షణ కోసం కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖకు రూ.235 కోట్లు కేటాయించారు. ఇది గత ఏడాది కేటాయింపు కంటే 24శాతం ఎక్కువ. కేంద్ర పరిపాలనా ట్రైబ్యునళ్ల కోసం రూ.126.52 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం నియామక పరీక్షలు నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు రూ.240.22కోట్లు కేటాయించారు.

## 2,189 కోట్లు పర్యాటకానికి

దేశంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు 17 ప్రముఖ పర్యాటక కేంద్రాలను ప్రపంచస్థాయి పర్యాటక ఆకర్షణలుగా తీర్చిదిద్దనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత బడ్జెట్‌లో పర్యాటక శాఖకు రూ2,150 కోట్లు కేటాయించగా ఈసారి రూ.2,189.22 కోట్లకు (1.82%) పెంచారు. సాంస్కృతిక శాఖకు గతేడాది రూ.2,843.32 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో రూ.3,042.35 కోట్లకు (7%) పెరిగింది. పర్యాటక శాఖకు కేటాయించిన నిధుల్లో రూ.1378.53 కోట్లు మౌలిక వసతుల కల్పనకు, రూ.575.50 కోట్లు ప్రచార కార్యకలాపాలకు నిర్దేశించారు.

## నవ భారతాన్ని నిర్మించే జనహిత బడ్జెట్



- ప్రధాని నరేంద్ర మోదీ

ఇది జనహిత పద్దు..
హరిత బడ్జెట్..
నవభారత నిర్మాణానికి
దార్శనిక పత్రం..

అని కేంద్ర బడ్జెట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఇది పేదల సంక్షేమానికి, రైతుల ఆదాయం రెట్టింపు కావడానికి, దేశ యువత ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. 21వ శతాబ్దంలో భారత ప్రగతిరథాన్ని పరుగులు తీయిస్తుందని ప్రశంసించారు. పేదలను శక్తిమంతులను చేస్తుందన్నారు. పూర్తి ఆశావహమైన ఈ బడ్జెట్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు అట్టడుగువర్గాల ప్రజలు సాధికారత సాధించేలా చేస్తాయన్నారు. పర్యావరణంపై బడ్జెట్ దృష్టి సారించిందని.. నాణ్యమైన విద్యుత్తు, రవాణా అవసరాలను నెరవేరుస్తుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక సంస్కరణలను బడ్జెట్ నొక్కి చెప్పిందని ప్రధాని వివరించారు. రైతుల ఆదాయం రెట్టింపు కావడానికి, వ్యవసాయ రంగంలో మార్పులకు మార్గసూచిగా నిలిచిందని అన్నారు. బడ్జెట్ కీలక ప్రయోజనాలను వివరించిన ప్రధాని ఇది దేశ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని, మధ్య తరగతి ప్రజలకు అద్భుత ప్రయోజనకారిగా నిలుస్తుందని అభివర్ణించారు. పన్ను విధానాన్ని సరళీకరిస్తుందని.. దేశంలో మౌలిక వసతుల ఆధునికీకరణకు దోహదపడుతుందని అన్నారు. వ్యాపారాలను, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలను బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచుతుందన్నారు. పేదలు, రైతులు, దళితులు, బడుగు బలహీన వర్గాల సాధికారతకు అవసరమైన అన్ని చర్యలనూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. ఈ సాధికారతే వచ్చే ఐదేళ్లలో వారిని దేశాభివృద్ధిలో 'శక్తి కేంద్రం'గా మారుస్తుందని అన్నారు. దీంతోనే దేశం 5 లక్షల కోట్ల డాలర్ల (దాదాపు రూ. 350 లక్షల కోట్లు) ఆర్థికరంగం కలను సాకారం చేసే శక్తిని పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు.

# కొత్తగా పద్దుల సంచి

- బ్రీఫ్‌కేస్ కాదని ఎర్రటి బ్యాగులో బడ్జెట్ పద్దును తెచ్చిన ఆర్థికమంత్రి
- ఏళ్లనాటి సంప్రదాయానికి భిన్నంగా



దిల్లీ: జరీ అంచు ఊదారంగు చీర.... నిరాడంబరమైన ఆహార్యంతో.... నార్త్‌బ్లాక్‌లోని తన కార్యాలయం నుంచి శుక్రవారం బడ్జెట్ సమర్పణ నిమిత్తం వెలుపలికి అడుగుపెట్టిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కుడిచేతిలో పదిలంగా పట్టుకుని ఉన్న ఎర్రని వస్త్రంతో చేసిన బ్యాగు అందరి దృష్టినీ ఆకర్షించింది. ఎన్నోఏళ్ల నుంచీ కొనసాగుతున్న బడ్జెట్ బ్రీఫ్‌కేసు సంప్రదాయానికి భిన్నంగా విత్తమంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఎర్రని వస్త్రం బ్యాగులో బడ్జెట్‌పత్రాలు తీసుకొని వచ్చారు. ఈ బ్యాగుపై బంగారురంగులో మెరిసిపోతూ ప్రస్ఫుటంగా కనిపిస్తున్న భారత జాతీయ చిహ్నం ఉంది. జాతీయ చిహ్నం ముద్రకే తాళం చెవితో బ్యాగును తెరిచే అమరిక ఉంది.

### "బ్రిటిష్ ప్రభావం నుంచి వైదొలగాల్సిన సమయం ఇదే..."

"బ్రిటిష్ ప్రభావం నుంచి వైదొలగడానికి సరైన సమయం ఇదే అనుకున్నాను... మనదైన శైలిలో ఏదైనా చేయాలనుకునే... బడ్జెట్‌బ్రీఫ్‌కేసు స్థానంలో ఈ ఎర్రని వస్త్రం బ్యాగును ఎంచుకున్నాను. పైగా, దీనిని పట్టుకోవడం చాలా సులువు" అని ఆమె చిరునవ్వుతో విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

### రెండో మహిళగా....

స్వతంత్రభారత దేశ చరిత్రలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండో మహిళగా నిర్మలాసీతారామన్ (59) ప్రత్యేకత సాధించారు. కాగా, 1970-71 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి మహిళగా ఇందిరాగాంధీ చరిత్రలో నిలిచిపోయారు. నాడు ఆర్థిక మంత్రిగా ఉన్న మొరార్జీదేశాయ్ రాజీనామా చేయడంతో ఇందిర ఆ బాధ్యతను ఏడాది పాటు నిర్వహించారు.

### అనర్గళం...ఆద్యంతం ఆసక్తికరం...

నిర్మలా సీతారామన్ ఏకంగా 2 గంటల 17 నిముషాల పాటు గుక్కతిప్పుకోకుండా బడ్జెట్ ప్రసంగాన్ని కొనసాగించారు. ఉర్దూ కవి మంజూర్ హష్మీ ద్విపదతో ఆమె ప్రసంగాన్ని ప్రారంభించారు. మధ్యమధ్యలో సంస్కృత, ఉర్దూ, హిందీ, తమిళ భాషల్లో కవితలను ప్రస్తావిస్తూ ఆమె ఆంగ్లంలో చేసిన ప్రసంగం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కనీసం ఒక్క చుక్క మంచినీరు కూడా తాగకుండా ఆమె తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆమె బడ్జెట్ ప్రతిపాదనల పట్ల హర్షం వెలిబుచ్చుతూ అధికార పక్ష సభ్యులు పదేపదే బల్లలపై చరచడం కనిపించింది. ప్రధాని మోదీ కూడా పలుమార్లు తన ప్రశంసను వెలిబుచ్చుతూ బల్లపై చరిచారు.

### అమ్మా...నాన్నా...అమ్మాయి..

బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నిర్మలాసీతారామన్ లోక్‌సభలోకి అడుగిడి తన స్థానంలో కూర్చోబోతుండగా పలువురు మహిళా ఎంపీలు వచ్చి ఆమెకు 'గుడ్‌లక్' అంటూ చెప్పడం కనిపించింది. ఆ తర్వాత ఆమె తన స్థానంలో ఆసీనులై మైక్‌ను సరిచేసుకున్నారు. గ్యాలరీలో కూర్చున్న అమ్మ సావిత్రి, నాన్న నారాయణన్ సీతారామన్, కుమార్తె వాంగ్మయి పరకాలను పలకరింపుగా చూశారు. మధ్యమధ్యలో కూడా ఆమె ఎదురుగా ఉన్న గ్యాలరీలో ఉన్న తల్లిదండ్రుల వైపు చూశారు.

### రాహుల్ ఫోన్...సోనియా పర్స్..

నిర్మలాసీతారామన్ ప్రసంగాన్ని ప్రారంభించిన రెండు నిముషాల తర్వాత కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ సభలోకి వచ్చారు. ఆ తర్వాత కూడా ఆయన పలుమార్లు పదేపదే తన ఫోన్‌లోకి చూసుకుంటుండటంతోనే సరిపోయింది. సోనియాగాంధీ తన పర్సును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత రాహుల్ వచ్చి తల్లి పర్సును తీసుకుని వెళ్లారు.

# 5 ఏళ్లు... 7 బడ్జెట్లు

## ఇదీ మోదీ సర్కారు ప్రస్థానం

మోదీ సారథ్యంలోని ఎన్డీయే సర్కారుకు వరసగా ఇది 7వ బడ్జెట్. 2014, 2015, 2016, 2017, 2018లలో పూర్తిస్థాయి బడ్జెట్లు సమర్పించగా సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గత ఫిబ్రవరిలో ఓటాన్ అక్కౌంటు, తాజా ఘనవిజయం తర్వాత ఇప్పుడు పూర్తిస్థాయి పద్దు పెట్టారు. ఈ బడ్జెట్ల పోకడ ఎలా ఉందంటే..

**2014 — ఉన్నంతలో ఊరట**

ఎన్డీయే సర్కారు తొలి బడ్జెట్. వృద్ధిరేటు లక్ష్యాలు, ఆర్థిక స్థిరీకరణ వంటి అంశాలు ప్రతిబంధకంగా ఉన్నా.. ఉన్నంతలో రైతులు, ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాలకు మేలుచేసే ప్రతిపాదనలు చేశారు. అంతా ఆశించినా ఆదాయ పన్ను ఊరటేం లేదు.

**2015 — 'నగదు రహిత' అడుగులు**

ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. సేవల పన్ను పెంపు కఠిన నిర్ణయం తీసుకున్నారు. నగదు రహితం దిశగా అడుగులు పడ్డాయి. భారత్‌లో తయారీ, డిజిటల్ భారత్, స్వచ్ఛభారత్‌లకు అగ్రతాంబూలం ఇచ్చారు.

**2016 — సాగు, సంక్షేమాలకు జై**

ప్రధానంగా అన్నదాతలకు సాంత్వన కల్పించేలా గ్రామీణ భారతానికి రూ.1.77 లక్షల కోట్లు, రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యంతో వ్యవసాయ రంగానికి రూ.35,984 కోట్లు కేటాయించారు. సంక్షేమానికీ పెద్దపీట వేశారు.

**2017 — సంప్రదాయానికి చెల్లుచీటీ**

పెద్దనోట్ల రద్దుపై విమర్శల దృష్టితో రైతులు, గ్రామీణులు, యువత సంక్షేమంపై దృష్టి పెట్టారు. ఆరోగ్యం, ప్రజా సేవలకు పెద్దపీట వేశారు. బడ్జెట్‌ను ఫిబ్రవరి నెలాఖరులో కాకుండా ఆ నెల 1న ప్రవేశపెట్టటం, రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్లో కలపటం.. ఈ యేటి ప్రత్యేకతలు.

**2018 — గ్రామీణానికి హారతి**

దేశంలో 10 కోట్ల పేద కుటుంబాలకు ఏటా రూ.5 లక్షలు చొప్పున ఆరోగ్య బీమాను వర్తింపజేయడం ఈ బడ్జెట్ ప్రత్యేకత. మ్యూచువల్ ఫండ్లు సహా మార్కెట్లో మదుపరుల లాభాలపైనా పన్ను విధించారు. మొత్తమ్మీద గ్రామీణానికి ప్రాధాన్యం ఇచ్చారు.

**2019 (తాత్కాలిక) — వరాల వాన**

ఓట్-ఆన్-అకౌంట్ అయినా అన్ని వర్గాలకూ వరాలు కురిపించారు. కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్ పథకాలకు శ్రీకారం. ఏటా చిన్న రైతులకు రూ.6,000, అసంఘటిత కార్మికులకు రూ. 3,000, రూ.5 లక్షల లోపు ఆదాయంపై పన్ను మినహాయింపు వంటివి ప్రకటించారు.

**2019 (పూర్తిస్థాయి) — భారీ ఆర్థిక వ్యవస్థ దిశగా**

పద్దుల లెక్కల కంటే రూ.350 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను సాధించే దిశగా ఓ సమగ్ర ప్రణాళిక రచించేందుకు ప్రాధాన్యం లభించింది. మౌలిక సదుపాయాలు, విదేశీ పెట్టుబడులకు పెద్దపీట వేశారు. కుబేరులపై సర్‌ఛార్జి పడింది. గృహ నిర్మాణానికి ఊతమిచ్చే చర్యల్ని ప్రకటించారు.

# నవ్యపథం నిర్మల రథం!

కేంద్ర బడ్జెట్ 2019-20

యకీన్ హో తో కోయీ రాస్తా నికల్‌తా హై, హవా కీ ఓట్ భీ లేకర్ చరాగ్ జల్‌తా హై" అన్నది ఓ ఉర్దూ కవితాపాదం. నమ్మకం ఉంటే ఏదో ఒక మార్గం తప్పక దొరుకుతుంది. గాలితో కూడా నిప్పు రాజుకుంటుంది. దేశ వృద్ధిపై మాకా నమ్మకం ఉంది!



## నవ శకానికి... దశాంశాల దార్శనికత!

కొత్త దశకానికి నాంది పలుకుదామంటూ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్... పది అంశాలతో కూడిన ప్రభుత్వ దార్శనికతను వివరించారు. 2014లో ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చినప్పుడు 1.85 కోట్ల డాలర్ల మేర ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ... ఐదేళ్లలో 2.7 కోట్ల డాలర్లకు చేరిందని, మరో ఐదేళ్లలో 5 కోట్ల డాలర్లకు చేరుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి వెల్లడించిన దశాంశాలివీ...

1. భౌతికపరమైన మౌలిక వసతులతో పాటు సామాజిక పరమైన సౌలభ్యాల కల్పన.
2. ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగానికి 'డిజిటల్ ఇండియా' ఫలాల చేరవేత
3. పచ్చదనం పరచుకున్న మాతృభూమి, నీలాకాశంతో కూడిన స్వచ్ఛమైన, కాలుష్యరహిత భారత్ ఆవిష్కరణ
4. 'భారత్‌లో తయారీ' ద్వారా అంకుర, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఇతోధిక ప్రోత్సాహం. రక్షణ తయారీ, ఆటో మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, వైద్య పరికరాల తయారీకి బాసట
5. నీటి నిర్వహణకు ప్రాధాన్యం. స్వచ్ఛమైన తాగు నీటి సరఫరా. నదుల శుద్ధీకరణ
6. సముద్ర ఆధార 'బ్లూ ఎకానమీ'కి ప్రోత్సాహం. జల రవాణా, జలాధార పర్యాటకం, ఆయిల్-గ్యాస్ రంగాల అభివృద్ధికి కృషి
7. జ్ఞాన్‌యాన్, చంద్రయాన్, ఉపగ్రహ కార్యక్రమాల ద్వారా అంతరిక్ష ప్రయోగాలకు పెద్దపీట
8. ఆహారపదార్థాలు, నూనెలు, దినుసులు, పండ్లు, కూరగాయల ఉత్పత్తికి భారీ ప్రోత్సాహం. సొంత అవసరాలకే కాకుండా, విదేశాలకూ వాటిని ఎగుమతి చేసేలా చేయూత
9. 'ఆయుష్మాన్ భారత్' ద్వారా ఆరోగ్యకర సమాజ నిర్మాణం. మహిళలు, చిన్నారులకు పోషకాహారం అందజేత. పౌరులందరికీ భద్రత
10. దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి పెద్దపీట. కనిష్ఠ ప్రభుత్వంతో గరిష్ఠ పాలన.

## 1.17 లక్షల కోట్లు పల్లె సీమలకు

దిల్లీ: గ్రామ స్వరాజ్యాన్ని ఆకాంక్షించిన మహాత్మా గాంధీ 150వ జయంత్యుత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆయన ఆశయాలను స్మరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తొలి బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి భారీగా నిధులు ప్రతిపాదించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1.17లక్షల కోట్లను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గత బడ్జెట్ కన్నా ఇది 4.4శాతం మేర అధికం. 2018-19 ఈ శాఖకు కేటాయించినది రూ.1.12లక్షల కోట్లు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన, జాతీయ జీవనోపాధి కార్యక్రమానికి కూడా నిధులు పెరిగాయి. అయితే, మహాత్మాగాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ దఫా రూ.1084 కోట్ల మేర, ప్రధాన మంత్రి ఆవాస యోజన(గ్రామీణ)కు రూ.900 కోట్ల మేర నిధులకు కోత పడింది. రెండో దశలో భాగంగా రానున్న రెండేళ్లలో 1.95 కోట్ల ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ గత బడ్జెట్ కన్నా నిధుల కేటాయింపు తగ్గింది.

# ఉద్యోగి నిట్టూర్పు

- ఆదాయపు పన్ను శ్లాబులు యథాతథం
- రూ.45 లక్షల్లోపు గృహరుణాల వడ్డీపై పన్ను మినహాయింపు పరిమితి రూ.3.5 లక్షలకు పెంపు



జి.సాంబశివరావు
ప్రత్యక్ష పన్నుల నిపుణులు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తొలి బడ్జెట్‌లో సగటు వేతన జీవికి పెద్దగా ఊరట కల్పించలేదు. ఆదాయపు పన్ను మినహాయింపులకు సంబంధించి గతంలో ఉన్న శ్లాబులనే కొనసాగించారు. సంపన్నులపై సర్‌ఛార్జీ పెంచారు. అందుబాటు ధరలో ఇల్లు కొన్నవారికి అదనంగా రూ.1,50,000 మినహాయింపు కల్పించారు.

### వ్యక్తిగత పన్నుకు సంబంధించిన కీలక అంశాలు

ప్రస్తుతం అమల్లో ఉన్న ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం వర్తించే ఆదాయ పరిమితి, శ్లాబులకు కొత్త బడ్జెట్‌లో మార్పులేవీ ప్రతిపాదించలేదు. మధ్యంతర బడ్జెట్‌లో చెప్పినట్లుగా పన్ను వర్తించే ఆదాయం రూ.5,00,000 లోపు ఉన్నప్పుడు గరిష్ఠంగా రూ.12,500 వరకు పన్ను రిబేటు లభించడం ద్వారా ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఈ పద్ధతినే కొనసాగించనున్నారు. వార్షిక పన్ను వర్తించే ఆదాయం రూ.5,00,000 గణించేప్పుడు ప్రామాణిక తగ్గింపు రూ.50,000, సెక్షన్ 80సీ కింద రూ.1,50,000, గృహరుణ వడ్డీలాంటి ఇతర మినహాయింపులను తీసేస్తారు. పన్ను వర్తించే ఆదాయం రూ.5లక్షలు దాటితే.. వర్తించే శ్లాబుల ఆధారంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

### రూ.45 లక్షలలోపు ఇంటిని కొనుగోలు చేస్తే..

స్థిరాస్తి రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఒక ప్రత్యేక మినహాయింపు సెక్షన్‌ను తీసుకొచ్చారు. రూ.45 లక్షలలోపు ఇంటిని కొనుగోలు చేసిన వారికి సెక్షన్ 80ఈఈఏ కింద గృహరుణం వడ్డీపై అదనంగా రూ.1,50,000 పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇప్పటి వరకు గృహరుణాలపై వడ్డీ మినహాయింపు పరిమితి రూ.2 లక్షలుగా ఉంది. తాజా మినహాయింపుతో ఆ పరిమితి రూ. 3.5 లక్షలకు పెరుగుతుంది. ఏప్రిల్ 1, 2019 - మార్చి 31, 2020 మధ్య తీసుకున్న గృహరుణాలకే ఇది వర్తిస్తుంది. ఇంటి రుణం పొందేనాటికి మరో సొంతిల్లు ఉంటే.. ఈ మినహాయింపు పొందలేరు.

### మరికొన్ని ముఖ్యాంశాలు

- ప్రస్తుతం అమల్లో ఉన్న సెక్షన్ 111ఏ ప్రకారం.. షేర్లలో మదుపు చేసి వాటిని స్వల్పకాలంలో విక్రయించినప్పుడు 15 శాతం పన్ను చెల్లించాలి. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లకూ ఈ వెసులుబాటు వర్తించేలా తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇప్పటివరకు స్వల్పకాలంలో విక్రయించిన ఈక్విటీ ఫండ్లపై వచ్చిన రాబడిని మొత్తం ఆదాయంలో కలిపి చూపించాల్సి వచ్చేది.
- ప్రస్తుత నిబంధనల ప్రకారం ఆస్తి విలువ రూ.50 లక్షలు దాటినప్పుడు కొనుగోలు మొత్తంపై 1% మూలం వద్ద పన్ను విధించాలి. ఈ విలువను గణించేప్పుడు క్లబ్ మెంబర్‌షిప్ ఫీజు, కారు పార్కింగ్, విద్యుత్, నీటి వసతి తదితర సౌకర్యాలకు చెల్లించే మొత్తాలన్నింటినీ కలిపి చూపించాల్సి ఉంటుంది.

**అధిక ఆదాయం పొందేవారు చెల్లించే పన్నుపై సర్‌ఛార్జీ పెంపు**

| ఆదాయం | ప్రస్తుత శ్లాబు | ప్రతిపాదితం |
|---|---|---|
| రూ.50 లక్షలు-రూ.కోటి లోపు | 10% | 10% |
| రూ.కోటి-రూ.2 కోట్ల వరకు | 15% | 15% |
| రూ.2 కోట్లు-రూ.5 కోట్ల వరకు | 15% | 25% |
| రూ.5 కోట్లు- ఆ పైన | 15% | 37% |

**2019-20 ఆర్థిక సంవత్సరానికి వర్తించే పన్ను శ్లాబులు (వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు)**

60 ఏళ్ల లోపు వారందరికీ

| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| రూ. 2,50,000 | లేదు |
| రూ. 2,50,001-5,00,000 | 5% |
| రూ. 5,00,001-10,00,000 | 20% |
| రూ. 10,00,001- ఆపైన | 30% |

60-80 ఏళ్ల మధ్య వయసు వారందరికీ

| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| రూ. 3,00,000 | లేదు |
| రూ. 3,00,001-5,00,000 | 5% |
| రూ. 5,00,001-10,00,000 | 20% |
| రూ. 10,00,001- ఆపైన | 30% |

80 ఏళ్ల పైబడిన వారికి

| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| రూ. 5,00,000 | లేదు |
| రూ. 5,00,001-10,00,000 | 20% |
| రూ. 10,00,001- ఆపైన | 30% |

# జల భద్రత!



- 2024 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి నీరు
- జలశక్తి శాఖకు రూ.28,261 కోట్లు కేటాయింపు

దిల్లీ: భారతీయులందరికీ జల భద్రతను కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సురక్షిత, సరిపడినంత తాగునీటి లభ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. ఈ మేరకు తాజా బడ్జెట్‌లోనూ ప్రత్యేక దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా సుస్థిర నీటి సరఫరా నిర్వహణ లక్ష్యాల సాధన కోసం జలజీవన్ మిషన్ కింద రాష్ట్రాలతో కలిసి 2024 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ఇళ్లకీ కుళాయి నీటిని (హర్ ఘర్ జల్) అందించే దిశగా కృషి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం కోసం జలశక్తి మంత్రిత్వ శాఖకు 2019-20 బడ్జెట్‌లో రూ.28,261.59 కోట్లు కేటాయించారు. తాగునీరు, పారిశుద్ధ్యం విభాగం.. నీటి నిర్వహణలో స్థానిక స్థాయిలో డిమాండ్, సప్లయిలపై దృష్టిపెడుతుంది. వాన నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జి, గృహాల్లోని వ్యర్థ జలాల్ని వ్యవసాయానికి తిరిగి ఉపయోగించుకోడం వంటి వంటి స్థానిక మౌలిక సదుపాయల కల్పనపై దృష్టి సారిస్తుంది.

| కేటాయింపులిలా | 2019-20 | 2018-19 |
|---|---|---|
| | | (రూ.కోట్లలో) |
| తాగునీరు, పారిశుద్ధ్యం విభాగం | 20,016.34 | 19,992.97 |
| జాతీయ గ్రామీణ తాగునీటి మిషన్ | 9,150 | 5,391.32 |
| జల వనరులు, గంగా పునరుజ్జీవనం | 8,245.25 | 7,269.25 |
| జాతీయ నదీ సంరక్షణ ప్రణాళిక | 1,220 | 1,620 |

**బడ్జెట్ 2019-20 కేంద్రం ఎలా ఖర్చు చేయనుందంటే..** (రూ.కోట్లలో)

| పద్దు | | పద్దు | |
|---|---|---|---|
| పింఛన్లు | 1,74,300 | వడ్డీ చెల్లింపులు | 6,60,470 |
| రక్షణ | 3,05,296 | ఐటీ, టెలికం | 21,783 |
| ప్రధాన రాయితీలు | 3,01,694 | ప్రణాళిక, గణాంకాలు | 5,814 |
| వ్యవసాయం, అనుబంధ రంగాలు | 1,51,518 | గ్రామీణాభివృద్ధి | 1,40,762 |
| వాణిజ్యం, పరిశ్రమలు | 27,043 | సాంకేతిక విభాగాలు | 27,431 |
| ఈశాన్య ప్రాంత అభివృద్ధి | 3,000 | సాంఘిక సంక్షేమం | 50,850 |
| విద్య | 94,854 | పన్ను పరిపాలన | 1,17,285 |
| ఇంధనం | 44,638 | రాష్ట్రాలకు బదిలీలు | 1,55,447 |
| విదేశీ వ్యవహారాలు | 17,885 | రవాణా | 1,57,437 |
| ఆర్థికం | 20,121 | కేంద్రపాలిత ప్రాంతాలు | 15,098 |
| ఆరోగ్యం | 64,999 | పట్టణాభివృద్ధి | 48,032 |
| హోం వ్యవహారాలు | 1,03,927 | ఇతరాలు | 76,665 |
| | | మొత్తం | 27,86,349 |

# ఇంటి కబురు చల్లగా..



గృహ నిర్మాణం, ఇళ్ల అద్దె వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం మరింతగా దృష్టి సారించింది. అద్దె చట్టాల్లో మార్పులకు తోడు, భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలకు ఊతమివ్వాలని సంకల్పించింది. దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న అద్దె చట్టాలకు కాలం చెల్లిందని, అద్దెకు ఇచ్చిన, తీసుకున్న వ్యక్తుల మధ్య సంబంధాలపై ఆయా చట్టాల్లో స్పష్టత లేదని కేంద్రం భావిస్తోంది. ఇలాంటి సమస్యల్ని సరిచేస్తూ త్వరలో నమూనా అద్దె చట్టాన్ని తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం 1948 నాటి అద్దె నియంత్రణ చట్టం అమల్లో ఉంది. దీని స్థానంలో కొత్త అద్దె చట్టం రానుంది. యజమానులు, అద్దెకు తీసుకునే

### అద్దె ఒప్పందాల రిజిస్ట్రేషన్.. ట్రైబ్యునల్ ఏర్పాటు

వారి బాధ్యతలు, హక్కులను స్పష్టంగా నిర్వచించటం, అద్దె ఒప్పందాలను రిజిస్టర్ చేయటం, వివాదాల పరిష్కారానికి 'రెంట్ ట్రైబ్యునళ్ల'ను నెలకొల్పడం.. వంటి పలు నిబంధనలు ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. అద్దె ఇళ్ల విభాగంలో వృద్ధిని సాధించే లక్ష్యంతో ఈ తరహా సంస్కరణలు అమలు చేయనున్నారు. 'జాతీయ పట్టణ అద్దె ఇళ్ల విధానం'లో నగర/ పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్ల కొరతను నివారించే ప్రతిపాదనలుంటాయని గృహ, పట్టణ వ్యవహారాల శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఇళ్లు అద్దెకు ఇచ్చేందుకు యజమానులు చొరవగా ముందుకు వచ్చేందుకు వీలుకల్పించే నిబంధనలతో దీన్ని రూపొందిస్తారు. నమూనా అద్దె చట్టం అంశాన్ని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. దీన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతామని పేర్కొన్నారు.

### పట్టణ, గృహ వ్యవహారాల శాఖకు భారీగా నిధులు



పట్టణ, గృహ వ్యవహారాల శాఖకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభించింది. ఈ శాఖకు రూ.48 వేల కోట్లు కేటాయించారు. గతంతో పోలిస్తే 17% అధికంగా నిధులిచ్చారు. ఇందులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ) కింద ఇళ్ల నిర్మాణాల కోసం రూ.6,853 కోట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వచ్చే రెండేళ్లలో 1.95 కోట్ల ఇళ్లను నిర్మించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా, మురికి కాలవల నిర్మాణం తదితర సదుపాయాల కల్పన కోసం ఉద్దేశించిన 'అమృత్' పథకం అమలు కోసం రూ.7,300 కోట్లు ఇవ్వనున్నారు. 100 ఆకర్షణీయ నగరాల (స్మార్ట్‌సిటీ) అభివృద్ధి కోసం రూ.6,450 కోట్లు వెచ్చించనున్నారు.

## గూడు కట్టిన సంకల్పం

2022 నాటికి ప్రతి కుటుంబం సొంత ఇల్లు కలిగి ఉండాలన్న లక్ష్యంతో మోదీ ప్రభుత్వం 2015లో ప్రధానమంత్రి ఆవాస్ యోజనను (పట్టణ/ గ్రామీణ) ప్రారంభించింది. సొంతగా నిర్మించుకున్నా, రాష్ట్రాలు కట్టించి ఇచ్చినా.. ఇలా ప్రజలకు ఏదో రూపంలో గృహ వసతి దక్కేలా ప్రోత్సాహాన్ని అందించటం ఈ పథకం ఉద్దేశం. ప్రాథమికంగా ఈ పథకాల్లో కేంద్రం 75%, రాష్ట్రం 25% భరించాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు.. వాటి సొంత పథకాలతో కలిపి దీన్ని వేర్వేరు విధానాల్లో అమలు చేస్తున్నాయి.

**గ్రామాల్లో**

పీఎంఏవై (గ్రామీణ్)లో పేదలు సొంతంగా నిర్మించుకునే ఇంటికి కేంద్ర ప్రభుత్వం రూ.72 వేలు ఇస్తుంది. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం వల్ల ఈ సాయం రూ.1.30 లక్షల వరకూ అందుతుంది.

**పట్టణాల్లో**

పీఎంఏవై (అర్బన్)లో నాలుగు విభాగాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ పథకాల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం తనవంతుగా రూ.1.50 లక్షల సాయం అందిస్తుంది.

**లక్ష్యం**
గ్రామీణ ప్రాంతాల్లో 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి సహకారం
2016-17 నుంచి సహాయం మంజూరైన ఇళ్లు 1,01,19,765
ఇప్పటికి పూర్తి అయినవి 92.64 లక్షలు
వ్యయం 1.08 లక్షల కోట్లు

**లక్ష్యం**
పట్టణ ప్రాంతాల్లో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం
2016-17 నుంచి మంజూరు చేసిన ఇళ్లు 83.63 లక్షలు
నిర్మాణాలు పూర్తయినవి 26.08 లక్షలు
కేంద్ర సాయం రూ. 51,414 కోట్లు

Eenadu epaper

# నవ్యపథం నిర్మల రథం!

కేంద్ర బడ్జెట్ 2019–20

భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని మహాత్మా గాంధీ ఎన్నడో చెప్పారు. ఇది బాపూజీ 150వ జయంతి సంవత్సరం. అందుకే 'గావ్, గరీబ్ ఔర్ కిసాన్'.. గ్రామాలు, పేదలు, రైతులే ప్రాధాన్యంగా స్వీకరించాం. 'అంత్యోదయ'మే మా లక్ష్యం!




## కేటాయింపులు

(రూ.కోట్లలో)

| | |
|---|---|
| ప్రధానమంత్రి మాతృ వందన యోజన | 2,500 |
| బాలల సమగ్రాభివృద్ధికి | 1,500 |
| మహిళా శక్తి కేంద్రాలకు | 150 |
| వసతిగృహ యువతుల భద్రతకు | 50 |
| ఉద్యోగినుల.. | 165 |
| వితంతువుల సంక్షేమానికి | 15 |
| సాధారణ మహిళల రక్షణ, అభ్యున్నతికి | 1,315 |
| మహిళల పోషకాహారం, సామాజిక భద్రతకు | 4,178 |

# నారీ.. నమోస్తుతే



- మహిళే మహాశక్తిగా కేటాయింపులు
- స్త్రీ, శిశు అభివృద్ధికి రూ.29,164 కోట్లు
- స్వయం సహాయక బృంద సభ్యులకు రూ.5 వేల వరకూ ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం

దిల్లీ

'ఆమె' లేకుంటే అభివృద్ధి ఎక్కడ! మహిళ లేని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అసలు ఊహించగలమా? భారత వికాస చరిత్రలో 'స్త్రీ'ది ఒక మహోన్నత పాత్ర. కానీ... 'మహిళల స్థితిగతులు మెరుగుపడకుండా ప్రపంచ క్షేమాన్ని కాంక్షించలేం. ఒక్క రెక్కతో ఎగరడం ఏ పక్షికీ సాధ్యం కాద'న్న స్వామి వివేకానంద ఉద్బోధ శిరోధార్యమనుకుంది కేంద్ర ప్రభుత్వం. 'మహిళే మహాశక్తి'గా భావించి వారి సర్వతోముఖాభివృద్ధికి తాజా బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. అతివల సంక్షేమం, అభివృద్ధి, భద్రత నిమిత్తం... గతేడాది కంటే 17% అధికంగా స్త్రీ, శిశు అభివృద్ధిశాఖకు రూ.29,000 కోట్లు కేటాయించింది.

### మహిళల అభ్యున్నతికి నిపుణుల కమిటీ

స్త్రీ, పురుషుల వారీగా బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉంటున్నాయన్నది విశ్లేషించేందుకూ, దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే సూచనలిచ్చేందుకూ... విస్తృత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశ వ్యాప్తంగా పది కోట్ల మంది శిశువులు, మహిళలకు పోషకాహారం అందించేలా జాతీయ పోషకాహార సంస్థకు కేంద్రం రూ.3,400 కోట్ల బడ్జెట్ ప్రకటించింది. గర్భిణులు, శిశువులు, బాలింతల సంక్షేమానికి రూ.6000 కోట్లు; అంగన్‌వాడీ సేవలకు రూ.19,834 కోట్లు; ప్రధాన మంత్రికి అత్యంత ఇష్టమైన బేటీ బచావో, బేటీ పఢావోకు రూ.280 కేటాయించింది.

### ఎస్‌హెచ్‌జీ సభ్యురాలికి రూ.లక్ష రుణం

మహిళలను ప్రోత్సహించి, వారి కేంద్రంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నది కేంద్రం యోచన. ముద్ర, స్టాండప్ ఇండియా, స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా వారికి మరింత తోడ్పాటునిస్తామని బడ్జెట్‌లో భరోసానిచ్చింది. ఎస్‌జీహెచ్ సభ్యులు తమ జన్‌ధన్ ఖాతాల నుంచి రూ.5 వేల వరకూ ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకునే సదుపాయం కల్పించింది. బృందంలోని ఓ సభ్యురాలికి రూ.లక్ష వరకూ ముద్రా రుణం ఇవ్వాలని ప్రతిపాదించింది.

## అంతరిక్ష రంగంలో ఆర్థిక ఫలాలు

### ఇస్రో ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక సంస్థ



ఈనాడు డిజిటల్, బెంగళూరు: అంతరిక్ష రంగంలో సాధించిన ప్రగతిని ఆర్థికాభివృద్ధికి ఇరుసుగా మార్చుకోవాలని మనదేశం యోచిస్తోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఉత్పత్తులను అంతర్జాతీయ విపణిలో విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్)' అనే ప్రభుత్వరంగ సంస్థను ఏర్పాటుచేస్తున్నట్లు తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. అంతరిక్ష శాఖకు వాణిజ్య విభాగంగా ఈ సంస్థ పనిచేస్తుంది. ఇస్రో ఉత్పత్తులను అంతర్జాతీయ విపణిలో విక్రయిస్తుంది. వాహక నౌకల ఉత్పత్తి, సాంకేతికతల బదిలీ, అంతరిక్ష ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి వ్యవహారాలను చూసుకుంటుంది. 2030లోగా సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేసుకోవాలన్న ఇస్రో లక్ష్యానికి ఎన్ఎస్ఐఎల్ దోహదపడనుంది. విదేశీ యువతకు ఇస్రో ప్రత్యేక అవగాహన తరగతులు ఏర్పాటుచేయడం, భారతీయ విద్యార్థులు విదేశీ అంతరిక్ష సంస్థలను సందర్శించడం తదితర కార్యక్రమాల్లోనూ ఈ వాణిజ్య విభాగం ఉపయోగపడే అవకాశముంది.

## సైనిక పాటవం

- రక్షణ బడ్జెట్ రూ. 3 లక్షల కోట్లు దాటింది. ఇందులో సైనిక దళాల ఆధునికీకరణకు వెచ్చిస్తున్నది మూడోవంతు.. అంటే **లక్షకోట్లు** మాత్రమే. మిగతాది జీతభత్యాలకే పోతోంది.
- ప్రపంచంలో రక్షణ రంగం మీద ఎక్కువగా ఖర్చుపెడుతున్న 5 దేశాల్లో మనది 4వ స్థానం. ఈ జాబితాలో వరుసగా అమెరికా, చైనా, సౌదీ అరేబియా, భారత్, ఫ్రాన్స్ ఉన్నాయి.
- అయినా మన యుద్ధ సన్నద్ధత అంతంత మాత్రమేనని రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. అత్యవసర కొనుగోళ్లకు కూడా తగినన్ని నిధులు సిద్ధంగా ఉండటం లేదు.

**కొత్తగా కొంటున్న క్షిపణి వ్యవస్థలు**

- నాసామ్స్ –2 (అమెరికా నుంచి) విలువ: రూ.6,000 కోట్లు
- ఎస్–400 (రష్యా నుంచి) విలువ రూ.40,000 కోట్లు
- బరాక్ –8 (ఇజ్రాయెల్ నుంచి) విలువ రూ.29,512 కోట్లు

**యుద్ధ విమానాలు**

రఫేల్ (ఫ్రాన్స్ నుంచి) విలువ: రూ. 58 వేల కోట్లు

**రైఫిళ్లు**

73 వేల సిగ్ సావర్ రైఫిళ్లు (అమెరికా నుంచి) విలువ: రూ. 700 కోట్లు

**దేశంలో ఉన్న రక్షణ సంస్థలు**

- 9 ప్రభుత్వ రంగ సంస్థలు
- 39 ఆర్డినెన్సు ఫ్యాక్టరీలు
- 50 డీఆర్‌డీఓ ప్రయోగశాలలు

**రక్షణలో ప్రైవేటు బాట**

2001 తర్వాత రక్షణలో ప్రైవేటు పెట్టుబడులను అనుమతించారు. 100% ప్రైవేటు భాగస్వామ్యం, అందులో 26% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఉండొచ్చన్నారు. తర్వాత 100% ఎఫ్‌డీఐలను అనుమతించారు.

2017-18లో రక్షణ ఉత్పత్తులు రూ. 64,500 కోట్లు.

ప్రైవేటువాటా రూ. 6000 కోట్లు.

# రక్షణకు అంతంతే

### తాత్కాలిక బడ్జెట్‌లో నిర్దేశించిన మొత్తమే ఇప్పుడు కూడా

గత ప్రభుత్వంలో రక్షణశాఖ మంత్రిగా పనిచేసిన నిర్మలా సీతారామన్.. ఈసారి తన బడ్జెట్‌లో ఆ శాఖకు కేటాయింపులను పెద్దగా పెంచలేదు. ఇంతకుముందు రూ.2.98 లక్షల కోట్లుగా ఉన్న రక్షణ బడ్జెట్‌ను ఈసారి రూ.3.18 లక్షల కోట్లు చేశారు. ఇది గత బడ్జెట్ కంటే 7.93% ఎక్కువ, సవరించిన అంచనాల కంటే 6.87% ఎక్కువ. తాత్కాలిక బడ్జెట్‌లో చేసిన కేటాయింపును యథాతథంగా ఉంచారు. కేటాయించిన రూ. 3.18 లక్షల కోట్లు స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 1.6 శాతం మాత్రమే. ఇది 1962లో చైనాతో యుద్ధం జరిగిన తర్వాతి నుంచి అత్యంత తక్కువ. అయితే, దేశంలో తయారుకాని ఆయుధాలను దిగుమతి చేసుకునేటప్పుడు వాటిపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు ఇవ్వడంతో రాబోయే అయిదేళ్లలో సుమారు రూ.25వేల కోట్లు ఆదా అవుతుందని రక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. కొత్త ఆయుధాల కొనుగోళ్లకు రూ.1,08,248 కోట్లను కేటాయించారు. పెట్టుబడి వ్యయంలో సైన్యానికి రూ.29,447 కోట్లు, నౌకాదళానికి రూ.23,156 కోట్లు, వైమానికదళానికి రూ.39,302 కోట్లు కేటాయించారు. సైనికదళాల ఆధునికీకరణకు ఈ కేటాయింపు సరిపోదని, ఈసారి కేటాయింపులను పెంచుతారని అందరూ ఆశించినా దురదృష్టవశాత్తు అలా చేయలేదని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్‌కు చెందిన లక్ష్మణ్ బెహరా చెప్పారు.

# నైపుణ్య ప్రాప్తిరస్తు

### కృత్రిమమేధ.. ఇతర అంశాలపై దృష్టి

విద్యార్థులను అత్యధిక వేతనాలు వచ్చే ఉద్యోగాలకు అర్హులుగా తీర్చిదిద్దడంపై కేంద్రప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఇందుకుగాను వారికి అత్యున్నత సాంకేతిక నైపుణ్యాలు అందించాలని నిర్ణయించింది. ఈ విషయానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బడ్జెట్‌లోనూ ప్రత్యేకంగా ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు కృత్రిమ మేధ, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), బిగ్ డేటా, 3-డి ముద్రణ, వర్చువల్ రియాలిటీ, రోబోటిక్స్ లాంటి కొత్తతరం నైపుణ్యాలను అందించడానికి కృషి చేయనుంది. 'పనే పరమార్థం' అన్న సూత్రానికి అనుగుణంగా కోటిమంది యువతకు పరిశ్రమకు కావల్సిన నైపుణ్యాలను ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా అందించనుంది. సమీప భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆర్థికవ్యవస్థలన్నీ తీవ్రమైన మానవ వనరుల కొరతను ఎదుర్కోనున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని విదేశాల్లో కూడా మన యువత ఉద్యోగాలు సాధించేలా వారిని సిద్ధం చేసేందుకు వారికి కావల్సిన నైపుణ్యాలతో పాటు భాషాపరమైన శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావిధానంగా భారతీయ ఉన్నతవిద్యను మార్చేందుకు సరికొత్త జాతీయ విద్యావిధానాన్ని ప్రభుత్వం తేనుంది. దీని ప్రకారం పాఠశాల, ఉన్నత విద్యలో పెను మార్పులుంటాయి.

### పరిశోధనలకు పెద్దపీట

దేశంలో పరిశోధనలకు నిధులిచ్చి, సమన్వయం చేసి, ప్రోత్సహించేందుకు జాతీయ పరిశోధన ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్)ను ఏర్పాటుచేయనున్నారు. వివిధ మంత్రిత్వశాఖలు పరిశోధన కోసం ఇచ్చే నిధులన్నింటినీ ఎన్ఆర్ఎఫ్ కలుపుతుంది.

### ప్రముఖ సంస్థలకు రూ. 400 కోట్లు

మన విద్యాసంస్థలు అంతర్జాతీయ స్థాయిని అందుకోడానికి ప్రముఖ విద్యాసంస్థలకు రూ. 400 కోట్లు కేటాయించారు. ఇది గత సంవత్సరం సవరించిన అంచనాల కంటే మూడు రెట్లు ఎక్కువ. 'భారతదేశంలో చదవండి' అనే కార్యక్రమంలో విదేశీ విద్యార్థులను భారతీయ ఉన్నత విద్యాసంస్థలకు తేవడంపై దృష్టిపెడతారు. దేశంలో ఉన్నత విద్యారంగంలో సమగ్ర సంస్కరణలు తెచ్చేందుకు భారతీయ ఉన్నతవిద్యా కమిషన్‌ని ఏర్పాటుచేస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

| విద్యారంగ కేటాయింపులు రూ. కోట్లలో | |
|---|---|
| మొత్తం కేటాయింపు | 94,853.64 |
| గత సంవత్సరం కంటే పెంపు | 13 శాతం |
| ఉన్నత విద్యకు కేటాయింపు | 38317.01 |
| పాఠశాల విద్యకు కేటాయింపు | 56536.63 |
| ఉన్నతవిద్య ఫైనాన్సింగ్ ఏజెన్సీకి | 30,000 |
| విశ్వవిద్యాలయాల గ్రాంట్ల కమిషన్‌కు | 4600.66 |
| ఐఐటీలకు | 6409.95 |
| ఐఐఎంలకు | 445.53 |
| ఐఐఎస్ఈఆర్‌లకు | 899.22 |

## బోధన అరకొరే

దేశంలో విశ్వవిద్యాలయాలు, కళాశాలల సంఖ్య పెరుగుతోందిగానీ బోధనా సిబ్బంది ఖాళీలను మాత్రం భర్తీ చేయడం లేదు. ఫలితంగా అత్యున్నత విద్యాసంస్థలనూ అధ్యాపకుల కొరత వేధిస్తోంది.

**పెరుగుతున్న విద్యాసంస్థలు**

| | |
|---|---|
| యూనివర్సిటీలు | |
| 2010-11 | 621 |
| 2018-19 | 935 |
| కళాశాలలు | |
| 2010-11 | 32974 |
| 2018-19 | 40923 |

**గురువుల్లేని చదువులు!**

ఆచార్య పోస్టుల ఖాళీలు..

- కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో: 5606
- ఐఐటీల్లో: 2802
- ఎన్ఐటీల్లో: 3235

**కళాశాలల సాంద్రత**

18-23 ఏళ్ల వయసున్న ప్రతి లక్షమందికి అందుబాటులో ఉన్న కాలేజీలు:
- సగటు: 28
- గరిష్ఠం: తెలంగాణ -51
- ఏపీ -48
- కనిష్ఠం: బిహార్ -7

**ప్రైవేటే ఎక్కువ**

- దేశంలో 78% కళాశాలలు ప్రైవేటు యాజమాన్యాల చేతిలో ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 82% కళాశాలల్ని ప్రైవేటు యాజమాన్యాలే నిర్వహిస్తున్నాయి.

**దేశంలో ఉన్నత విద్య ఇలా...**

- గ్రామీణ విశ్వవిద్యాలయాలు: 357
- స్వయం ప్రతిపత్తి విద్యా సంస్థలు: 10,247
- పీహెచ్‌డీ కోర్సులున్నవి: 3.6%
- పీజీ కోర్సులు అందిస్తున్నవి: 36.7%
- మహిళా విద్యా సంస్థలు: 11.04%

పరిశోధనల మీద వెచ్చిస్తున్నది తక్కువగా ఉండటం ఒక సమస్య అయితే పరిశోధనల నాణ్యత నాసిగా ఉండటం పెద్ద ఇబ్బంది.

**జీడీపీలో పరిశోధనలకు వెచ్చిస్తున్నదిలా...**

- భారత్: 0.7%
- చైనా: 1.97%
- అమెరికా: 2.84%
- జపాన్: 3.5%
- ద.కొరియా: 4.3%

## 3లక్షల కోట్లు

### రాయితీలకు

2019–20 బడ్జెట్‌లో ఎరువులు, ఇంధనం, ఆహారంపై రాయితీ ఇచ్చేందుకు రూ.3,01,694 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ ఏడాది 13.32శాతం మేర కేటాయింపులు పెరగడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీల్లో ఇంధన రాయితీకే సింహభాగం నిధులు వినియోగిస్తున్నారు. ఎరువులకు ఇచ్చే రాయితీ మొత్తాన్ని బడ్జెట్‌లో పెంచడంపై ఎరువుల శాఖ మంత్రి సదానందగౌడ హర్షం వ్యక్తం చేశారు.

## 1.19 లక్షల కోట్లు

### హోంశాఖకు

బడ్జెట్‌లో కేంద్ర హోంశాఖకు కేటాయింపులు పెరిగాయి. అమిత్‌షా నేతృత్వం వహిస్తున్న ఈ మంత్రిత్వ శాఖకు గత బడ్జెట్‌తో పోలిస్తే 5.17 శాతం నిధులు పెంచి.. రూ.1,19,025 కోట్లు కేటాయించారు. పోలీసు బలగాల ఆధునికీకరణ, పోలీసు శాఖలో, సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా కేటాయింపులు పెంచారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, అసోం రైఫిల్స్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ తదితర కేంద్ర బలగాలన్నింటికీ కలిపి రూ.71,713.9 కోట్లు కేటాయించారు. ఇందులో అత్యధికంగా సీఆర్‌పీఎఫ్‌కు రూ.23,963.66 కోట్లు, బీఎస్ఎఫ్‌కు రూ.19,650 కోట్లు ఇచ్చారు.

## 2,217 కోట్లు

### క్రీడలకు

మధ్యంతర బడ్జెట్‌లో క్రీడలకు చేసిన కేటాయింపులను కేంద్రప్రభుత్వం ఏమాత్రం మార్చలేదు. తన 'ఖేలో ఇండియా' కార్యక్రమంలో అవకాశాలను మరింత పెంచేలా జాతీయ క్రీడావిద్యా బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖకు అంతకుముందు సంవత్సరం కంటే రూ.214.2 కోట్లు అధికంగా.. రూ.2216.92 కోట్లు కేటాయించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు రూ.55 కోట్లు పెంచి రూ.450 కోట్లుగా చేశారు. ఖేలో ఇండియా కార్యక్రమానికి మధ్యంతర బడ్జెట్‌లో రూ.50.31 కోట్లు పెంచి రూ.601 కోట్లు ఇచ్చారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు మాత్రం 13 లక్షలు తగ్గించి రూ.245 కోట్లను కేటాయించారు. క్రీడాకారుల ప్రోత్సాహానికి, అవార్డులకు ఇచ్చే మొత్తాన్ని రూ.94.07 కోట్లు పెంచారు. క్రీడలకు కేటాయింపులను క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతించారు.

## 781 కోట్లు

### సీబీఐకి

కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి రూ.781.01కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కంటే రూ.2.08 కోట్లు ఎక్కువ. ప్రధాన కుంభకోణాలు, అవినీతి అక్రమాలపై విచారిస్తున్న ఈ సంస్థ శిక్షణ కేంద్రాల ఆధునికీకరణ, ఈ గవర్నెన్స్, సాంకేతిక, ఫోరెన్సిక్ సంస్థల స్థాపన తదితరాలకు నిధులు వెచ్చించనున్నారు.

## 101 కోట్లు

### లోక్‌పాల్‌కు

ప్రభుత్వ సంస్థల్లో అవినీతిని నిరోధించడానికి ఏర్పడిన లోక్‌పాల్‌కు రూ.101.29 కోట్లను కేటాయించారు. ఈ ఏడాది మార్చి 23న లోక్‌పాల్ ఛైర్‌పర్సన్‌గా జస్టిస్ పినాకీ చంద్రఘోష్ నియమితులైన విషయం తెలిసిందే. ఎనిమిది మంది సభ్యులు కూడా ప్రమాణం చేశారు. ఖర్చులపై నిఘా ఉంచే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు రూ.35.55 కోట్లు ఇచ్చారు. గతేడాది రూ.34కోట్లు కేటాయించారు.

## 98,67,921 కోట్లు

### భారత సర్కారు అప్పు

దేశీయంగా, విదేశాల్లో కలిపి భారత ప్రభుత్వం బాకీపడిన అప్పు పెరిగింది. 2019-20 చివరి నాటికి ఈ రూ.98,67,921.44 కోట్లుగా అంచనా వేశారు. 2018-19 చివరికి సవరించిన అంచనాల ప్రకారం అప్పు రూ.90,56,725.48 కోట్లుగా తేలింది.

**స్థూలంగా వివరాలు** (రూ.కోట్లలో)

| | 31-3-2019 | 31-03-2020 (అంచనా) |
|---|---|---|
| దేశీయ, ఇతర అప్పులు | 87,97,766.30 | 95,99,652.26 |
| విదేశీ రుణం | 2,58,959.18 | 2,68,269.18 |
| మొత్తం | 90,56,725.48 | 98,67,921.44 |

# నవ్యపథం నిర్మలరథం!

కేంద్ర బడ్జెట్ 2019-20

ఒకసారి స్వామి వివేకానంద 'మహిళల పరిస్థితులు మెరుగు పరచనిదే ప్రపంచ సంక్షేమానికి ఆస్కారమేలేదు.. ఒక రెక్కతోనే ఎగరడం పక్షికి అసాధ్యం' అన్నారు. అందుకే మహిళల భాగస్వామ్యంతో గ్రామీణ ఆర్థికానికి మా ప్రభుత్వం జవజీవాలనిస్తోంది.



# మార్కెట్లు కుదేల్

బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న మదుపర్లకు నిరాశే మిగిలింది. అన్ని సానుకూలంగానే ఉన్నప్పటికీ.. కంపెనీల్లో ప్రమోటర్ల వాటా తగ్గించాలన్న ప్రతిపాదన మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ప్రారంభ ట్రేడింగ్‌లో 40,000 పాయింట్లను దాటి దూకుడుగా కనిపించిన సెన్సెక్స్.. అనంతరం ఒడుదొడుకులు ఎదుర్కొంది. మొత్తంగా చూస్తే.. దాదాపు 600 పాయింట్లు ఊగిసలాడిన సెన్సెక్స్, చివరకు 395 పాయింట్ల నష్టంతో సరిపెట్టుకుంది. బీఎస్ఈలో మదుపర్ల సంపదగా పరిగణించే నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.2.22 లక్షల కోట్లు తగ్గి రూ.151.35 లక్షల కోట్లకు పరిమితమైంది.

### బడ్జెట్‌కు ముందు

సెన్సెక్స్ ఉదయం 39,990.40 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 40,032.41 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభమయ్యే సమయానికి మార్కెట్ స్వల్ప లాభాల్లోనే ట్రేడవుతోంది.

### ప్రసంగ వేళ

పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే సెన్సెక్స్ నష్టాల్లోకి జారుకుంది. కంపెనీల్లో కనీస ప్రజా వాటాను 25% నుంచి 35 శాతానికి పెంపు ప్రతిపాదన పరిశీలనకు ఇదే సరైన సమయమని ఆర్థిక మంత్రి పేర్కొనడమే ఇందుకు నేపథ్యం. అయితే కొనుగోళ్ల మద్దతు లభించడంలో సూచీలు మళ్లీ తేరుకున్నాయి.

### బడ్జెట్ అనంతరం

బడ్జెట్ అనంతరం సూచీలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఒకానొకదశలో 39,441.38 పాయింట్ల వద్ద సెన్సెక్స్ ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయింది. చివరకు నష్టాలు తప్పలేదు. 394.67 పాయింట్ల నష్టంతో 39,513.39 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 135.60 పాయింట్లు కోల్పోయి 39,513.39 దగ్గర స్థిరపడింది.

- పసిడి, ఇతర ఖరీదైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 12.5 శాతానికి పెంచడంతో ఆభరణాల షేర్లు కుదేలయ్యాయి. తంగమాయిల్ జువెలరీ 7.43 శాతం, పీసీ జువెలర్ 4.95 శాతం, టీబీజడ్ 3 శాతం, గోల్‌కుండా డైమండ్స్ 2 శాతం చొప్పున నష్టాలు చవిచూశాయి.
- ప్రభుత్వం రూ.70000 కోట్ల మూలధన సాయం ప్రకటించడంతో కార్పొరేషన్ బ్యాంక్, బీఓబీ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐఓబీ, పీఎన్‌బీ, ఆంధ్రా బ్యాంక్ 5 శాతం వరకు లాభపడ్డాయి. సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు చవిచూశాయి.

### నగదు రహితమే

నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఆర్థిక మంత్రి కొన్ని ప్రతిపాదనలు చేశారు. వార్షిక టర్నోవర్ రూ.50 కోట్లకు మించిన వ్యాపార సంస్థలకు, వాటి వినియోగదారులకూ ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) ఛార్జీలు ఉండవని చెప్పారు. ఈ భారాన్ని ఆర్‌బీఐ, బ్యాంకులు భరిస్తాయని పేర్కొన్నారు. దీనికి వీలుగా ఆదాయపు పన్ను చట్టానికి, పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం 2007కు అవసరమైన సవరణలు చేస్తామని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల దిశగా భీమ్ యూపీఐ, యూపీఐ క్యూఆర్ కోడ్, ఆధార్ పే, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి ఎన్నో సదుపాయాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

### బ్యాంకులకు 70వేల కోట్లు

ప్రభుత్వ రంగ బ్యాంకులను మరింత బలోపేతం చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నట్లు నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఇందుకు రూ.70,000 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీనివల్ల రుణ లభ్యత పెరుగుతుందన్నారు. బ్యాంకుల్లో మొండి బాకీలు తగ్గుతున్నట్లు పేర్కొన్నారు. మొండి బాకీలు రూ.లక్ష కోట్ల మేరకు తగ్గినట్లు వెల్లడించారు. అదే సమయంలో దివాలా చట్టం (ఐబీసీ కోడ్) ద్వారా బ్యాంకులు గత నాలుగేళ్లలో దాదాపు రూ.4లక్షల కోట్ల మొండి బాకీలను వసూలు చేశాయని చెప్పారు. ప్రభుత్వ బ్యాంకుల స్థిరీకరణ చేపట్టినట్లు వెల్లడించారు.

### ఎవరి ఖాతాలో వారే జమ

ఒక వ్యక్తి ఖాతాలో మరో వ్యక్తి డబ్బు జమ చేయడం ఇకపై కుదరకపోవచ్చు. ఇప్పటి వరకూ ఎవరి ఖాతాలో ఎవరైనా బ్యాంకు శాఖకు వెళ్లి... డబ్బు వేసే వీలుంది. దీనివల్ల మోసపూరిత లావాదేవీలు జరుగుతున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోబోతున్నట్లు బడ్జెట్‌లో స్పష్టం చేశారు. ఒకరి ఖాతాలో వేరే వాళ్ల డబ్బును జమ చేయడాన్ని నిరోధించే దిశగా నిబంధనల్లో అవసరమైన మార్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# రూ.కోటికి మించి నగదు తీసుకుంటే 2 శాతం పన్ను

ఆర్థిక వ్యవస్థలో నగదు అవసరాన్ని తగ్గించడంతో పాటు.. డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం ఇచ్చేలా బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు వచ్చాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా బ్యాంకు ఖాతా నుంచి రూ.కోటికి మించి నగదును వెనక్కి తీసుకుంటే.. ఆ మొత్తంపై బ్యాంకు 2శాతం మూలం వద్ద పన్ను కోత విధించాలనే కొత్త నిబంధనల ప్రతిపాదించారు. అంటే.. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.3కోట్లు నగదు బ్యాంకు ఖాతా నుంచి వెనక్కి తీసుకుంటే.. రూ.6లక్షల వరకూ పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నమాట. ఇలా మినహాయించిన పన్నును రిటర్నులలో చూపించుకోవచ్చా, అది తిరిగి వస్తుందా అనే విషయంలో స్పష్టత లేదు. దీనివల్ల ఇకపై బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకోవాలంటే.. ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే.. నల్లధనం చెలామణి కాకుండా.. అడ్డుకట్ట వేసేందుకు ఈ చర్య ఉపకరిస్తుందని బ్యాంకింగ్ వర్గాలు భావిస్తున్నాయి. బ్యాంకింగ్ రంగానికి మరికొన్ని ప్రతిపాదనలను ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రస్తావించారు..

### పింఛను పథకంలో 60% వరకూ పన్ను లేదు

జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా బడ్జెట్‌లో కీలక నిర్ణయం వెలువడింది. ఎన్‌పీఎస్ వ్యవధి తీరిన తర్వాత ఖాతాదారులు వెనక్కి తీసుకునే మొత్తంలో 60శాతం వరకూ పన్ను వర్తించదని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. తద్వారా పింఛనుదారుల చేతుల్లోకి కాస్త అధిక మొత్తం రానుంది. మిగతా 40శాతంతో యాన్యుటీని కొనుగోలు చేయాలి. పన్ను మినహాయింపు వచ్చే ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్‌పీఎస్ టైర్-2 ఖాతాలో పెట్టుబడి పెట్టినా.. సెక్షన్ 80సీ ప్రకారం పన్ను మినహాయింపు పొందవచ్చు. దీంతోపాటు పింఛను నిధికి యాజమాన్యం తరఫున చెల్లించే మొత్తాన్ని 10శాతం నుంచి 14శాతానికి పెంచేందుకు అనుమతిస్తారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తుంది.




### ఏ నిర్ణయం ఏ షేర్లపై

| ప్రతిపాదన | | ప్రభావిత షేర్లు |
|---|---|---|
| ఎంపిక చేసిన విద్యుత్ వాహన విడిభాగాలపై కస్టమ్స్ సుంకం మినహాయింపు | ✗ | మారుతీ సుజుకీ, మహీంద్రా, హిందూ మోటార్స్ |
| వాహన విడిభాగాలు, సింథటిక్ రబ్బర్‌పై కస్టమ్స్ సుంకం పెంపు | ✗ | బాష్, మదర్‌సన్ సుమీ, ఎక్సైడ్ ఇండస్ట్రీస్ |
| పీవీసీ, వినైల్ ఫ్లోరింగ్, టైల్స్‌పై సుంకం పెంపు | ✗ | కజారియా, సెరా శానిటరీవేర్, హెచ్ఎస్ఐఎల్ |
| పుస్తకాల దిగుమతిపై 5శాతం కస్టమ్స్ సుంకం | ✗ | నవనీత్ ఎడ్యుకేషన్, ఎంపీఎస్, రెప్రో ఇండియా |
| ఆప్షన్స్‌లో సెటిల్‌మెంట్, స్ట్రైక్ ప్రైస్‌కే ఎస్‌టీటీ పరిమితం | ✓ | ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, ఏయూ స్మాల్, ఎడెల్‌వైజ్ |
| అందుబాటు గృహ రుణాలకు మరో రూ.1.5 లక్షల వడ్డీపై పన్ను మినహాయింపు | ✓ | హెచ్‌డీఎఫ్‌సీ, ఇండియాబుల్స్ హౌసింగ్, ఎల్ఐసీ హౌసింగ్ |
| పీఎస్‌యూల్లో 51% ప్రభుత్వ వాటా విధానంలో మార్పు | ✓ | ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ |
| వచ్చే అయిదేళ్లలో 100 లక్షల కోట్ల ప్రభుత్వ వ్యయాలు | ✓ | ఎల్ అండ్ టీ, అదానీ పోర్ట్స్, సీమెన్స్ |
| ప్రభుత్వ బ్యాంకులకు రూ.70000 కోట్ల మూలధనం | ✓ | ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ |
| 17 ప్రధాన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి | ✓ | ఇండియన్ హోటల్స్, ఈఐహెచ్, చాలెట్ హోటల్స్ |
| ప్రధానమంత్రి గ్రామ్‌సడక్ యోజన కింద రోడ్ల నవీకరణ | ✓ | బజాజ్ ఆటో, హీరో మోటో, టీవీఎస్ మోటార్ |
| ఎన్‌బీఎఫ్‌సీల నియంత్రణ ఆర్‌బీఐ చేతికి | ✓ | హెచ్‌డీఎఫ్‌సీ, ఇండియాబుల్స్ హౌసింగ్, ఎల్ఐసీ హౌసింగ్ |
| బంగారంపై కస్టమ్స్ సుంకం 10 నుంచి 12.5 శాతానికి | ✗ | టైటన్, పీసీ జువెలర్, గీతాంజలి జెమ్స్ |
| పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంపు | ✗ | హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ |

# కంపెనీల్లో ప్రజలకు మరో 10%

కంపెనీల్లో ప్రజల వద్ద ఉండే కనీస వాటాను 25 శాతం నుంచి 35 శాతానికి పెంచే అంశాన్ని పరిశీలించడానికి ఇదే సరైన సమయమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ప్రభుత్వం సెబీకి లేఖ రాసిందనీ కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో భాగంగా ఆమె అన్నారు. ఆర్‌బీఐ, సెబీలతో పలు మార్లు చర్చించిన అనంతరమే స్టాక్ మార్కెట్ విషయంలో పలు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు.

**ప్రభావం**

- ప్రతిపాదిత 35 శాతం ప్రజల వాటా వల్ల ప్రమోటర్లు రూ.3.87 లక్షల కోట్ల విలువైన వాటాలను విక్రయించాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.
- ముఖ్యంగా టీసీఎస్(రూ.59,600 కోట్లు), విప్రో(రూ.15,000 కోట్లు), డిమార్ట్(రూ.14,000 కోట్లు)ల నుంచి ఎక్కువ విక్రయాలు జరగవచ్చని అంటున్నారు.
- సంస్థాగత మదుపుదార్లు బరిలోకి రావడం వల్ల మార్కెట్ లోతు పెరుగుతుందని.. సరైన ధర లభిస్తుందని.. అదే సమయంలో కార్పొరేట్ పాలన ప్రమాణాలు మెరుగువుతాయని అంటున్నారు.

**తగిన సమయం ఇవ్వాలి..**

తాజా ప్రతిపాదన కారణంగా 'బలవంతపు విక్రయాలు' ఉండరాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరల వద్ద 65 శాతం కంటే అధికంగా ప్రమోటర్ల వాటా ఉన్న 1174 కంపెనీల్లో రూ.3,87,000 కోట్ల విలువైన వాటాలను విక్రయించాల్సి వస్తుంది. సంస్థాగత మదుపర్లకు ఇది మంచి అవకాశమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ నిబంధనను పాటించడానికి తగిన సమయం ఇవ్వాలని.. లేదంటే ప్రమోటర్ల వాటా విక్రయాల వరద మార్కెట్లను ముంచెత్తే అవకాశం ఉందంటున్నారు.




**సామాజిక స్టాక్ ఎక్స్ఛేంజీ**

ఎలక్ట్రానిక్ ఫండ్‌రైజింగ్ ప్లాట్‌ఫాం పేరిట ఒక సామాజిక స్టాక్ ఎక్స్ఛేంజీని ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా సామాజిక కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలను నమోదు చేయించడానికి వీలు కలుగుతుంది.

**మరికొన్ని ప్రతిపాదనలు..**

- విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల(ఎఫ్‌పీఐ)కు కేవైసీ నిబంధనలను సరళీకరించారు.
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెట్ ఫండ్-నాన్ బ్యాంక్ ఫైనాన్స్ కంపెనీలు (ఐడీఎఫ్-ఎన్‌బీఎఫ్‌సీలు)లు జారీ చేసే డెట్ సెక్యూరిటీల్లో ఎఫ్ఐఐలు, ఎఫ్‌పీఐలు పెట్టే పెట్టుబడులను దశల వారీగా దేశీయ మదుపర్లకు బదిలీ చేయడానికి, విక్రయించడానికి సైతం అనుమతినివ్వనున్నారు.
- ప్రభుత్వం జారీ చేసే ట్రెజరీ బిల్లులు, సెక్యూరిటీల్లో రిటైల్ మదుపర్లు పెట్టుబడులు పెట్టేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్‌బీఐ డిపాజిటరీలు, సెబీ డిపాజిటరీల మధ్య అంతర్గత కార్యకలాపాల అవసరం ఉందని.. తద్వారా ట్రెజరీ బిల్లుల బదిలీ సరళంగా జరుగుతుందని ఆర్థిక మంత్రి అభిప్రాయపడుతున్నారు. ఆర్‌బీఐ, సెబీలతో ఈ విషయంలో చర్చలు చేపడుతున్నట్లు కూడా తెలిపారు.
- స్టాక్ మార్కెట్లలో సులువుగా పెట్టుబడులు పెట్టడం కోసం ఎన్ఆర్ఐ పోర్ట్‌ఫోలియో మార్గాన్ని ఎఫ్‌పీఐ మార్గంతో విలీనం చేయనున్నారు.
- తక్కువ కార్పొరేట్ పన్ను అయిన 25 శాతాన్ని పొందడానికి ఉన్న వార్షిక టర్నోవరు పరిమితిని రూ.250 కోట్ల నుంచి రూ.400 కోట్లకు పెంచారు. ఈ ప్రతిపాదన పరిధిలోకి దేశంలోని 99.3% కంపెనీలు వస్తాయి.
- సెక్యూరిటీల లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ)ను సెటిల్‌మెంట్, స్ట్రైక్ ప్రైస్‌ల మధ్య తేడాకు మాత్రమే వర్తింపజేస్తారు. ఇది ట్రేడర్లకు గొప్ప ఊరట అని బ్రోకరేజీ సంస్థలు పేర్కొంటున్నాయి.



### సింగిల్స్‌పైనే ఆర్థిక మంత్రి దృష్టి

ఆర్థిక మంత్రి బౌండరీలు కొట్టడం కంటే సింగిల్స్ పైనే దృష్టి పెట్టారు. రన్‌రేట్ తగ్గకుండా చూసుకున్నారు. దీర్ఘకాలానికి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే ఆకాంక్ష బడ్జెట్‌లో కనిపించింది.

- ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూపు ఛైర్మన్

బడ్జెట్‌లో గిరాకీని పెంచే సామర్థ్యం ఉంది. మౌలిక వసతుల కోసం, అందుబాటు గృహాలకు పెట్టుబడులు పెంచడం, ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణ సామర్థ్యాన్ని పెంచడం, ఎన్‌బీఎఫ్‌సీలపై ప్రధానంగా దృష్టి నిలపడం కనిపించింది.

రజనీశ్ కుమార్, ఎస్‌బీఐ ఛైర్మన్

### ఔషధ రంగానికి ఏదీ ప్రోత్సాహం...?

ఆరోగ్య సేవలు, ఔషధ రంగానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి ప్రోత్సాహం లభించలేదు. ముఖ్యంగా ఔషధ రంగంలో పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించి 'వెయిటెడ్ డిడక్షన్'లో ఎలాంటి మార్పూ చేయలేదు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించి ఉన్నట్లయితే దేశీయంగా ఔషధ రంగంతో పాటు పలు ఇతర రంగాల్లో పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలు అనూహ్యంగా విస్తరించేవి. మరోపక్క స్టార్టప్‌లు, విద్యా రంగానికి కొంత ప్రాధాన్యం కనిపించినట్లు, ఇది మంచి మార్పుగా ఆయన విశ్లేషించారు. మొత్తం మీద బడ్జెట్ బాగానే ఉంది.

సతీష్‌రెడ్డి, ఛైర్మన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్

### సత్వర అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

మౌలిక సదుపాయాల అభివృద్ధి, రోడ్లు, నౌకా మార్గాల విస్తరణ, రైల్వే ఆధునికీకరణ, విమానయాన రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రూ.400 కోట్ల వరకూ వార్షిక ఆదాయాలు ఉన్న వ్యాపార సంస్థలకు 25 శాతం పన్ను రేటు వర్తింపు ఎంతో ముఖ్యమైన నిర్ణయం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ, బిగ్ డేటా, 3డీ ప్రింటింగ్, వర్చువల్ రియాలిటీ, రోబోటిక్స్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఆసక్తిమైన ప్రతిపాదనలు. మొత్తం మీద సత్వర వృద్ధి సాధించాలనే ఉద్దేశాన్ని ఈ బడ్జెట్ చెబుతోంది.

బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సైయెంట్

### స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో వ్యాధుల అదుపు

ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ఈ బడ్జెట్ వేదికగా నిలిచింది. నైపుణ్యాల విస్తరణ, ఉద్యోగాల కల్పనకు పెద్ద పీట వేశారు. ఆరోగ్య సేవలు, జీవ శాస్త్రాలు, బయోటెక్ రంగాల ప్రస్తావన లేదు. కానీ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వైద్య సేవల రంగానికి రూ.61,398 కోట్లు కేటాయించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద 5.6 లక్షల గ్రామాలను బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలను మార్చుతున్నారు. దీనివల్ల ఆహారం, నీటి కల్తీ ద్వారా సోకే వ్యాధులను విస్తరణను కొంతమేరకు అరికట్టినట్లు అవుతుంది.

డాక్టర్ ప్రసన్న దేశ్‌పాండే, డిప్యూటీ ఎండీ, ఇండియన్ ఇమ్యునలాజికల్స్

### 'యువ' నైపుణ్యాలకు పెద్దపీట

కృత్రిమ మేధ, రోబోటిక్స్, బిగ్ డేటా వంటి నూతన తరం సాంకేతిక పరిజ్ఞానాల్లో దేశీయ యువతను నిపుణులుగా తీర్చిదిద్దటానికి సిద్ధపడుతున్నట్లు ఈ బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది ఆహ్వానించదగిన పరిణామం. 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' ను అందిపుచ్చుకోవాలని అంటున్నాం. అది సాధ్యం కావాలంటే, అందరికీ ఉద్యోగాలు, అధిక వేతనాలు రావాలంటే నూతన తరం సాంకేతిక విజ్ఞానాన్ని సమకూర్చుకోవటం, అందులో సిద్ధహస్తులుగా మన యువకులను తీర్చిదిద్దటం అవసరం. అందుకు ఈ బడ్జెట్ దారి చూపిస్తోంది.

డాక్టర్ శంతను పాల్, సీఈఓ, టాలెంట్‌స్ప్రింట్

### దీర్ఘ కాలానికే అధిక ప్రాధాన్యం

దీర్ఘకాలిక దృష్టితో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు అర్థమవుతోంది. 2024 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించే లక్ష్యంతో బడ్జెట్ రూపకల్పన జరిగింది.

- ప్రతాప్‌రెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మన్

సరికొత్త భారత్ నిర్మాణానికి 'సూపర్ రిచ్' వర్గం తమ సహకారం అందించాల్సిన అవసరం ఉంది. ఎక్కువ ఆదాయం ఉన్న వారికి పన్ను రేటును పెంచుతూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకోవడం సమర్థనీయం. ప్రధాని మోదీ చెప్పినట్లు ఎక్కువ సంపాదించే వారు ఎక్కువగా పన్ను చెల్లించి దేశానికి తోడ్పాటు అందించాలి.

ఉదయ్ కోటక్, ఎండీ, కోటక్ బ్యాంక్

# నవ్యపథం నిర్మల రథం!

కేంద్ర బడ్జెట్ 2019–20

పన్ను చెల్లింపుదారులెంత ముఖ్యమో చెప్పేందుకు తమిళ కవి పిసిరండైయార్ విరచిత 'పుర నానూరు' నుంచి ఓ వాక్యం గుర్తు చేస్తా. చిన్న పొలంలో పండిన కొద్దిపాటి ధాన్యం కూడా ఏనుగు ఆకలి తీరుస్తుంది. కానీ ఏనుగే పొలంలో పడి తింటే ఏమవుతుంది?



# బంగారం మరింత భారం

- కస్టమ్స్ సుంకం 10 నుంచి 12.5 శాతానికి
- ప్రతిగ్రాముపై మొత్తం పన్ను 15.5 శాతానికి

ఈనాడు వాణిజ్య విభాగం

**బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచడంతో, విదేశాలతో పోలిస్తే దేశీయంగా కొనుగోలుదార్లు మరింత అధికమొత్తం వెచ్చించాల్సి వస్తుంది. దేశీయ పసిడి అవసరాల్లో 90–95 శాతం వరకు దిగుమతులే తీరుస్తుండటం ఇందుకు కారణం. నాణేలు, బిస్కెట్ల రూపంలో లభించే స్వచ్ఛమైన బంగారం అయినా, ఆభరణాలపైన అయినా అదనపు భారం పడుతుంది.**

- **13 శాతం:** ఇప్పటివరకు బంగారంపై 10 శాతం కస్టమ్స్ సుంకం, 3 శాతం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలవుతున్నాయి. అంటే 13 శాతం పన్ను పడుతోంది.
- **15.5 శాతం:** ఇకపై 12.5 శాతం కస్టమ్స్, 3 శాతం జీఎస్టీ కలిపితే 15.5 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది. అంటే ప్రతిగ్రాము కొనుగోలుపైనా పన్నుల రూపంలోనే 2.5 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుంది. వెండి, ప్లాటినమ్ పరిస్థితీ ఇంతే.

ఏడాదికి 800-900 టన్నుల పసిడిని విదేశాల నుంచి మన దేశం అధికారికంగా దిగుమతి చేసుకుంటోంది. అయితే కస్టమ్స్, జీఎస్టీ భారం వల్ల, దుబాయి వంటి దేశాలతో పోల్చినా, దేశీయంగా పసిడి ధర కిలోకు రూ.4 లక్షల వరకు అధికంగా ఉంటోంది. అందువల్ల దొంగచాటుగా తీసుకురావడం (స్మగ్లింగ్) పెరుగుతోంది. ఇది వ్యాపార సంస్థలకు చేటు చేస్తోంది. కస్టమ్స్ సుంకం తగ్గితేనే, స్మగ్లింగ్ కార్యకలాపాలు అదుపులోకి వస్తాయని పేర్కొంటూ వ్యాపార, బులియన్ సంఘాలు ప్రభుత్వానికి పలు అభ్యర్థనలు సమర్పించాయి. మేలిమి బంగారం ఔన్సు (31.10 గ్రాములు) 1412 డాలర్ల మేర ఉంది. డాలర్ విలువ రూ.68.506గా ఉంది. అందువల్ల ఔన్సు విలువ రూ.96,742 అవుతుంది. అంటే గ్రాము రూ.3110 మాత్రమే. దీనికి 15.5 శాతం పన్ను రూ.482 కలిపితే రూ.3592 అవుతుంది. ఇతర వ్యయాలు గ్రాముకు రూ.10 కలిపి హైదరాబాద్ బులియన్ విపణిలో రూ.3602గా చూపుతున్నారు. ఇదే అనధికారిక విపణిలో గ్రాము రూ.3390కే లభిస్తోందని కొందరు విక్రేతలు చెబుతున్నారు. అంటే మేలిమి బంగారం గ్రాముకు రూ.212 తక్కువకు లభిస్తోంది కనుక, చిన్న వ్యాపారులు, ఆభరణాల తయారీదార్లు, వినియోగదారులు కూడా అటే మొగ్గుచూపుతారనే వాదన వినపడుతోంది. పాత పన్ను రేటు 13 శాతం ప్రకారం అయితే, ఈ ధరకు గ్రాముకు రూ.404 అవుతుంది. అంటే మేలిమి బంగారంపై గ్రాముకు రూ.78 చొప్పున భారం పెరిగిందన్న మాట. 10 గ్రాములకు రూ.780 అదనపు భారం పడుతుంది.

**దేశంలోకి పసిడి దిగుమతులు ఇలా**

| సంవత్సరం | విలువ (బి.డాలర్లలో) | పరిమాణం టన్నుల్లో |
|---|---|---|
| 2018-19 | 32.8 | 982 |
| 2017-18 | 33.7 | 955 |
| 2016-17 | 27.5 | 778 |
| 2015-16 | 31.8 | 968 |



### అనధికారిక విక్రయాలు 30 శాతానికి చేరొచ్చు

దొంగచాటుగా తెచ్చిన బంగారాన్ని 4-5 శాతం తక్కువ ధరకే విక్రయించే వీలున్నందున, వినియోగదారులు అటు ఆకర్షితులవుతారని, ఫలితంగా అనధికారిక విక్రయాలు 30 శాతానికి చేరే ప్రమాదముందని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ దేశీయ మండలి ఛైర్మన్ ఎన్.అనంత పద్మనాభన్ పేర్కొన్నారు.

## ఎక్సైజ్, సేవా పన్ను కేసులకు క్షమాభిక్ష పథకం

వివాదాల పరిష్కార, క్షమాభిక్ష పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. 'సబ్కా విశ్వాస్ లెగసీ డిస్ప్యూట్ రెసొల్యూషన్ స్కీమ్-2019'గా పిలిచే ఈ పథకం వల్ల సేవా, ఎక్సైజ్ సుంకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం లభించనుంది. పన్ను బకాయిని బట్టి 40% నుంచి 70% దాకా ఈ పథకం నుంచి ఊరట పొందే అవకాశం ఉంది. వడ్డీ, అపరాధ రుసుముల నుంచి కూడా ఈ పథకం ద్వారా ఊరట పొందవచ్చు. జీఎస్టీ అమల్లోకి రాకముందు భారీ సంఖ్యలో ఉన్న ఎక్సైజ్, సేవా పన్నులపై కేసులు ఇంకా తేలలేదు. ఈ కేసుల్లో రూ.3.75 లక్షల కోట్లు పైగా చిక్కుకుని ఉన్నాయి. ఈ ఒత్తిడిని తగ్గించి ఆయా వ్యాపారులు ముందుకు వెళ్లడానికి వీలుకల్పించేందుకే ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది.

## వాటా విక్రయ లక్ష్యం రూ.1,05,000 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్ఈ) వాటా విక్రయం ద్వారా రికార్డు స్థాయిలో రూ.1,05,000 కోట్లు సమీకరించాలని బడ్జెట్లో ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ఎయిరిండియా సహా పలు సీపీఎస్ఈల ప్రైవేటీకరణ ప్రక్రియను ప్రారంభించనుంది. అంతేకాకుండా మధ్యంతర బడ్జెట్లో ప్రతిపాదించిన రూ.90,000 కోట్లకు మించి ఇప్పుడు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం గమనార్హం. తాజా వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తన వాటాను 51 శాతం లోపునకు తగ్గించుకోనుంది. పరిమిత వాటాను కలిగి ఉన్నప్పటికీ ఆ సంస్థల నియంత్రణ మాత్రం ప్రభుత్వం చేతిలో ఉంటుంది. తదనుగుణంగా విధానాల్లో మార్పులు చేయనుంది.

## విమానయానంలో భారీ అవకాశాలు



- ఫైనాన్స్, లీజింగ్ వ్యాపారానికి కేంద్రంగా మనదేశం
- ఎంఆర్ఓ కేంద్రాలకు సహకారం

విమాన ప్రయాణికులపై నేరుగా ప్రభావం చూపే అంశాలేమీ బడ్జెట్‌లో లేవు. అయితే విమానయాన రంగానికి ప్రోత్సాహం కలిగించే నిర్ణయాలను మాత్రం ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇవి సాకారం కావాలంటే, వేలకోట్ల రూపాయల పెట్టుబడులు రావాల్సి ఉంది.

**మరిన్ని ఎఫ్‌డీఐలు**

పౌర విమానయాన రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మరింత అధికంగా అనుమతిస్తామని ప్రకటించారు. ఇందువల్ల ఎయిరిండియా ప్రైవేటీకరణ సులభం అవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఎయిరిండియాలో వాటాలను విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తున్న సంగతి విదితమే.

**ఫైనాన్సింగ్, లీజింగ్‌కు మార్గసూచిక**

దేశీయ విమానయాన సంస్థలు 600కు పైగా విమానాలు నిర్వహిస్తున్నాయి. వీటిల్లో అత్యధికం లీజ్‌పై నడుస్తున్నవే. పాతికేళ్లకు పైగా సేవలందించి, ఇటీవలే కార్యకలాపాలు నిలిపేసిన జెట్ ఎయిర్‌వేస్ వద్ద 120 వరకు విమానాలున్నా, వీటిల్లో సొంతవి 12 మాత్రమే. మిగిలినవి అన్నీ లీజ్‌పై తీసుకున్నవే. విమానాల కోసం దేశీయ విమానయాన సంస్థలు విదేశాల్లోని లెస్సర్స్ (లీజింగ్ సంస్థల)పై ఆధారపడుతున్నాయి. ఇందుకోసం డాలర్లలో చెల్లింపులకు తోడు, వారి నిబంధనలకు అనుగుణంగా మెలగాల్సి వస్తోంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద విమానయాన విపణిగా అవతరించిన మన దేశంలో రాబోయే 10-20 ఏళ్లలో విమానయాన రంగం మరింత వృద్ధి చెందే వీలున్నందున, విమానాల లీజ్-ఫైనాన్స్ వ్యాపారానికి మన దేశాన్నే కేంద్రంగా మారిస్తే, దేశీయ సంస్థలకు ప్రయోజనమే కాక, భారీ సంఖ్యలో మెరుగైన ఉద్యోగాలు లభిస్తాయి.

**ఎంఆర్ఓ కేంద్రాలకు సహకారం**

కారు, స్కూటర్‌కు భిన్నంగా.. ప్రతి విమానం ఎన్ని గంటల సేపు గాల్లో విహరిస్తే, దానికనుగుణంగా నిర్వహణ సేవలు చేయాల్సి ఉంటుంది. రోజువారీ, ఏడాది, రెండేళ్లు, మూడేళ్లకు ఒకసారి క్షుణ్నంగా తనిఖీలు చేసి, నిర్వహణ-మరమ్మతులు (ఎంఆర్ఓ) చేయాల్సి ఉంది. ఎయిరిండియాతో పాటు జీఎంఆర్ వంటి సంస్థలు దేశీయంగా ఎంఆర్ఓ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. విమానాలు లీజ్‌కు ఇచ్చేవి విదేశీ సంస్థలు కనుక, ఆయా దేశాల్లో ఎంఆర్ఓ కేంద్రాల్లో కాలావధి నిర్వహణ పనులు చేయిస్తుంటాయి. ఇందుకోసం డాలర్లలో చెల్లింపులు జరపాల్సి రావడం దేశీయ విమానయాన సంస్థలకు భారమవుతోంది. దేశీయంగా మరిన్ని ఎంఆర్ఓ కేంద్రాలు నెలకొల్పితే, రూపాయల్లో చెల్లింపులు జరిపే వీలుంటుంది. విదేశీ మారక ద్రవ్యం ఆదా అవ్వడమే కాక, ఉద్యోగాల కల్పనకూ వీలుంటుంది. ఇందుకోసం సానుకూల విధానాలు ప్రకటిస్తామని ఆర్థిక మంత్రి వెల్లడించారు.

## అంకురాలకో టీవీ ఛానల్

దిల్లీ: అంకురాల కోసం ప్రత్యేకంగా ఓ టీవీ ఛానల్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. అంకురాల వృద్ధికి అవరోధంగా నిలుస్తున్న సమస్యలు, నిధుల అవసరాలు, పన్నుల ప్రణాళిక లాంటి అంశాలను చర్చించేందుకు ఈ ఛానల్ అంకురాలకు ఓ వేదికగా ఉపయోగపడుతుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఛానల్ రూపకల్పన దగ్గర నుంచి నిర్వహణ వరకు అంకురాలే స్వయంగా నిర్వహిస్తాయని అన్నారు. దూరదర్శన్ ఛానళ్లలో భాగంగానే ఇది ఉంటుందని వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రత్యేకంగా ఛానల్ ఉండటం వల్ల అంకురాల ఏర్పాటు, అభివృద్ధికి ఉన్న అవకాశాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చిన్న తరహా వ్యాపారులు ముఖ్యంగా చిన్న చిన్న పట్టణాల్లో కొత్తగా వ్యాపారాలు ఆరంభించే వారిని ప్రోత్సహించేందుకు ఛానల్ ఉపయోగపడుతుందని అన్నారు.

**ఏంజెల్ ట్యాక్స్ కష్టాలు దూరం**

ఏంజెల్ ట్యాక్స్ కేసుల విషయంలో అంకుర సంస్థలు (స్టార్టప్) ఎదుర్కొంటున్న కష్టాలను దూరం చేసేందుకు ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. డిక్లరేషన్ దాఖలు చేయడంతో పాటు రిటర్న్‌ల్లో పూర్తి సమాచారాన్ని అందించిన వారికి ఎలాంటి నిశిత పరిశీలన (స్క్రూటినీ) ఉండబోదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇవే కాకుండా పలు ప్రోత్సాహకాలనూ ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో అంకుర వ్యవస్థ బలంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ వృద్ధి ఇలాగే కొనసాగాలంటే అంకురాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బడ్జెట్ ప్రసంగంలో సీతారామన్ అభిప్రాయపడ్డారు. ఏంజెల్ ట్యాక్స్‌కు సంబంధించి పెట్టుబడులు పెట్టిన సంస్థ/ వ్యక్తి ఎవరో, ఎక్కడి నుంచి నిధులు సమీకరించారో తెలుసుకోవడానికి ఇ-వెరిఫికేషన్ విధానాన్ని అందుబాటులోకి తేనుంది. దీని వల్ల నిధులు సమీకరించిన అంకుర సంస్థలకు ఆదాయపు పన్ను విభాగం నుంచి ఏ తరహా స్క్రూటినీ ఎదుర్కొనవసరం లేదు. అంకుర సంస్థలకు సంబంధించి పెండింగ్ అసెస్‌మెంట్ కేసుల పరిష్కారానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వద్ద ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ తరహా కేసుల్లో ఉన్నవారిని పర్యవేక్షణ అధికారి అనుమతులు లేకుండా పన్ను అధికారులు ఎలాంటి తనిఖీలు చేయరని భరోసా ఇచ్చారు. అలాగే అంకురాల్లో పెట్టుబడులు పెట్టే ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్) కేటగిరి- 2కి ఏంజెల్ ట్యాక్స్ నుంచి పూర్తి మినహాయింపును ఇచ్చారు. ఒక అంకుర సంస్థ పోటీ విపణుల్లో అడుగుపెట్టే సమయంలో పెట్టుబడులు పెట్టే సంస్థను ఏంజెల్ ఇన్వెస్టర్ అంటారు. ఆదాయపు పన్ను చట్టంలో సెక్షన్ 56(2)(7బీ) ప్రకారం.. సాధారణ మార్కెట్ విలువకు మించి నిధులు సమీకరించినప్పుడు.. ఆ నిధులను ఇతర వనరుల నుంచి లభించిన ఆదాయంగా పరిగణించి 30 శాతం పన్ను విధిస్తారు. దీనినే ఏంజెల్ ట్యాక్స్‌గా నిర్వచిస్తున్నారు.



## నమోదిత కంపెనీలకూ 20% బైబ్యాక్ పన్ను

నమోదిత కంపెనీలు షేర్లను తిరిగి కొనుగోలు చేసేటప్పుడు 20% బైబ్యాక్ పన్నును చెల్లించాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. ఇంతవరకూ నమోదు కాని కంపెనీలు మాత్రమే ఈ పన్నును చెల్లించేవి. అయితే డివిడెండు పంపిణీ పన్ను (డీడీటీ) ఎగ్గొట్టడానికి చాలా కంపెనీలు బైబ్యాక్ వైపు మొగ్గు చూపుతున్నట్లు గుర్తించడంతో వాటికి కూడా బైబ్యాక్ పన్నును అమలు చేస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. కంపెనీలు తాము ఆర్జించే లాభాల్లో కొంతభాగాన్ని వాటాదార్లకు పంచేందుకు వీలుగా డివిడెండ్లు చెల్లిస్తుంటాయి. ఈ సమయంలో అవి ప్రభుత్వానికి డీడీటీని చెల్లించాల్సి ఉంటుంది. అయితే నమోదిత కంపెనీలు ఆ లాభాలతో షేర్ల బైబ్యాక్‌కు దిగుతుండటంతో బైబ్యాక్ పన్నును అమలు చేసినట్లు తెలుస్తోంది.

## విద్యుత్తు వాహనాలు కొంటే.. లక్షన్నర వరకు రాయితీ

విద్యుత్తు వాహనాల (ఈవీ) కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు.. వాటి నిమిత్తం తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీకి ఆదాయపు పన్నులో రూ.1.50 లక్షల వరకు మినహాయింపు ఇవ్వాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందువల్ల మొత్తంమీద వినియోగదార్లకు రూ.2.50 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుంది. అధునాతన బ్యాటరీ కలిగి, రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యుత్తు వాహనాల వినియోగదార్లకే ఇది వర్తిస్తుంది. ఈవీల విడిభాగాలు కొన్నింటిపై కస్టమ్స్ సుంకాన్ని కూడా ప్రభుత్వం పూర్తిగా పరిహరించింది. విద్యుత్ వాహనాల తయారీ, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రూ.10,000 కోట్లతో ఫేమ్ 2 పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అలాగే వీటిపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది.

## ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు

మీడియా, విమానయానం, బీమా, ఏక బ్రాండ్ రిటైల్ రంగాల్లో మరిన్ని విదేశీ నిధులను ఆకర్షించేందుకు వీలుగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనల్ని తాజా బడ్జెట్‌లో సడలించారు. 'బీమా బ్రోకరేజీ సంస్థల్లో 100 శాతం ఎఫ్‌డీఐల్ని అనుమతించబోతున్నాం. ఏక బ్రాండ్ రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐల కోసం స్థానిక సోర్సింగ్ నిబంధనల్ని సడలిస్తామ'ని మంత్రి వివరించారు. ప్రస్తుతమున్న ఎఫ్‌డీఐ విధానం ప్రకారం, బీమా రంగంలోకి 49 శాతం ఎఫ్‌డీఐలనే అనుమతిస్తున్నారు. ఇందులో బీమా సంస్థలతోపాటు బీమా బ్రోకరేజీ సంస్థలు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లు (టీపీఏలు), సర్వేయర్లు, తదితరులు ఉన్నారు.

## రూ.50 లక్షలు మించితే.. టీడీఎస్ తప్పదు

పన్ను పరిధిని పెంచడం కోసం ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. కాంట్రాక్టర్లు లేదా వృత్తినిపుణులకు వ్యక్తులు చేసే చెల్లింపులు ఒక ఏడాదిలో రూ.50 లక్షలకు మించితే 5 శాతం మూలం వద్ద పన్ను మినహాయింపు(టీడీఎస్)ను విధిస్తారు. టీడీఎస్‌ను తమ శాశ్వత ఖాతా నంబరు(పాన్)ను ఉపయోగించి ట్రెజరీలో డిపాజిట్ చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఏ వ్యక్తి లేదా హిందు అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కానీ కాంట్రాక్టర్లు లేదా వృత్తినిపుణులకు చేసే చెల్లింపులపై ఎటువంటి టీడీఎస్ లేదు.

## రూ.400 కోట్ల టర్నోవరు వరకు కార్పొరేట్ పన్ను 25%

25 శాతం కార్పొరేట్ పన్ను పరిధిలోకి వచ్చే కంపెనీల వార్షిక టర్నోవరు పరిమితిని రూ.250 కోట్ల నుంచి రూ.400 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనతో దేశంలోని సుమారు 99.3 శాతం కంపెనీలు ఈ జాబితాలోకి వచ్చే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ప్రస్తావించారు. కేవలం 0.7 శాతం కంపెనీలు మాత్రమే 25 శాతం కార్పొరేట్ పన్నుకు బయట ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం కార్పొరేట్ పన్ను 30 శాతంగా ఉంది.

## సీపీఎస్ఈలకు ఈఎల్ఎస్ఎస్ హోదా

ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడిని ఉపసంహరించేందుకు ప్రభుత్వం ఈటీఎఫ్ మార్గాన్నే ఎంచుకుంది. సీపీఎస్ఈ పేరుతో ఈటీఎఫ్‌లను స్టాక్ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. వీటిలో పెట్టుబడి పెట్టేందుకు మదుపరులు ఆసక్తి చూపిస్తున్నా.. ఎలాంటి కాల పరిమితి లేకపోవడంతో వెంటనే విక్రయించేస్తున్నారు. వీటిలోనూ దీర్ఘకాలిక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కొత్త నిబంధనలు వచ్చాయి. ఈపీఎస్ఈలలో మదుపు చేసినప్పుడు పన్ను ఆదా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల మాదిరిగానే వీటికీ వెసులుబాటు ఇవ్వనున్నారు.

## సౌర విద్యుత్ యూనిట్లకు ప్రోత్సాహకాలు

సౌర విద్యుత్తు వినియోగానికి తోడ్పడే సెల్స్, బ్యాటరీలు, ఛార్జింగ్ వ్యవస్థల తయారీ యూనిట్లను దేశీయంగా నెలకొల్పేందుకు అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చేలా ప్రత్యేక పథకాన్ని ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ పెట్టుబడులపై పన్ను ప్రయోజనాలు కల్పించనుంది. పారదర్శక బిడ్డింగ్ ద్వారా భారీ తయారీ యూనిట్లు నెలకొల్పేందుకు అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానిస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. సెమీ కండక్టర్ ఫ్యాబ్రికేషన్‌కూ ప్రోత్సాహకాలిస్తారు. సౌర ఫొటో వోల్టాయిక్ సెల్స్, లిథియం స్టోరేజీ బ్యాటరీలు, సౌర విద్యుత్తు ఛార్జింగ్ వ్యవస్థ, కంప్యూటర్ సర్వర్లు, ల్యాప్‌టాప్‌ల యూనిట్లకూ ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు.

## ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు ఊరట

సెల్‌ఫోన్లు, టీవీలు, సెట్‌టాప్ బాక్సుల తయారీదార్లకు ఊరట కలిగించే ప్రతిపాదనను ఆర్థిక మంత్రి చేశారు. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లింగ్, సెల్‌ఫోన్ల కెమేరా మాడ్యూల్, ఛార్జర్/అడాప్టర్, లిథియం అయాన్ బ్యాటరీ, డిస్‌ప్లే మాడ్యూల్, సెట్‌టాప్ బాక్స్, కాంపాక్ట్ కెమేరా మాడ్యూల్‌ల తయారీ, బిగింపు (అసెంబ్లింగ్)నకు వినియోగించే యంత్రాలపై ప్రస్తుతం అమలవుతున్న పన్నును పూర్తిగా పరిహరిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు ఇండియన్ సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మొహింద్రో తెలిపారు. ఇందువల్ల పెట్టుబడి వ్యయాలు 7-10 శాతం తగ్గుతాయన్నారు.

# నవ్యపథం నిర్మల రథం!

కేంద్ర బడ్జెట్ 2019-20

'కాయకవే కైలాస' అన్నది బసవేశ్వరుడి బోధ! అందుకే మా ప్రభుత్వం 'కాయక, దశోహ' సిద్ధాంతాలను అనుసరిస్తూ.. కోటి మంది యువతకు పీఎం కౌశల్ వికాస్ యోజన కింద పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్నాం.



రాష్ట్రీయం..

## రూ.4 కోట్లు

### గిరిజన వర్సిటీకి ఇచ్చిందిదే

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కలిపి బడ్జెట్‌లో రూ.8 కోట్లు కేటాయించారు. ఇందులోనే ఉన్నత విద్య ఆర్థిక సహకార సంస్థ (హెచ్ఈఎఫ్ఏ) రుణానికి సంబంధించి చెల్లింపుల కోసం రూ.50లక్షలని పేర్కొంది. ఈ లెక్కన తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెరో రూ.3.75 కోట్ల చొప్పున రూ.7.5 కోట్లు ఇచ్చినట్లయింది.

నిజానికి కేంద్రీయ యూనివర్సిటీ ఏర్పాటుకు మూలధన వ్యయం కింద దాదాపు రూ.1000కోట్లు అవసరం. పూర్తిస్థాయి యూనివర్సిటీని ఏర్పాటు చేయాలంటే కనీసం ఆరేళ్ల సమయం పడుతుంది. అప్పటి వరకు ఏటా రూ.200కోట్లకు పైగా నిధులు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉండగా..రూ.4 కోట్లు ఇవ్వడం గమనార్హం.

## ఎయిమ్స్‌కు నిధులేవీ?

దేశంలో వేర్వేరు రాష్ట్రాల్లో నెలకొల్పిన ఎయిమ్స్‌ల నిర్వహణ, అభివృద్ధి కోసం మొత్తంగా కేంద్రం రూ.3,600 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. దేశంలో మొత్తం 22 ఎయిమ్స్‌ల ఏర్పాటుకు కేంద్రం వచ్చజెండా ఊపగా.. ఇందులో ఇప్పటికే 10 రాష్ట్రాల్లో సేవలందిస్తున్నాయి. 2019-20 వైద్యవిద్య సంవత్సరం నుంచే తెలంగాణలోని బీబీనగర్‌లో ఎయిమ్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనికి బడ్జెట్‌లో ఎంత కేటాయిస్తున్నారనే స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఎయిమ్స్ నిర్వహణ ఎలా అనే సందేహాలు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

## కేసీఆర్ పథకాలే ఆదర్శం



సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలను కేంద్రం ఆదర్శంగా తీసుకొంటోంది. నాడు రైతుబంధు స్ఫూర్తితో పీఎం కిసాన్ యోజన. నేడు మిషన్ భగీరథను అనుసరిస్తూ హర్ ఘర్ జల్ యోజనను కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించింది. కేంద్ర ఆర్థిక సర్వే సైతం తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వేను ప్రశంసించింది. 14.9 శాతం జీఎస్‌డీపీతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. –ట్విటర్‌లో కేటీఆర్

## నవభారత నిర్మాణ బడ్జెట్



కేంద్ర బడ్జెట్ భవిష్యత్తు తరాల ఆకాంక్షల్ని ప్రతిఫలిస్తోంది. రూ.13 లక్షల కోట్లు రాష్ట్రాలకు అందించడం ద్వారా ఫెడరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం కంకణం కట్టుకుంది. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఉపదేశించే ప్రధాని మోదీ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులను పెంచారు. – కిషన్ రెడ్డి

## పెట్టుబడుల ఉపసంహరణా?



కొత్త పథకాలు ప్రకటించని ప్రభుత్వం రూ.1.05 లక్ష కోట్ల ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం బాధాకరం. దేశవ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. సాగు రంగానికి ఎలాంటి ప్రోత్సాహకాలూ లేవు. మహిళలు, యువకులకు కొత్తగా ఏ పథకం రాలేదు. – ఉత్తమ్

## పేదల అభ్యున్నతికి పెద్దపీట



కేంద్రం గ్రామీణ పేదల అభ్యున్నతికి, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోంది. పట్టణ ప్రాంత, మధ్యతరగతి ప్రజలు, వ్యవసాయదారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోంది.. కాలుష్య రహిత భారత్ నిర్మాణం కోసం ఎలక్ట్రిక్ వాహనాల రంగాన్ని, కొనుగోళ్లను ప్రోత్సహించనున్నారు. – లక్ష్మణ్

## బడ్జెట్ నిరాశపర్చింది



కాళేశ్వరానికి జాతీయ హోదా, రైల్వే, జాతీయ రహదారులపై ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రానికి ఎన్నో ప్రతిపాదనలు అందజేశారు. వాటిలో కొన్నైనా అంగీకరిస్తారనుకుంటే అవేం లేవు. 'హర్ ఘర్ జల్' అని ఇప్పుడంటున్నారు.. మిషన్ భగీరథతో మేం ఇప్పటికే తెలంగాణలో ఇంటింటికీ నీళ్లిచ్చాం. దేశానికి దిక్సూచిలా మా పథకం ఉంది. అలాంటి పథకానికి కేంద్రం నిధులు ఇచ్చి ఉండాల్సింది. – నామా నాగేశ్వరరావు

## దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష



కేంద్ర బడ్జెట్‌లో దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపారు. తెలంగాణకు నిధులు కేటాయించకుండా కేంద్రం అన్యాయం చేసింది. ఆరు బడ్జెట్లలో కేసీఆర్ తెచ్చుకుందీ లేదు.. మోదీ ఇచ్చిందీ లేదు. ఉత్తరప్రదేశ్ ప్రజలు రూ.1 పన్ను కడితే ఆ రాష్ట్ర అభివృద్ధికి రూ.2, బిహార్ వాళ్లు రూ.1 పన్ను కడితే రూ.1 కేటాయిస్తున్నారు. అదే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల ప్రజలు రూ.1 పన్ను కడితే 65 పైసలు మాత్రమే కేటాయిస్తున్నారు. – రేవంత్ రెడ్డి

# ప్రైవేటు కూత

- 12 ఏళ్లలో మౌలికానికి రూ.50 లక్షల కోట్లు అవసరం
- పీపీపీ విధానానికి అగ్రతాంబూలం
- ఏడాదికి 10,000 కిలోమీటర్ల పనులు
- ఆదాయం రూ.2.16 లక్షల కోట్లు, కేంద్రం నుంచి భారీ మద్దతు
- పార్లమెంటుకు రైల్వే ప్రతిపాదనలు సమర్పించిన ఆర్థిక మంత్రి

ఈనాడు, దిల్లీ: రైల్వేలో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు అవసరం కానున్న దృష్ట్యా ప్రభుత్వ-ప్రైవేటు-భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిని పెద్దఎత్తున వినియోగించుకోనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వేగవంతమైన అభివృద్ధికి, ప్రయాణికుల సేవల్ని మెరుగుపరిచేలా అనుసంధానత సాధించడానికి ఇది అవసరమని చెప్పారు. పన్నెండేళ్ల కాలంలో రూ.50 లక్షల కోట్లు కావాల్సి వస్తుందని అంచనావేశారు. శుక్రవారం కేంద్ర బడ్జెట్లో భాగంగా రైల్వే సంబంధిత ప్రతిపాదనలను ఆమె పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కేంద్రం తరఫున బడ్జెట్ సాయం కింద రైల్వేకు రూ.65,837 కోట్లు ఇస్తామని, మునుపెన్నడూ లేనంతగా మూలధన వ్యయం రూ.1.60 లక్షల కోట్లుగా ఉంటుందని చెప్పారు. గత ఏడాది బడ్జెట్ మద్దతు కింద రూ.55,088 కోట్లు, మూలధన వ్యయంగా రూ.1.48 లక్షల కోట్లు చూపించారు. ప్రయాణికుల సదుపాయాలకు కేటాయింపులు గత ఏడాది కంటే 200% పెంచి, రూ.3422 కోట్లు ఇచ్చారు. ప్రత్యేక ప్రయోజక వాహక సంస్థ (ఎస్పీవీ)ల ద్వారా సబర్బన్ రైల్వేల్లో పెట్టుబడుల్ని ప్రోత్సహిస్తామని, పీపీపీ విధానంలో మెట్రో రైలు వ్యవస్థను పెంచుకుంటూ వెళ్తామని చెప్పారు. రోలింగ్‌స్టాక్ తయారీకి ప్రైవేటు పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని నిర్ణయించామన్నారు. ఆ వివరాలు ..

**సిబ్బందికి నైపుణ్య శిక్షణ:** రైల్వేలోని 13 లక్షలమంది ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇస్తారు. ప్రయాణికులతో ఎలా మెలగాలి, ఖర్చులెలా తగ్గించుకోవాలి, పని సంస్కృతి మెరుగు... ఈ మూడు అంశాల్లో శిక్షణ ఉంటుంది. దీనిలో రాణించినవారికి తదుపరి దశ శిక్షణకు పంపిస్తారు.

### భారీ లక్ష్యం

2019-20 ఆదాయం **రూ.2.16** లక్షల కోట్లు, వ్యయం **రూ.2.07** లక్షల కోట్లు.

- ★ కొత్తలైన్లు, గేజ్ మార్పిడి, జంట మార్గాల నిర్మాణం (డబ్లింగ్), విద్యుదీకరణ వంటి పనులు: **10వేల కి.మీ.**
- ★ **23,000** రైలు పెట్టెలు/ సరకు రవాణా వ్యాగన్ల (రోలింగ్ స్టాకు) కొనుగోలు.
- ★ డీజిల్ ఇంజిన్లు కొనుగోలు చేయరు.
- ★ సరకు రవాణా: **127.4 కోట్ల** టన్నులు.
- ★ ప్రయాణికుల సంఖ్య: **859.3 కోట్లు**
- ★ మూలధన వ్యయం: **రూ.1,60,175.64 కోట్లు**
- ★ బడ్జెటేతర మార్గంలో నిధుల సమీకరణ: 'భారతీయ రైల్వే ఆర్థిక సంస్థ' నుంచి **రూ.29,031 కోట్లు**, పీపీపీ ద్వారా **రూ.28,100 కోట్లు**



### ఇదీ రైల్వే బడ్జెట్ స్వరూపం

(రూ. కోట్లు)

| | 2018-19 వాస్తవం | 2019-20 అంచనాలు | 18-19తో పోలిస్తే పెంపు% |
|---|---|---|---|
| **ట్రాఫిక్ ఆదాయం** | | | |
| ప్రయాణికుల టికెట్లు | 51,066.64 | 56,000 | 9.7 |
| సరకు రవాణా | 1,27,430.08 | 1,43,000.00 | 12.2 |
| ఇతరత్రా కోచింగ్ | 4,474.48 | 6,000 | 34.1 |
| ఇతర ఆదాయమార్గాలు | 6,996.41 | 11,575.00 | 65.4 |
| పాతబకాయిల నుంచి వసూళ్లు | –63.46 | 100.00 | – |
| ట్రాఫిక్‌యేతర ఆదాయం | 600.79 | 260.00 | –56.7 |
| మొత్తం ఆదాయం | 1,90,504.74 | 2,16,935.00 | 13.9 |
| **వ్యయం** | | | |
| సాధారణ నిర్వహణ వ్యయం | 1,40,199.14 | 1,55,000.00 | 10.6 |
| అభివృద్ధి నిధి | 300.00 | 500.00 | 66.7 |
| పింఛను నిధి | 44,280.00 | 50,000.00 | 12.9 |
| ఇతరత్రా ఖర్చులు | 1,952.95 | 2,400.00 | 22.9 |
| మొత్తం వ్యయం | 1,86,732.09 | 2,07,900.00 | 11.3 |
| నికర ఆదాయం | 3,772.65 | 9,035.00 | 139.5 |
| ఆపరేటింగ్ నిష్పత్తి | 97.3% | 95.% | –2.56 |

### అన్ని స్టేషన్లు, రైళ్లలో సీసీటీవీ నిఘా



ప్రయాణికుల భద్రత కోసం అన్ని స్టేషన్లు, రైళ్లలో సీసీటీవీ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

- ఇప్పటివరకూ 455 స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేశారు.
- 2020-21కల్లా మిగిలిన అన్ని స్టేషన్లలో ఈ ఏర్పాటుచేస్తారు.
- 1,203 కోచ్‌లలో ఉన్న సీసీటీవీలను 2021-22 నాటికి అన్ని కోచ్‌లకూ అందుబాటులోకి తెస్తారు.



### భద్రతకు ప్రాధాన్యం

భారతీయ రైల్వే చరిత్రలో అత్యంత సురక్షితమైన సంవత్సరంగా 2018-19 నిలిచిపోనుంది. కాపలా దారుల్లేని లెవెల్ క్రాసింగుల తొలగింపు, బ్రాడ్‌గేజ్ మార్పిడి పనుల్ని ఆ ఏడాదిలో లక్ష్యం మేరకు పూర్తిచేశారు.

- స్వర్ణ చతుర్భుజి మార్గంలోని 2,568 రైల్వే క్రాసింగ్‌లపై వంతెనలు నిర్మించి వాహనాల రాకపోకలకు అడ్డంకుల్లేకుండా చేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకొంది. దేశంలో 50-60% రైళ్ల రాకపోకలు ఈ మార్గంలోనే జరుగుతాయి. కాబట్టి వాటికి ఇబ్బందులు తొలగించడం వల్ల మొత్తం మీద రవాణా వేగవంతమవుతుంది.

### ఇది అందరి బడ్జెట్

'ఇది పేదలు, ధనికులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సహా 130 కోట్ల మంది భారతీయుల బడ్జెట్. పని సంస్కృతిని ప్రోత్సహించి, అవకాశాలు కల్పించేదిగా ఉంది. సరకు రవాణాలో రైల్వే వాటా పెరుగుతుంది. మెరుగైన సదుపాయాల వల్ల ప్రయాణికులూ రైళ్ల వైపు మొగ్గుతారు.'

– పీయూష్ గోయల్, రైల్వే మంత్రి

### 2022కు విద్యుదీకరణ

2021-22కల్లా మొత్తం బ్రాడ్‌గేజ్ వ్యవస్థ విద్యుదీకరణను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఈ ఒక్క సంవత్సరమే 7వేల కిలోమీటర్లు పూర్తిచేస్తారు.

- 2019-20లో కొత్తలైన్లు, గేజ్ మార్పిడి, అదనపు మార్గాలకు కలిపి 3,750 కిలోమీటర్ల లక్ష్యాన్ని పెట్టుకున్నారు.
- దిల్లీ-మేరఠ్ మధ్య నిర్మించిన 'శీఘ్ర ప్రాంతీయ రవాణా వ్యవస్థ' తరహాలో సబర్బన్ రైళ్లలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఎస్పీవీలను ఏర్పాటు చేయనున్నారు.
- నిర్భయ నిధి రూపంలో రూ.267.64 కోట్లు, అంతర్గత వనరుల ద్వారా రూ.10,500 కోట్లు సమకూర్చుకుంటారు.

### 2019–20 లక్ష్యాలు

| వివరం | లక్ష్యం (రూట్ కి.మీ) | నిధులు (రూ.కోట్లు) |
|---|---|---|
| కొత్త రైల్వే లైన్లు | 500 | 7255 |
| గేజ్ మార్పిడి | 600 | 2200 |
| డబ్లింగ్ | 2,650 | 700 |
| **రోలింగ్ స్టాక్** | | |
| విద్యుత్తు ఇంజిన్లు | 725 | రూ. 6114 కోట్లు |
| రైలు పెట్టెలు | 7,690 | |
| వ్యాగన్లు | 15,000 | |
| పట్టాల పునరుద్ధరణ (రూట్ కి.మీ) | 3,900 | |
| విద్యుదీకరణ (రూట్ కి.మీ) | 7,000 | |

### ప్రయాణికులకు సౌకర్యాల పెంపు

ప్రయాణికులకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించడానికి రూ.3422.57 కోట్లతో పెద్దఎత్తున రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ చేపడతారు.



- 2023 నాటికి ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైళ్ల ప్రాజెక్టును పూర్తిచేయనున్నారు.
- దేశీయంగా తయారైన సెమీ హైస్పీడ్ ట్రైన్-18 (వందే భారత్) రైళ్లను ప్రవేశపెడతారు.
- ఇప్పటివరకు 1,603 రైల్వేస్టేషన్లలో వైఫై సౌకర్యం కల్పించారు. ఆగస్టు 31 నాటికి హాల్ట్ స్టేషన్లలో మినహాయించి మిగతా 4,882 స్టేషన్లలో దీనిని కల్పిస్తారు.

## ద.మ.రైల్వేకు కేటాయింపు ఎంత?

ఈనాడు, హైదరాబాద్: బడ్జెట్‌లో రైల్వేశాఖకు వచ్చే ఆదాయం, చేసే ఖర్చుల్ని వెల్లడించినప్పటికీ జోన్ల వారీగా కేటాయింపులను ప్రకటించలేదు. దీంతో కొత్త ప్రాజెక్టులను మంజూరు చేస్తారా? పనులు జరుగుతున్న లైన్లకు ఎంత మేర కేటాయింపులు ఉంటాయి.. రైళ్లకు ఎన్ని కొత్త బోగీలు వస్తాయి.. అన్నదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు సంబంధించి.. కొత్త లైన్లు, డబ్లింగ్ లైన్లు, గేజ్ మార్పిడి, బోగీలు, వ్యాగన్లు, ఎలక్ట్రిక్ ఇంజిన్ల తయారీ లక్ష్యాలను తెలిపింది. మూలధన వ్యయం మొత్తం రైల్వేశాఖకు ఈసారి రూ.1.60 లక్షల కోట్లు ఉంటుందని కేంద్రం పేర్కొంది. ఇందులో దక్షిణమధ్య రైల్వేకు ఎన్ని నిధులు కేటాయిస్తారన్నదానిపై స్పష్టత రావల్సి ఉంది. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు అదే రోజు జోన్లు, ప్రాజెక్టుల వారీగా వివరాలను వెల్లడించారు. ఈసారి మాత్రం కేవలం రైల్వేశాఖ ఆదాయ, వ్యయాలనే ప్రకటించారు. ప్రాజెక్టుల వారీగా కేటాయింపుల వివరాలను పింక్‌బుక్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన తర్వాత ప్రకటిస్తారని.. గతంలోనూ రెండేళ్లు ఇలాగే జరిగిందని ద.మ.రైల్వే వర్గాలు తెలిపాయి. సోమ, మంగళవారాల్లో వెల్లడించే అవకాశం ఉంటుందని ఓ అధికారి పేర్కొన్నారు.

> ఆర్థికంగా లాభదాయకమైన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరైనా ముందుకు వస్తానంటే ఎందుకు వద్దనాలి? కోల్ ఇండియా వంటి సంస్థలు బొగ్గు గనుల నుంచి సరకు రవాణా చేయడానికి రైల్వే ఎందుకు పెట్టుబడి పెట్టాలి? వాళ్లే ఆ పెట్టుబడి పెట్టుకోవాలి. ఇలాంటి అవకాశాలపై దృష్టి సారించాలి. మెట్రో రైలు పెట్టెల తయారీలో పెట్టుబడి పెడతాం.
>
> – నిర్మలా సీతారామన్, ఆర్థిక మంత్రి

# మాటా లేదు... మూటా లేదు




ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర కోణం నుంచి కేంద్ర బడ్జెట్‌ను పరికిస్తే ఈసారి కూడా పెదవి విరుపులు, నిట్టూర్పులే మిగిలాయి. బడ్జెట్‌కు ముందు సాగిన పలు విశ్లేషణల్లో ఆశలు ఉప్పొంగగా శుక్రవారం నాటి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం చూస్తే నీళ్లు చిలకరించినట్లయింది. రాష్ట్రం నుంచి నాలుగు ఎంపీ స్థానాలు భాజపాకు దక్కడంతో మారిన ఈ రాజకీయ పరిస్థితులతో తెలంగాణకు బడ్జెట్ మద్దతు లభిస్తుందనే అభిప్రాయాలు బలంగా వ్యక్తమయినా వాస్తవ చిత్రం నిరుత్సాహాన్ని నింపింది. నీతి ఆయోగ్ సిఫార్సులు కూడా బుట్ట దాఖలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నివేదనలకు ఆవేదనే బదులైంది. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి.. రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో కేసీఆర్ ప్రభుత్వం వివిధ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా ఒక్క దానికి కూడా మోదీ ప్రభుత్వం అండగా నిలవలేదు. వేరే ప్రాజెక్టుల మాటా లేదు. విభజన చట్టంలో రాష్ట్రానికి కేంద్ర ఇచ్చిన హామీల ముచ్చట అంతకన్నా లేదు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నామమాత్రంగా రూ.4 కోట్లను కేటాయించి కేంద్రం చేతులు దులిపేసుకుంది.

### రాష్ట్రానికి పన్నుల వాటాగా రూ.19,718 కోట్లు!

కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో కూడా నిధుల కేటాయింపులో గణనీయమైన పెరుగుదల లేకపోవడం కూడా రాష్ట్రంపై ప్రభావం ఉంటుందని రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు గతం కంటే పెరగలేదు. స్వచ్ఛభారత్ మిషన్‌కు కేటాయింపులు తగ్గాయి. రాష్ట్రంలో 12 మున్సిపాలిటీలు అమృత్ పథకంలో ఉండగా, వరంగల్, కరీంనగర్‌లు స్మార్ట్‌సిటీ కార్యక్రమంలో ఉన్నాయి. ఈ రెండింటికి కలిపి కేంద్రం రూ.13,750 కోట్లను కేటాయించింది. కేంద్రం అమలు చేస్తున్న పథకాల్లో రాష్ట్రానికి కొంత నిధుల పెరుగుదల ఉంటుందని ప్రత్యేకమైన ఆర్థిక తోడ్పాటు మాత్రం లేదని అధికారులు పేర్కొన్నారు. కొత్త బడ్జెట్ నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్రానికి పన్నుల వాటాగా రూ.19,718 కోట్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 14వ ఆర్థిక సంఘం సూచనల మేరకు కేంద్ర పన్నుల్లో 42 శాతాన్ని రాష్ట్రాలకు పంచుతూ వస్తున్నారు. అందులో భాగంగానే రాష్ట్రాలకు పంచనున్న రూ.8,09,133.02 కోట్లలో తెలంగాణకు 2.437 శాతం వాటా కింద నిధులు రానున్నాయి. ఈ మొత్తం గతేడాది కంటే రూ.1,157.69 కోట్లు ఎక్కువ. రాష్ట్రానికి వచ్చే మొత్తంలో కార్పొరేట్ ట్యాక్స్ వాటా అధికంగా ఉంది. ఆ తర్వాత కేంద్ర జీఎస్టీ, ఆదాయ పన్నుల్లో ఎక్కువ మొత్తాలు దక్కుతున్నాయి. కేంద్ర పన్నుల్లో అత్యధిక మొత్తంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.1.45 లక్షల కోట్లు లభిస్తున్నాయి. తెలంగాణ కంటే ఎక్కువ మొత్తం పొందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, కేరళ ఉన్నాయి.

### తెలంగాణకు దక్కింది ఇదే

- సింగరేణి కాలరీస్ సంస్థకు రూ.1,850 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.2వేల కోట్లు కేటాయించినా అంచనాల సవరణ నాటికి అది రూ.1100 కోట్లకు తగ్గింది.
- హైదరాబాద్‌లోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చికి రూ.319.39 కోట్లు కేటాయించారు.
- దేశంలోని సీడ్యాక్‌లన్నింటికీ కలిపి రూ.120 కోట్లు కేటాయించారు. అందులో హైదరాబాద్‌కూ కొంత దక్కుతుంది.
- సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి రూ.30 కోట్లు కేటాయించారు. అందులో హైదరాబాద్‌కు కొంత మొత్తం అందనుంది.
- హైదరాబాద్‌లోని నేషనల్ ఫిషరీష్ బోర్డుకు రూ.80.75 కోట్లు కేటాయించారు.
- స్వాతంత్ర సమరయోధుల పింఛన్లు, ఇతర ప్రయోజనాల కోసం రూ.952.81 కోట్లు కేటాయించారు. ఇందులో కొంత మొత్తం హైదరాబాద్ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధులకు దక్కనుంది.

### ప్రధానంగా రాష్ట్రం ఆశించిన అంశాలు

- ఇంజినీరింగ్ అద్భుతం, తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయనిగా మారనున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కావాలి.



- విభజన హామీలైన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, వరంగల్‌లో రైల్వే వ్యాగన్ల ఫ్యాక్టరీ ఏర్పాటు.





- రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రక్షిత మంచినీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ, చెరువుల పునరుద్ధరణకు చేపట్టిన మిషన్ కాకతీయ చాలా బాగున్నాయని పేర్కొంటూ నీతి ఆయోగ్ మిషన్‌భగీరథకు రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5,000 కోట్లు ఇవ్వాలని 2016లో నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది.
- కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో వెనుకబడిన పూర్వపు తొమ్మిది జిల్లాలకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున ఇచ్చేది. ఈ జిల్లాలను పునర్విభజించి 32 జిల్లాలుగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో వీటికి రూ.50 కోట్లు చొప్పున కేటాయించాలని కోరింది.
- రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలి.




ప్రపంచకప్ అంటేనే అత్యుత్తమ జట్లు.. అత్యున్నత స్థాయి ఆట.. అద్వితీయమైన ఆటగాళ్ల ప్రదర్శనకు వేదిక. బ్యాట్స్‌మెన్.. బౌలర్లకు జీవితకాల పరీక్ష. ఒక సెంచరీ.. ఒక ఐదు వికెట్ల గణాంకాలకు ఎంతో విలువ. ఇక్కడ ఆడినోడే హీరో! విఫలమైనోడు జీరో! అయితే క్రికెట్లో అత్యున్నతమైన ఈ టోర్నీలో సత్తా చాటాలంటే ఏదో ఆషామాషీగా వచ్చి ఆడితే సరిపోదు. దానికి ప్రత్యేకమైన సన్నద్ధత ఉండాలి. చక్కటి ప్రణాళికతో సిద్ధమై రావాలి. ఈసారి అలా సిద్ధమై వచ్చిన వాళ్లే కప్పుపై తమదైన ముద్ర వేస్తున్నారు.

# కప్పులో వేటగాళ్లు



ఫోర్త్ అంపైర్

## యార్కర్ల బుమ్రా



ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ 24 వికెట్లు తీశాడు. న్యూజిలాండ్ బౌలర్ ఫెర్గూసన్ 17 వికెట్లు నేలకూల్చాడు. అయినా అభిమానులు.. విశ్లేషకుల్ని అమితంగా ఆకట్టుకుంటున్న బౌలర్ బుమ్రానే. అతడు 14 వికెట్లే తీసుండొచ్చు. కానీ వికెట్ తీసిన ఒక్కో బంతి ఒక్కో అద్భుతం. సహజసిద్ధమైన ప్రతిభ, నైపుణ్యం, స్పష్టత, కష్టపడేతత్వం కలగలిస్తే బుమ్రా. కొన్ని బంతులకు ఊహించకుండానే వికెట్లు దొరుకుతాయి. బ్యాట్స్‌మెన్ తప్పిదాలతో మరికొన్ని లభిస్తాయి. కానీ బ్యాట్స్‌మెన్ దగ్గర సమాధానమే లేకుండా చేసే బంతులతో వికెట్లు తీయడంలో బుమ్రా సిద్ధహస్తుడు. బంగ్లాదేశ్‌తో పోరులో రుబెల్, ముస్తాఫిజుర్ వికెట్లే ఇందుకు నిదర్శనం. ఫుల్ లెంగ్త్‌లో వేగంగా దూసుకొచ్చిన బంతి రుబెల్ బ్యాట్‌కు దొరక్కుండా మిడిల్ స్టంప్‌ను ముద్దాడింది. తర్వాతి బంతి ముస్తాఫిజుర్ బ్యాట్ కింది నుంచి వెళ్లి ఆఫ్‌స్టంప్‌ను ఎగరగొట్టింది. ఈ ప్రపంచకప్ తర్వాత యార్కర్.. బుమ్రా ఇంటి పేరుగా మారొచ్చేమో! ఇక అలస్యంగా అవకాశం అందుకున్న షమి సైతం అదరగొడుతున్నాడు. గంటకు 145 కిమీ వేగంతో నిలకడగా బంతులు వేస్తున్నాడు. అతడి ఇన్‌స్వింగర్లు వికెట్ల మీదకి దూసుకెళ్తున్నాయి.

## పేసరా.. స్పిన్నరా



ముస్తాఫిజుర్ రెహ్మాన్.. బంగ్లాదేశ్‌లో కాకుండా మరే అగ్రశ్రేణి జట్టులో ఉన్నా ఈపాటికి అతడి పేరు మారుమోగేదే! డెత్ ఓవర్లలో బుమ్రా యార్కర్లతో బెంబేలెత్తిస్తుంటే.. ముస్తాఫిజుర్ స్లో బంతులతో మైమరపిస్తున్నాడు. వేగంగా పరుగెత్తుకుంటూ వచ్చి.. లెగ్ స్పిన్నర్‌లా, ఆఫ్ స్పిన్నర్‌లా బంతిని తిప్పుతూ.. అనుకున్న స్థానంలో పిచ్ చేస్తూ బ్యాట్స్‌మెన్‌ను బోల్తాకొట్టిస్తున్నాడు. హార్దిక్ పాండ్యను సరిగ్గా అలాగే ఔట్ చేశాడు. నెమ్మదిగా తిరుగుతూ గుడ్‌లెంగ్త్‌లో పడి.. ఆఫ్‌స్టంప్ ఆవలగా వెళ్తున్న బంతి పాండ్య బ్యాట్‌ను తాకుతూ స్లిప్‌లో ఫీల్డర్ చేతుల్లోకి వెళ్లింది. ఇలాంటి వికెట్లు ముస్తాఫిజుర్ ఖాతాలో మరెన్నో చేరాయి.

## ఇంగ్లాండ్ మొనగాళ్లు



ఐపీఎల్‌లో అందరి దృష్టిలో పడిన ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ప్రపంచకప్‌లో జోరు కొనసాగిస్తున్నాడు. గంటకు 150 కి.మీ వేగంతో నిలకడగా బంతులు సంధించడం ఆర్చర్ ప్రత్యేకత. ఈ నైపుణ్యానికి అదనంగా నకుల్ (గోళ్లతో పట్టుకుని వేసేది) బంతులు సంధిస్తూ బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఆర్చర్ వేగంతో దూసుకెళ్తుండగా.. ఇంగ్లాండ్ మరో పేసర్ క్రిస్ వోక్స్ స్లో బంతులతో బురిడీ కొట్టిస్తున్నాడు. బ్యాట్స్‌మెన్ జోరుమీదున్నప్పుడు బంతిలో వైవిధ్యం కనబరుస్తూ ఔట్ చేస్తున్నాడు. స్లో బంతులతో బ్యాట్స్‌మెన్ లయను దెబ్బతీస్తున్నాడు. టీమ్‌ఇండియాతో మ్యాచ్ ఆరంభంలోనే రాహుల్‌ను స్లో బంతితో బోల్తాకొట్టించాడు. సెంచరీతో జోరుమీదున్న రోహిత్‌శర్మకు స్లో ఆఫ్ కట్టర్‌తో అడ్డుకట్ట వేశాడు. ఇక బ్యాటింగ్‌లో ఓపెనర్ బెయిర్‌స్టో తెలివిగా ఆడుతున్నాడు. బంతిని బలంగా బాదే బెయిర్‌స్టో నైపుణ్యానికి తెలివిని జోడిస్తున్నాడు. ఇంగ్లాండ్‌లోని మైదానాలేవీ గుండ్రంగా లేవు. ఒకవైపు దూరంగా.. మరోవైపు దగ్గరగా బౌండరీలు ఉంటున్నాయి. టీమ్‌ఇండియాతో పోరులో 59 మీటర్ల దూరంలో ఉన్న బౌండరీ వైపే బెయిర్‌స్టో అత్యధికంగా పరుగులు రాబట్టాడు. షార్ట్ బౌండరీల్ని లక్ష్యంగా చేసుకుని విజయవంతమవుతున్నాడు.

## విండీస్ వీరులు

ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌కు సానుకూలాంశాలు.. నికోలస్ పూరన్, షెల్డన్ కాట్రెల్. చాలా కాలం తర్వాత విండీస్ గడ్డపై నుంచి పూరన్ రూపంలో ఒక నాణ్యమైన బ్యాట్స్‌మన్ వచ్చాడు. వివ్ రిచర్డ్స్.. బ్రయాన్ లారాల కలబోతగా కనిపిస్తున్నాడు. శ్రీలంకపై పూరన్ సాధించిన శతకంలో రిచర్డ్స్, లారాల శైలి అగుపించింది. సహజసిద్ధమైన నైపుణ్యంతో భయం లేకుండా బ్యాటింగ్ చేస్తున్నాడు. రెండు వైపులా సాధికారికంగా ఆడుతున్నాడు. మొదటి బంతి నుంచే బంతిపై ఆధిపత్యం కనబరుస్తుండటం అతడి ప్రత్యేకత. పేసర్ కాట్రెల్ ప్రపంచకప్‌లో మరింతగా రాటుదేలాడు. లైన్ అండ్ లెంగ్త్‌లో బంతుల్ని సంధిస్తూ అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్‌ను సైతం ఇబ్బంది పెడుతున్నాడు.

## కింగ్ కోహ్లి

ప్రత్యర్థి ఎవరైనా.. ఎలాంటి పరిస్థితులున్నా వంద శాతం నైపుణ్యాన్ని ప్రదర్శించడం కోహ్లి ప్రత్యేకత. ప్రపంచకప్‌లో అతడి బ్యాటింగ్‌లో మరింత తీవ్రత కనిపిస్తోంది. కోహ్లి ఎప్పుడూ స్వీప్ షాట్ ఆడడు. టోర్నీలో అతడు సిక్సర్ల వైపు చూడట్లేదు. తను బలంగా ఉన్న విభాగాల్లో మరింత సాధికారితతో బ్యాటింగ్ చేస్తున్నాడు. ఆన్ సైడ్, ఆఫ్‌సైడ్ డ్రైవ్‌లు.. గ్రౌండ్ షాట్లు ఎక్కువగా ఆడుతున్నాడు. ఎంత గొప్పగా ఫీల్డింగ్ మోహరించినా వారి రక్షణ శ్రేణిని ఛేదిస్తూ బంతులు బౌండరీలకు దూసుకెళ్తున్నాయి. సరళమైన మణికట్టు కోహ్లీకి తిరుగులేని ఆయుధం. చేతి కండల్లోని బలాన్ని అలా బ్యాట్‌లోకి పంపి.. బ్యాట్ కదలికలో వేగాన్ని పెంచి.. బంతిని అనుకున్న కోణంలో బౌండరీకి తరలించడం కోహ్లీకే సాధ్యం. ఆఫ్‌స్టంప్ ఆవల పడిన బంతి మిడ్ వికెట్, స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి దూసుకెళ్తుంది. వేగంగా లెంగ్త్ తీసుకునే కోహ్లి కొంచెం ఆలస్యంగా బంతిని ఆడతాడు. అందుకే ఫీల్డర్లకు అందకుండా.. తను అనుకున్న ప్రాంతాల్లోకి కొలిచినట్లుగా బంతిని తరలించగలుగుతాడు. జట్టుకు విలువైన పరుగులు జోడిస్తున్నాడు.

## సారథుల సత్తా

ప్రపంచకప్‌లో మంచి మార్కులు సాధించిన సారథులు కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), ఆరోన్ ఫించ్ (ఆస్ట్రేలియా). వీళ్లిద్దరు బ్యాటింగ్‌లో ముందుండి జట్లను నడిపిస్తున్నారు. కివీస్ సెమీస్ చేరడానికి కారణం విలియమ్సనే. దక్షిణాఫ్రికాపై అజేయంగా 106 పరుగులతో వెస్టిండీస్‌పై 148 పరుగులతో జట్టును గెలిపించాడు. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ విలియమ్సన్ ఇన్నింగ్స్‌లు నిర్మించిన తీరు అద్భుతం. ఒక్కో ఆటగాడితో భాగస్వామ్యాలు నమోదు చేస్తూ సంప్రదాయ క్రికెట్‌ను మరోసారి గుర్తుకుతెచ్చాడు. ఇక ఫించ్‌ది భిన్నమైన శైలి. ఏడాది కిందట అసలు ఫామ్‌లోనే లేని ఫించ్.. గత కొన్ని నెలలుగా అద్భుతంగా ఆడుతున్నాడు. ఓపెనింగ్‌లో నిలకడగా రాణిస్తూ మిగతా బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి లేకుండా చేస్తున్నాడు. వార్నర్ కూడా దండిగా పరుగులు రాబడుతున్నప్పటికీ మునుపటి దూకుడు లేకపోవడంతో ఆ బాధ్యతల్ని ఫించ్ తన భుజాలపై వేసుకున్నాడు. డ్రైవ్‌లు, హుక్‌లతో అలరిస్తున్నాడు.

## శతకాల శర్మ

ఒకే బంతికి ఒకటి కంటే ఎక్కువ షాట్లు ఆడగల సమర్థుడు రోహిత్‌శర్మ. అతడి చేయి, కంటి సమన్వయం అసాధారణం. మెదడులో అనుకున్నట్లుగా చేతుల్లోని బ్యాట్‌తో నృత్యం చేయించగలడు. చేతుల్లో ఉండే సరళతతో బ్యాట్‌ను 360 డిగ్రీలు తిప్పగలడు. సరిగ్గా అదే పనిని ప్రపంచకప్‌లో మరింత సమర్థంగా చేస్తున్నాడు. కళాత్మక శైలి.. షాట్లలో కచ్చితత్వంతో సెంచరీల మోత మోగిస్తున్నాడు. ఈ ప్రపంచకప్‌లో రోహిత్ ఆడిన షాట్లన్నీ ఆణిముత్యాలే. స్ట్రెయిట్, ఆఫ్, ఆన్, కవర్ డ్రైవ్‌లు.. కట్ షాట్లలో కచ్చితత్వం కనిపిస్తుంది. బంగ్లాదేశ్‌తో ముస్తాఫిజుర్ ఓవర్ పిచ్ బంతిని లాఘవంగా బౌలర్ తల పైనుంచి సిక్సర్‌గా మలిచిన విధానం ప్రపంచకప్‌కే హైలైట్. ఇలాంటి ఎన్నో షాట్లు రోహిత్ బ్యాట్ నుంచి జాలువారుతున్నాయి.



ముస్తాఫిజుర్ బౌలింగ్‌లో రోహిత్ సిక్స్ కొట్టాడిలా..



ఒకటా.. రెండా! పాయింట్ల పట్టికలో భారత్ స్థానం ఏది! కోహ్లీసేన ఇప్పటికే ప్రపంచకప్ సెమీఫైనల్ చేరడంతో ఇప్పుడు మిగిలి ఉన్న ఆసక్తి ఇదే. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా ఆఖరి లీగ్ సమరానికి సిద్ధమైంది. నేడు శ్రీలంకను ఢీకొట్టనుంది. 13 పాయింట్లతో ఉన్న భారత్‌కు అగ్రస్థానం దక్కాలంటే ఈ మ్యాచ్‌లో నెగ్గితేనే సరిపోదు. శనివారమే జరిగే మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా (14 పాయింట్లు).. దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోవాలి. నేటితో ప్రపంచకప్ లీగ్ దశ ముగియనుంది. భారత్ అగ్రస్థానం సాధిస్తే.. న్యూజిలాండ్‌తో, రెండో స్థానంలో నిలిస్తే ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్లో ఆడుతుంది.

# ఒకటా.. రెండా..!

- భారత్ స్థానం తేలేది నేడే
- చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకతో ఢీ

మధ్యాహ్నం 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



1 లంకతో మ్యాచ్‌లో తొలి బంతికే బుమ్రా వికెట్ తీస్తే హ్యాట్రిక్ ఖాతాలో చేరుతుంది. బంగ్లాతో చివరి మ్యాచ్‌లో ఆఖరి రెండు బంతులకు అతడు వికెట్లు పడగొట్టిన సంగతి తెలిసిందే


లీడ్స్: పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని ఆశిస్తున్న టీమ్‌ఇండియా శనివారం జరిగే మ్యాచ్‌లో శ్రీలంకను ఢీకొంటుంది. సెమీస్‌లో స్థానం ఖాయమైనప్పటికీ ఈ మ్యాచ్ కోహ్లీసేనకు ముఖ్యమైనదే. టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌లు ఆడినా తడబాటు పోని మిడిల్ ఆర్డర్ గాడినపడేందుకు ఇదో చక్కని అవకాశం. పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశమున్నందున భారత్ ఇద్దరు స్పిన్నర్లు చాహల్, కుల్‌దీప్‌లతో బరిలోకి దిగే అవకాశముంది. భువనేశ్వర్, షమిలలో ఒకరే జట్టులో ఉండొచ్చు. ధోనీని ఐదో స్థానం నుంచి నాలుగుకు పంపిస్తారా అన్నది ఆసక్తికరం. శ్రీలంకను తక్కువ అంచనా వేస్తే పొరపాటే అవుతుంది. ఆ జట్టు ఇంగ్లాండ్‌కు షాకిచ్చిన సంగతి తెలిసిందే. లంక ఫాస్ట్‌బౌలర్ లసిత్ మలింగకు బహుశా.. ఇదే చిట్టచివరి ప్రపంచకప్ మ్యాచ్.

## పాయింట్ల పట్టిక

| జట్టు | మ్యా | గె | ఓ | టై/ర | పా | నె.రేట్ |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | 14 | +1.000 |
| భారత్ | 8 | 6 | 1 | 1 | 13 | +0.811 |
| ఇంగ్లాండ్ | 9 | 6 | 3 | 0 | 12 | +1.152 |
| న్యూజిలాండ్ | 9 | 5 | 3 | 1 | 11 | +0.175 |
| పాకిస్థాన్ | 9 | 5 | 3 | 1 | 11 | -0.430 |
| శ్రీలంక | 8 | 3 | 3 | 2 | 8 | -0.934 |
| బంగ్లాదేశ్ | 9 | 3 | 5 | 1 | 7 | -0.410 |
| దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | 5 | -0.080 |
| వెస్టిండీస్ | 9 | 2 | 6 | 1 | 5 | -0.225 |
| అఫ్గానిస్థాన్ | 9 | 0 | 9 | 0 | 0 | -1.322 |

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, నె: నెట్ రన్‌రేట్

దక్షిణాఫ్రికా × ఆసీస్ / సాయంత్రం 6 నుంచి




షహీన్ (6/35)

# విజయంతో ముగించింది

## బంగ్లాను ఓడించినా నెట్‌రన్‌రేట్‌లో పాక్ వెనుకంజే

లార్డ్స్

350 పరుగులు చేస్తే.. 311 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించాలి. పాకిస్థాన్ సెమీస్ చేరడానికి ఇదీ సమీకరణం. ఆట ఆరంభానికి ముందే పాక్ సెమీస్ చేరడం అసాధ్యం అని అందరికీ తెలుసు. ఇక మ్యాచ్‌లో అత్యద్భుతాలేమీ జరిగిపోలేదు. కాకపోతే వరుసగా మూడు విజయాలతో ఊపుమీదున్న పాకిస్థాన్.. తనను ఓడించే సత్తా ఉన్న బంగ్లాదేశ్‌పై ఘనవిజయం సాధించి కొంత సంతృప్తికరంగానే ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది. పాక్‌తో సమానంగా 11 పాయింట్లే సాధించిన న్యూజిలాండ్.. అనుకున్నట్లే నెట్‌రన్‌రేట్‌లో ఆ జట్టును వెనక్కి నెట్టి సెమీస్ బెర్తు ఖరారు చేసుకుంది. భారత్ చేతిలో పరాభవం తర్వాత వరుసగా పాక్ నాలుగు విజయాలు సాధించడం విశేషం. తొలి 5 మ్యాచ్‌ల్లో ఒక్కటే నెగ్గిన పాక్.. చివరి నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించింది. శుక్రవారం తన చివరి లీగ్ మ్యాచ్‌లో పాక్ 94 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. ఓపెనర్ ఇమాముల్ హక్ (100; 100 బంతుల్లో 7×4), బాబర్ అజామ్ (96; 98 బంతుల్లో 11×4) చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడటంతో మొదట పాక్.. 315 పరుగుల (9 వికెట్లకు) భారీ స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో షహీన్ షా అఫ్రిది (6/35) సంచలన బౌలింగ్ ప్రదర్శనతో బంగ్లాను బెంబేలెత్తించాడు. ఆ జట్టు 44.1 ఓవర్లలో 221 పరుగులకే కుప్పకూలింది. భీకర ఫామ్‌ను కొనసాగిస్తూ షకిబ్ అల్‌హసన్ (64; 77 బంతుల్లో 6×4) మరో అర్ధశతకం సాధించి తిరిగి టోర్నీ టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అతను మినహా బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ ఎవరూ అర్ధసెంచరీ కూడా అందుకోలేదు. గత మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడటంతోనే బంగ్లాకు సెమీస్ దారులు మూసుకుపోయిన సంగతి తెలిసిందే. షహీన్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

**పాకిస్థాన్:** 315/9 (ఇమాముల్ హక్ 100, బాబర్ అజామ్ 96, హఫీజ్ 27, ఇమాద్ వసీమ్ 43; ముస్తాఫిజుర్ 5/75, సైఫుద్దీన్ 3/77) **బంగ్లాదేశ్:** 221 (షకిబ్ 64, లిటన్ దాస్ 32, మహ్మదుల్లా 29; షహీన్ అఫ్రిది 6/35)

**షహీన్ రికార్డు:** ప్రపంచకప్‌లో అయిదు వికెట్ల ప్రదర్శన చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా షహీన్ అఫ్రిది రికార్డు నెలకొల్పాడు. శుక్రవారం నాటికి అతడి వయసు 19 ఏళ్ల 90 రోజులే. ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తరఫున అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన బౌలర్‌గానూ షహీన్ (6/35) రికార్డుల్లో కెక్కాడు.

## మాలిక్ వీడ్కోలు



పాకిస్థాన్ ఆల్‌రౌండర్ షోయబ్ మాలిక్ వన్డే క్రికెట్ నుంచి రిటైరయ్యాడు. ప్రపంచకప్‌లో శుక్రవారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్ అనంతరం అతడు తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ఈ మ్యాచ్‌కు అతడు పాక్ తుది జట్టులో లేడు. 37 ఏళ్ల మాలిక్ 2015లో టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మాలిక్ 287 వన్డేల్లో 34.55 సగటుతో 7534 పరుగులు చేశాడు. 158 వికెట్లు పడగొట్టాడు. 35 టెస్టుల్లో 1898 పరుగులు చేసిన అతడు.. 32 వికెట్లు తీశాడు.

# ప్రిక్వార్టర్స్‌లో హలెప్, జకోవిచ్

లండన్

హలెప్, ప్లిస్కోవా వింబుల్డన్ ప్రిక్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్లో ఏడో సీడ్ హలెప్ (రొమేనియా) 6-3, 6-1తో అజరెంక (బెలారస్)ను చిత్తు చేయగా.. మూడో సీడ్ ప్లిస్కోవా (చెక్) 6-3, 2-6, 6-4తో సు వి సీ (చైనీస్ తైపీ)పై గెలిచింది. ఎనిమిదో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్), ముచోవా (చెక్), యస్త్రెమ్‌స్కా (ఉక్రెయిన్) కూడా నాలుగో రౌండ్‌కు చేరుకున్నారు. మాజీ నంబర్‌వన్ వోజ్నియాకి (డెన్మార్క్) 4-6, 2-6తో జాంగ్ (చైనా) చేతిలో పరాజయంపాలైంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ జకోవిచ్ (సెర్బియా) ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. మూడో రౌండ్లో అతడు 7-5, 6-7 (5-7), 6-1, 6-4తో హర్కాజ్ (పోలెండ్)పై విజయం సాధించాడు. నాలుగో సీడ్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)కు షాక్ తగిలింది. అతడు 4-6, 3-6, 6-7 (4-7)తో పెలా (అర్జెంటీనా) చేతిలో ఓడిపోయాడు.



**ప్రిక్వార్టర్స్‌లో శరణ్ జోడీ:** దివిజ్ శరణ్, డెమోలిన్ (బ్రెజిల్) జోడీ పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్ చేరుకున్నారు. రెండో రౌండ్లో శరణ్ జోడీ 7-6 (1), 5-7, 7-6 (6), 6-4తో బెల్జియం జంట శాండర్ గైల్, జోరాన్ వీగెన్‌లపై విజయం సాధించింది.

# ఇంగ్లాండ్‌కు కలిసొస్తుంది

జాక్వెస్ కలిస్

దక్షిణాఫ్రికా ప్రదర్శన గురించి చాలామంది చాలా రకాలుగా మాట్లాడారు. అయితే అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిష్క్రమించబోతున్న తాహిర్, డుమినిలకు చక్కటి వీడ్కోలు ఇవ్వడానికి శనివారం ఆస్ట్రేలియాతో మ్యాచ్ ద్వారా మంచి అవకాశం లభిస్తోంది. ఇక వరుసగా తీవ్ర ఒత్తిడితో కూడిన రెండు మ్యాచ్‌లు ఆడి సెమీస్ బెర్తు సాధించడం ఇంగ్లాండ్‌కు నాకౌట్ దశలో కలిసొచ్చే అంశమే. భారత్, ఆస్ట్రేలియా చాలా ఏళ్లుగా నిలకడగా ఆడుతున్నాయి. నాకౌట్‌లో ఒత్తిడి వీటికి పెద్ద సమస్య కాదు. సెమీస్ చేరిన అన్ని జట్లకూ గాయాల సమస్య ఉంది.






# జడేజాను ఆడించాలి

జెఫ్ థాంప్సన్

నేను మొదటి నుంచీ ధోని మద్దతుదారుణ్ని. ప్రస్తుత భారత జట్టు విజయవంతం కావడంలో అతడి నాయకత్వ నైపుణ్యం, చతురత ఎంతో కీలకం. ధోని నుంచి సారథ్య బాధ్యతలు స్వీకరించిన కోహ్లి.. అతడి లాగే 'ముందు జట్టు తర్వాత ఆటగాడు' అని నమ్ముతాడు. కానీ ధోని ఇప్పుడు తాను నమ్మిన దానికి భిన్నంగా వ్యవహరిస్తుండడం బాధిస్తోంది. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో మరీ నెమ్మదిగా బ్యాటింగ్ చేసినందుకు అందరూ ధోనీని విమర్శించినా నేను అతడికి మద్దతిచ్చిన మాట నిజమే. కానీ బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అతడి బ్యాటింగ్ తీరు విస్మయానికి గురి చేసింది. అతడి ఆట నన్నెంతో నిరాశకు గురి చేసింది. ఇక శ్రీలంకతో మ్యాచ్‌లో భారత్.. దినేశ్ కార్తీక్ స్థానంలో జడేజాను ఆడించాలి.






Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

Eenadu epaper

# ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి పునరంకితం కావాలి

- మందకృష్ణ ఆస్తులపై విచారణ జరిపించాలి: పిడమర్తి



అభివాదం చేస్తున్న తెలుగు రాష్ట్రాల ఎంఆర్‌పీఎస్ నేతలు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తెలుగు రాష్ట్రాల్లోని మాదిగలు ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి పునరంకితం కావాలని మాదిగ ఐకాస వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీఎస్‌ఎంఆర్‌పీఎస్, టీఎంఆర్‌పీఎస్, మాదిగ హక్కుల పోరాట సమితి, మాదిగ ఐకాస, ఏపీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో 25ఏళ్ల మాదిగ ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. రవి మాట్లాడుతూ.. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని, 59 ఉపకులాలకు రిజర్వేషన్ల ఫలాలను అందించాలని కోరారు. మందకృష్ణ మాదిగ ఉద్యమాన్ని రాజకీయపార్టీలకు తాకట్టు పెట్టి, టికెట్లు అమ్ముకుని డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. మందకృష్ణ మాదిగ అక్రమంగా సంపాదించిన ఆస్తులపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని డిమాండు చేశారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని, లేకుంటే ఆయన పర్యటనలను అడ్డుకుంటామన్నారు. టీఎస్‌ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జీవ మాదిగ, మాదిగ యూత్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎల్లన్న, ఏపీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య, ఏపీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు తదితరులు మాట్లాడారు.

## రేపు ఈదుమూడిలో మాదిగల ఆత్మగౌరవ సభ

### మందకృష్ణ మాదిగ

ఈనాడు, హైదరాబాద్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7న ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మాదిగల ఆత్మగౌరవ జాతర పేరిట భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేంద్ర సహాయమంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతారన్నారు. 1994 జులై 7న ఈదుమూడిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందని చెప్పారు.

## జాతీయ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా అభయ్

ఈనాడు, హైదరాబాద్: సర్దార్ వల్లభాయ్ జాతీయ పోలీసు అకాడమీ, ఐపీఎస్ అధికారుల శిక్షణా కేంద్రానికి డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అభయ్‌ను నియమించారు. 1986 బ్యాచ్ ఒడిశా కేడర్‌కు చెందిన ఆయన ప్రస్తుతం నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోకి డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. అకాడమీకి ప్రస్తుతం డీజీగా ఉన్న జేలే బర్మా స్థానంలో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

# దుబాయ్‌లో ఆ మహిళను కాపాడాలి

- రాయబారికి కేటీఆర్ వినతి.. స్పందన

ఈనాడు, హైదరాబాద్: ఆర్థిక కారణాలతో దుబాయ్‌కి వెళ్లి ఇబ్బందులపాలైన రంగారెడ్డి జిల్లాకు చెందిన మహిళ హమీలను ఆదుకోవాలని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. ఆ మేరకు దుబాయ్‌లోని భారత రాయబారి నవదీప్‌సూరికి శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. ఉపాధి కోసం వెళ్లిన ఆమె ఒక ఇంట్లో పనికి చేరి, ఆ యాజమాని కుటుంబం వల్ల ఇక్కట్లు పడుతున్న వీడియో.. కుటుంబీకుల ద్వారా కేటీఆర్‌కు అందింది. వెంటనే స్పందించిన ఆయన విషయాన్ని రాయబారితో పాటు ఆ దేశ సంబంధిత కార్యాలయం దృష్టికి తెచ్చారు. బాధిత మహిళ క్షేమంగా తిరిగి ఇంటికి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. స్పందించిన రాయబారి.. చర్యలు చేపడతామంటూ ట్విటర్‌లో సమాధానమిచ్చారు. అందుకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

# అగ్నిమాపక శాఖ డీజీగా నాగేశ్వరరావు

- సీబీఐ నుంచి బదిలీ

ఈనాడు, దిల్లీ: సీబీఐలో అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మన్నెం నాగేశ్వరరావు బదిలీ అయ్యారు. అగ్నిమాపక శాఖ, సివిల్ డిఫెన్స్ అండ్ హోంగార్డ్ విభాగానికి ఆయన డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. సీబీఐ డైరెక్టర్, ప్రత్యేక డైరెక్టర్ అలోక్‌వర్మ, రాకేష్ అస్థానాల మధ్య వివాదం నెలకొన్న సమయంలో ఆ విభాగం తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు సీబీఐలో నియమితులైన విషయం తెలిసిందే. తెలంగాణలోని వరంగల్ జిల్లా మంగపేట్ ఆయన స్వస్థలం. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి రసాయనశాస్త్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, మద్రాస్ ఐఐటీలో పరిశోధన చేశారు. ఆయన గతంలో ఒడిశా ఫైర్‌సర్వీసెస్ అధిపతిగానూ సేవలు అందించారు. ఫైలిన్, హుద్‌హుద్ తుపాన్ల సమయంలో అందించిన సేవలకుగాను ఒడిశా ముఖ్యమంత్రి నుంచి పురస్కారాన్ని అందుకున్నారు.

# షిర్డీలో వెలమ భవన్‌కు స్థలమివ్వాలి

- మహారాష్ట్ర గవర్నర్, సీఎంలకు వినతి



మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావుతో ఎమ్మెల్సీ భానుప్రసాదరావు ఇతర నేతలు

ఈనాడు, హైదరాబాద్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన షిర్డీలో వెలమ సంక్షేమభవన్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని తెరాస ఎమ్మెల్సీ, వెలమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు టి. భానుప్రసాదరావు కోరారు. సంఘ ఇతర నాయకులతో కలిసి ముంబయికి వెళ్లిన ఆయన శుక్రవారం మహారాష్ట్ర రాజ్‌భవన్‌లో గవర్నర్ విద్యాసాగర్‌రావును, వర్షభవన్‌లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌లను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. తగినంత స్థలం కేటాయిస్తే అన్ని వసతులతో అతిథి గృహాన్ని నిర్మిస్తామని తెలిపారు. తమ వినతికి వారిద్దరూ సానుకూలంగా స్పందించారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ముగిసిన బీసీ కమిషన్ బహిరంగ విచారణ

ఈనాడు, హైదరాబాద్: బీసీల్లో కొత్తగా 30 కులాలను చేర్చేందుకు ఆరు రోజులుగా నిర్వహించిన బహిరంగ విచారణ శుక్రవారంతో ముగిసింది. దాదాపు 20 కులాలకు చెందిన ప్రతినిధులు తమను బీసీల్లో చేర్చాలంటూ కమిషన్‌కు విజ్ఞాపనలు అందజేశారు. వీటిని పరిశీలించిన ప్రతినిధులు.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని నిర్ణయించారు. మరో పది కులాల ప్రతినిధులు ఈ విచారణకు హాజరుకాలేకపోయారని బీసీ కమిషన్ గుర్తించింది. వీరంతా ఈ నెల 11 లోగా తమ కార్యాలయానికి వివరాలు అందజేసేందుకు అవకాశముందని తెలిపింది.







ఈనాడు విజేత

sports@eenadu.in

శనివారం జులై 6, 2019

కరీంనగర్ 15

# వచ్చింది జూనియర్ సెరెనా

15 ఏళ్లు.. టెన్నిస్‌పై ఇష్టముంటే అమ్మానాన్నలతో కలిసి గ్రాండ్‌స్లామ్ టోర్నీని చూస్తూ తమ అభిమాన క్రీడాకారులను చప్పట్లతో ఉత్సాహపరిచే వయసది... కానీ ఆ బాలిక ఆ వయసుకు ఏకంగా గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్‌డ్రాలోనే అడుగుపెట్టి దిగ్గజ క్రీడాకారిణిని ఓడించేసింది..! ఆ టెన్నిస్ సంచలనం పేరు కోరి గాఫ్. వింబుల్డన్ ఆడిన పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించడమే కాదు... అయిదుసార్లు ఈ టోర్నీ ఛాంపియన్, అపార అనుభవజ్ఞురాలు వీనస్ విలియమ్స్‌ను ఓడించి ప్రకంపనలు రేపిందీ ఈ అమెరికా చిన్నది. 'కోకో' అనే ముద్దు పేరున్న గాఫ్‌ను మహిళల టెన్నిస్‌లో 'జూనియర్ సెరెనా' అని పిలుచుకుంటున్నారు.



> వింబుల్డన్ ఆడడం కలగా ఉంది. అందులోనూ వీనస్ లాంటి దిగ్గజాన్ని ఓడించడం నమ్మబుద్ధి కావట్లేదు. చాలా ఉద్వేగంగా ఉంది. కానీ ప్రశాంతంగా ఆడాలని నిర్ణయించుకున్నా. ఎవరినైనా ఓడించగల సత్తా నాకుంది.
>
> - కోరి గాఫ్

### కోరి గాఫ్

- ముద్దుపేరు: కోకో (అమెరికా టెన్నిస్ క్రీడాకారిణి కోలీన్ వాండెవె పేరు మీద పెట్టారు)
- స్వస్థలం: అమెరికా, డెల్‌రే బీచ్
- ఆరాధ్యం: సెరెనా విలియమ్స్. ఆమెను చూసి ఏడేళ్లకే టెన్నిస్ మొదలుపెట్టింది.
- పేరొచ్చిందిలా: 13 ఏళ్లకే ఆరెంజ్ బౌల్ టోర్నీ గెలవడం
- ప్రస్తుత ర్యాంకు: 313

కోరి గాఫ్‌ది ఇంకా పాఠశాలకు వెళ్లే వయసే. టెన్నిస్ వల్ల చదువుకు అంతరం కలుగుతుండడంతో ఆన్‌లైన్‌లో పాఠాలు నేర్చుకుంటోంది ఈ అమెరికా బాలిక. గాఫ్‌ది భిన్నమైన నేపథ్యం. నాన్న బాస్కెట్‌బాల్ ఆటగాడు. అమ్మ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్. 2018లో ఐటీఎఫ్ అరంగేట్రం చేసిన గాఫ్.. 13 ఏళ్లకే యుఎస్ ప్రతిష్ఠాత్మక ఆరెంజ్ బౌల్ టోర్నీ గెలిచి సత్తా చాటింది. అదే ఏడాది యుఎస్ ఓపెన్ బాలికల సింగిల్స్ ఫైనల్ చేరి ఈ ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా నిలిచింది. అదే సంవత్సరం ఆమె ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్ టైటిల్‌నూ కైవసం చేసుకుంది. సర్క్యూట్‌లో వరుస విజయాలు సాధిస్తున్న గాఫ్‌కు ఈ ఏడాది వింబుల్డన్ క్వాలిఫైయింగ్‌లో వైల్డ్‌కార్డు లభించింది. తనకన్నా సీనియర్లపై గెలిచి మెయిన్‌డ్రాకు అర్హత సాధించిన ఆమె.. తొలి రౌండ్లో వీనస్‌ను ఇంటికి పంపించింది. తన ఆరాధ్య క్రీడాకారిణి సెరెనా లాగే గాఫ్‌ది కూడా పవర్ గేమ్. కోర్టులో వేగంగా కదలడంతో పాటు మెరుపు సర్వీసులు, శక్తిమంతమైన రిటర్న్‌లు గాఫ్ ప్రత్యేకతలు. వింబుల్డన్ తొలి రౌండ్లో ఆమె కొట్టిన కొన్ని రిటర్న్‌లకు వీనస్ బదులే ఇవ్వలేక పోయింది. రెండో రౌండ్లో మగ్దలీనా రాబ్రికోవా (139వ ర్యాంకు)ను ఓడించి తొలి రౌండ్ విజయం గాలివాటం కాదని చాటింది గాఫ్. ఆమె ఇదే జోరు కొనసాగిస్తే భవిష్యత్ తారగా నిలుస్తుందనేది టెన్నిస్ పండితుల మాట.

# ఆటొక్కటి సరిపోదు బాసూ..

అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ ఆడటమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. భారత్‌లో అయినా.. మరో దేశంలో అయినా.. అది అసాధారణమైన విషయమే. ఆ అవకాశం దక్కించుకోవడం ఒకెత్తయితే.. దాన్ని నిలబెట్టుకోవడం, కెరీర్‌ను దీర్ఘ కాలం పొడిగించుకోవడం మరో ఎత్తు! ప్రతిభ ఎంతున్నా.. పరిస్థితులూ కలిసి రావాలి. అదృష్టమూ తోడవ్వాలి. నడవడికా బాగుండాలి! లేకుంటే కెరీర్ అర్ధంతరంగా ముగిసిపోక తప్పదు! ఇందుకు తాజా ఉదాహరణ మన అంబటి తిరుపతి రాయుడే. ప్రతిభకు లోటు లేని రాయుడు.. కేవలం 61 అంతర్జాతీయ మ్యాచ్‌లతో కెరీర్‌ను ముగించడం ఆశ్చర్యకరం. ఆటేతర కారణాలతో కెరీర్‌ను దెబ్బ తీసుకున్న ఇలాంటి ఆటగాళ్లు క్రికెట్లో చాలామందే ఉన్నారు.

### సచిన్‌తో మొదలుపెట్టి..



80ల్లో భారత దేశవాళీ క్రికెట్లో సచిన్ తెందుల్కర్ పేరు ఎంతగా మార్మోగిందో.. వినోద్ కాంబ్లి పేరు సైతం అంతే చర్చనీయాంశమైంది. సచిన్‌తో కలిసి పాఠశాల క్రికెట్లో సంచలన ప్రదర్శన చేశాడు ఈ ముంబయి ఆటగాడు. మాస్టర్ బాటలో చిన్న వయసులోనే ప్రతిభ చాటుకుని భారత జట్టులోకి వచ్చాడు. కెరీర్ ఆరంభంలో చక్కగా రాణించాడు కూడా. కానీ సచిన్‌లా ఆట మీద పూర్తి స్థాయిలో తన దృష్టిని కేంద్రీకరించలేకపోయాడు. పేద కుటుంబం నుంచి వచ్చిన అతడిని ఉన్నట్టుండి వచ్చిన పేరు ప్రఖ్యాతులు, డబ్బు నిలవనివ్వలేదో ఏమో.. ఆట గాడి తప్పింది. సుదీర్ఘ కాలం భారత జట్టుకు సేలవందిస్తాడనుకుంటే.. కెరీర్ అర్ధంతరంగా ముగించేశాడు. తాను గాడి తప్పుతున్నపుడు సచిన్ తనకు సరిగా మార్గనిర్దేశం చేయలేకపోయాడని ఓ సందర్భంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు కాంబ్లి. అయితే ఆట గాడి తప్పినందుకు కాంబ్లి.. తనను తాను నిందించుకోవాల్సిందే తప్ప ఇంకెవరినీ అనడానికి లేదు. 17 టెస్టులు, 104 వన్డేలతో కాంబ్లి కెరీర్ ముగిసింది.

### అడ్డదారులు తొక్కి తొక్కి..



పాకిస్థాన్ నుంచి వచ్చిన గొప్ప ఫాస్ట్‌బౌలర్లలో మహ్మద్ ఆసిఫ్ ఒకడు. వసీమ్ అక్రమ్, షోయబ్ అక్తర్‌ల నిష్క్రమణ తర్వాత అతనే పాక్ ప్రధాన ఫాస్ట్‌బౌలర్. వేగం, వైవిధ్యం రెండూ ఉన్న ఈ బౌలర్‌కు సరైన నడవడిక లేక కెరీర్ నాశనమైంది. కెరీర్ ఆరంభంలో సంచలన బౌలింగ్ ప్రదర్శన చేసిన అతడిపై ముందు డోపింగ్ మరకలు పడ్డాయి. ఒకటికి రెండుసార్లు డోపీగా తేలి నిషేధం ఎదుర్కొన్నాడు. దాన్నుంచి బయటపడ్డాక ఫిక్సింగ్ ఉచ్చులో చిక్కుకున్నాడు. 2010 నాటి స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో అతను కీలక పాత్రధారిగా తేలడంతో ఏడేళ్ల నిషేధం పడింది. ఆమిర్‌లాగా తనేమీ కుర్రాడు కాదు. తెలియక తప్పు చేయలేదు. అన్నీ తెలిసే అడ్డదారి తొక్కాడు. దీంతో ఎవరికీ అతడిపై కనికరం కలగలేదు. నిషేధం పడే సమయానికే ఆసిఫ్ వయసు 27 ఏళ్లు. దీంతో అతను క్రికెట్లో కొనసాగలేకపోయాడు. గొప్ప ప్రతిభ ఉండి కూడా ఆటను విడిచిపెట్టాల్సి వచ్చింది. ఆసిఫ్ ఆడింది 23 టెస్టులు, 38 వన్డేలు మాత్రమే.

### నిలబెట్టినోడినే సాగనంపేశారు



1992 ప్రపంచకప్ తర్వాత ఇంగ్లాండ్ క్రికెట్ ఎలా ఉనికిని కోల్పోయిందో తెలిసిందే. పుష్కర కాలం పాటు ఆ జట్టు ప్రదర్శన సాధారణం. కానీ కెవిన్ పీటర్సన్ అనే ఆటగాడు వచ్చాక ఇంగ్లిష్ జట్టు ప్రదర్శన మారింది. ప్రపంచ స్థాయి ఆటతో అతను మొత్తం జట్టు ప్రదర్శననే మార్చాడు. బ్యాటింగ్‌లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పి సహచరుల్లోనూ స్ఫూర్తి రగిలించాడు. ఇంగ్లాండ్ తరఫున బ్యాటింగ్‌లో దాదాపుగా అన్ని రికార్డులనూ అతను బద్దలు కొట్టాడు. ఒక దశలో కెప్టెన్సీతోనూ ఆకట్టుకున్నాడు. అయితే పీటర్సన్ స్వతహాగా ఇంగ్లాండ్ వాడు కాదు. దక్షిణాఫ్రికా నుంచి వచ్చాడు. దీంతో ఇంగ్లాండ్ బోర్డు అతడిని మిగతా క్రికెటర్లలా చూడలేదు! దీనికి తోడు కెవిన్ దుందుడుకు స్వభావం కూడా అతడికి చేటు చేసింది. జట్టులోని సహచరులతో గొడవలు జరిగి.. అందరూ కలిసి అతడిని వెలివేసే పరిస్థితి తలెత్తింది. 2013 యాషెస్ సిరీస్‌లో జట్టు తరఫున టాప్‌స్కోరర్‌గా నిలిచినా.. జట్టు ఓటమికి అతడినే బాధ్యుడిని చేశారు! జట్టులో లుకలుకలకు కారణమయ్యాడని ఇంగ్లాండ్ బోర్డు అతడిపై వేటు వేసింది. ఇంకో నాలుగైదేళ్లు అంతర్జాతీయ క్రికెట్ ఆడే సత్తా ఉండి కూడా కెవిన్.. అర్ధంతరంగా కెరీర్‌ను ముగించాల్సి వచ్చింది.

### కలిసిరాని నిర్ణయాలు..




16 ఏళ్ల వయసులోనే విదేశీ గడ్డపై మెరుపులు మెరిపించిన అంబటి రాయుడిని ఇంకో రెండు మూడేళ్లలో భారత జట్టులో చూస్తారని చాలామంది అనుకున్నారు. కానీ ప్రతిభకు లోటు లేని రాయుడు తన 28 ఏట కానీ అంతర్జాతీయ అరంగేట్రం చేయలేకపోయాడు. హైదరాబాద్ క్రికెట్ సంఘంలో రాజకీయాలతో అతను విసిగిపోయాడు. ఐసీఎల్ వైపు చూశాడు. మళ్లీ బీసీసీఐ ఐసీఎల్ క్రికెటర్లందరినీ మన్నించి, నిషేధం ఎత్తేసేలోపు కొన్నేళ్ల విలువైన కెరీర్ కోల్పోయాడు రాయుడు. ఆపై ఐపీఎల్‌లో సత్తా చాటుకుని, దేశవాళీల్లో రాణించి 2013లో కానీ అంతర్జాతీయ క్రికెట్ ఆడలేకపోయాడు. ఐసీఎల్ వైపు అడుగేయకుంటే కనీసం అయిదేళ్ల ముందే రాయుడు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేవాడేమో! ఆలస్యంగా అవకాశం దక్కినప్పటికీ రాయుడు మెరుగైన ప్రదర్శనే చేశాడు. వన్డేల్లో అతడి సగటు 50కి అటు ఇటుగా సాగింది ఓ దశలో. 2017లో జట్టులో చోటు కోల్పోయినా.. దేశవాళీల్లో రాణించి మళ్లీ టీమ్‌ఇండియా తలుపు తట్టాడతను. అయితే ప్రపంచకప్ ముంగిట ఒక సిరీస్‌లో విఫలమవగానే అతడిపై వేటు పడింది. దీంతో రాయుడు రగిలిపోయాడు. ఆ ప్రభావం ఐపీఎల్ ప్రదర్శనపై పడింది. ఆశించిన స్థాయిలో రాణించలేదు. తనకు అవకాశం దక్కని సందర్భంలో రాయుడు కొంచెం సంయమనం పాటిస్తే ధావన్ గాయపడగానే అతడికి అవకాశం దక్కేదేమో! కానీ.. ట్విటర్లో ట్వీట్‌తో చర్చనీయాంశంగా మారాడు. ప్రపంచకప్ మధ్యలో శంకర్ గాయపడినప్పటికీ రాయుడికి అవకాశం రాలేదు. దీంతో ఏకంగా ఆటకే గుడ్‌బై చెప్పేశాడు రాయుడు. ఇలాంటి ప్రతిభావంతుడు 33 ఏళ్లకే ఆటకు టాటా చెప్పేయడం క్రికెట్ అభిమానులకు రుచించని విషయమే.

### వాళ్లకు విరాట్ అవుతాడనుకుంటే..



కెరీర్ ఆరంభంలో ఉమర్ అక్మల్ ఆట చూసి.. మనకు విరాట్ కోహ్లీలా పాకిస్థాన్ జట్టుకు బ్యాటింగ్ మూల స్తంభం అవుతాడని అన్నారు చాలామంది. చూస్తున్నంత సేపూ కళ్లు తిప్పుకోనివ్వకుండా చేసే బ్యాటింగ్ కళ అతడి సొంతం. మొదట్లో చక్కటి బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్లో తన పేరు మార్మోగేలా చేశాడు ఉమర్. కానీ స్వీయ తప్పిదాలు, ప్రతిభావంతుల్ని సరైన దారిలో నడిపించలేని పాకిస్థాన్ క్రికెట్ అవ్యవస్థ అతడి కెరీర్‌ను దెబ్బ తీశాయి. క్రమశిక్షణ రాహిత్యంతో పలుమార్లు బోర్డు హెచ్చరికలు అందుకున్నాడు. సస్పెన్షన్‌కు కూడా గురయ్యాడు. ఎంతకీ అతను మారలేదు. ఆటలోనూ నిలకడ లేదు కానీ.. ప్రధానంగా ఆటేతర కారణాలే ఉమర్ కెరీర్‌ను పాడు చేశాయి. ఇప్పటికీ ఉమర్ వయసు 29 ఏళ్లే. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన అతను.. ఆడింది 17 టెస్టులు, 121 వన్డేలే. 2011 తర్వాత టెస్టుల్లో అవకాశమే దక్కలేదు. వన్డేల్లోకి వస్తున్నాడు పోతున్నాడు. ప్రపంచకప్ ముంగిట అవకాశమిస్తే సద్వినియోగం చేసుకోలేదు. దీంతో ప్రపంచకప్‌కు ఎంపిక చేయలేదు. మళ్లీ అతను పాక్‌కు ఆడటం కష్టమే.

### గొడవలే ముంచాయి



కొంచెం పద్ధతిగా ఉండి, ఆట మీదే దృష్టి పెట్టి ఉంటే.. జెస్సీ రైడర్ అనేవాడు న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్ అయ్యేవాడేమో! క్రిస్ కెయిన్స్ తర్వాత న్యూజిలాండ్‌కు దొరికిన మంచి ఆల్‌రౌండర్‌గా అతడికి గుర్తింపు లభించింది. ఒక దశలో అతను జట్టులో కీలక ఆటగాడిగా ఉన్నాడు. కానీ మద్యానికి బానిసై మైదానం బయట అనేక గొడవల్లో తలదూర్చి ఆటను దెబ్బ తీసుకున్నాడు. నాలుగైదు సార్లు తప్పతాగి గొడవ పడి వార్తల్లోకెక్కాడు. ఒక దశలో అతను మానసిక వైద్య నిపుణుడిని కలిసి కొంత కాలం పాటు చికిత్స కూడా తీసుకున్నాడు. తర్వాత ఆటపై దృష్టిపెట్టి గాడిన పడుతున్న దశలో పాత గొడవల కారణంగా అతడిపై దాడి జరిగింది. ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన రైడర్.. కొంత కాలం మైదానానికి దూరమయ్యాడు. మళ్లీ ఆటపై దృష్టిసారిస్తున్న సమయంలో డోపీగా తేలాడు. దీంతో అతడి కెరీర్‌కు తెరపడిపోయింది. రైడర్ 18 టెస్టులు, 48 వన్డేలు, 22 టీ20లు మాత్రమే ఆడగలిగాడు.

# వీళ్లకు పరుగులు రాసి ఉన్నాయి..!

చిన్నప్పట్నుంచి రగ్బీని ప్రేమించి, దాన్నే కెరీర్‌గా మలుచుకున్న ఆటగాడు.. ఉన్నట్టుండి క్రికెట్ వైపు మళ్లి ఏకంగా దేశం తరఫున ఆడే అవకాశం దక్కించుకున్నాడు. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. కారు ప్రమాదంలో రెండు కాళ్లూ తీవ్రంగా దెబ్బ తిని కొన్ని నెలల పాటు మంచానికి పరిమితమై, మళ్లీ నడవడమే కష్టం అనుకున్న మరో క్రికెటర్.. మళ్లీ క్రికెట్ ఆడుతున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో మెరుపులు మెరిపిస్తున్నాడు. ప్రపంచకప్‌లో అందరి దృష్టినీ ఆకర్షించిన ఆ ఇద్దరు ఆటగాళ్ల కథేంటో తెలుసుకుందాం పదండి.





అలెక్స్ కేరీ.. అనతికాలంలోనే ఆస్ట్రేలియా పరిమిత ఓవర్ల జట్టులో ఉత్తమ వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్‌గా మంచి పేరు కొట్టేశాడు. ప్రపంచకప్ ఆడే అవకాశం దక్కించుకొని బ్యాట్‌తో సత్తాచాటుతున్నాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే అతను ప్రపంచకప్‌లో ఇప్పటి వరకు ఎనిమిది మ్యాచ్‌ల్లో 244 పరుగులతో అదరగొట్టాడు. బ్యాటింగ్ ఆర్డర్లో టాప్-6 స్థానాల తర్వాత ఓ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు నమోదు చేశాడు. అంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ క్లూసెనర్ (1999 ప్రపంచకప్‌లో 241 పరుగులు) పేరు మీద ఉంది. అయితే క్రికెట్‌లో గొప్పగా రాణిస్తోన్న కేరీ.. మొదట ఆస్ట్రేలియా ఫుట్‌బాల్ (రగ్బీ) క్రీడాకారుడు.

**కాదనుకున్నవాడే.. తిరిగి:** చిన్నతనంలో కేరీ రగ్బీ మీద అమితాసక్తి ప్రదర్శించేవాడు. క్రికెట్ ఆడినా కూడా ప్రధాన దృష్టి మాత్రం దానిపైనే. ఎప్పుడూ బంతిని పట్టుకొని పరుగెత్తుతూ మైదానంలో కనిపించేవాడు. దాన్నే కెరీర్‌గా ఎంచుకున్నాడు. పదిహేనేళ్ల వయసులోనే దక్షిణ ఆస్ట్రేలియా జాతీయ ఫుట్‌బాల్ (ఎస్ఏఎన్ఎఫ్ఎల్) లీగ్‌లో గ్లెనెల్గ్ జట్టు తరఫున ఆడే అవకాశం కొట్టేశాడు. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదిగి సత్తాచాటాడు. దక్షిణ ఆస్ట్రేలియా జట్టు తరఫున ఆస్ట్రేలియా ఫుట్‌బాల్ లీగ్ (ఏఎఫ్ఎల్) అండర్-18 ఛాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించాడు. టీఏసీ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో గ్రేటర్ వెస్టర్న్ సిడ్నీ జెయింట్స్ కెప్టెన్‌గా తన జట్టుకు ఫైనల్స్‌కు చేర్చాడు. అయితే ఆ తర్వాతి ఏడాది తన ఫామ్ గొప్పగా లేకపోవడంతో జట్టులో చోటు దక్కలేదు. దీంతో ఆవేదన చెందిన అతను.. అప్పటికే తనకు కొంచెం అనుభవం ఉన్న క్రికెట్లోకి వచ్చాడు. గ్లెనెల్గ్ క్రికెట్ క్లబ్ తరఫున గ్రేడ్ క్రికెట్ ఆడాడు. మొదట టాప్‌ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా క్రికెట్ మొదలెట్టిన అతను తర్వాత వికెట్ కీపర్‌గా మారాడు. 2016- 17 సీజన్లో షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో 500 పరుగులు చేయడంతో పాటు వికెట్‌కీపర్‌గా 59 మందిని ఔట్ చేసి.. ఆ ఘనత సాధించిన నాలుగో క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు. అనంతరం ఆస్ట్రేలియా- ఎ జట్టులో ఎంపికై.. ఆ తర్వాత జాతీయ జట్టులో చోటు దక్కించుకొని ప్రస్తుతం చక్కని ఆటతీరుతో అలరిస్తున్నాడు.





జీవితంలో ఊహించని సంఘటన జరిగితే ఆశ్చర్యపడతారు.. కానీ ఆ సంఘటన.. జీవితాన్నే మలుపు తిప్పితే.. చీకట్లోకి నెట్టేస్తే.. భవిష్యత్‌ను అంధకారం చేసేస్తే.. ఆ విపత్కర పరిణామాలను దాటుకొని విజేతగా నిలిస్తే.. అది విండీస్ క్రికెటర్ నికోలస్ పూరన్ కథ అవుతుంది. లేకపోతే కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అసలు నడవలేని స్థితి నుంచి ప్రస్తుతం ప్రపంచకప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగడమంటే మామూలు విషయం కాదు కదా! పూరన్ విషయంలో అదే జరిగింది.

**పరుగెత్తలేవన్నారు:** పాఠశాల స్థాయి క్రికెట్లో సంచలనాలు సృష్టించిన పూరన్ క్రికెట్లో వేగంగా ఎదిగాడు. 16 ఏళ్లకే అండర్-19 జాతీయ జట్టు తలుపు తట్టాడు. కుర్రాళ్ల ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా మీద కఠిన పరిస్థితుల్లో 143 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్, దేశవాళీ టోర్నీల్లో మెరిశాడు. ఇక జాతీయ జట్టుకు ఆడడమే తరువాయి అనే దశలో అనుకోని ప్రమాదం అతని జీవితాన్ని అతలాకుతలం చేసింది. 2015 జనవరిలో ఓ రోజు క్రికెట్ సాధన పూర్తి చేసుకొని కార్లో ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. రెండు కాళ్లు ఘోరంగా దెబ్బతిన్నాయి. రెండు శస్త్రచికిత్సలు చేసిన వైద్యులు.. పూరన్ కోలుకున్నాక సరిగా పరుగెత్తలేడని చెప్పేశారు. క్రికెట్ ఆడడం కుదరదని తేల్చేశారు. దాంతో అతను నిరాశలో కూరుకుపోయాడు. ఆరు నెలల పాటు చక్రాల కుర్చీకే అంకితమైపోయాడు. నిస్పృహ, నిస్సత్తువలో అతను మునిగిపోయి ఉంటే అక్కడితోనే ఆగిపోయేవాడే. కానీ క్రికెట్‌పై ఉన్న ప్రేమ అతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తిరిగి మైదానంలో అడుగుపెట్టాలనే తపన దెబ్బతిన్న కాళ్లకు పరుగులు నేర్పింది. పట్టుదలతో ప్రయత్నించిన అతను ఏడాదిలోపు మామూలు మనిషిగా మారాడు. తిరిగి బ్యాట్ పట్టాడు. తన ప్రదర్శనను కొనసాగించాడు. 2016లో పాకిస్థాన్‌పై టీ20తో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఈ ఏడాది ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో వన్డేల్లో అడుగుపెట్టాడు. ప్రస్తుత ప్రపంచకప్‌లో పూరన్.. 9 మ్యాచ్‌ల్లో ఓ శతకం సహా 367 పరుగులు చేసి విండీస్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు.

Eenadu epaper

# ఈనాడు సినిమా

## ఇది బన్నీ ఫాల్కన్



సినిమా తారలు చిత్రీకరణల కోసం ఎక్కడెక్కడికో వెళుతుంటారు. వెళ్లిన ప్రతి చోటా వాళ్లు సేద తీరడానికి తగిన వసతులు ఉండవు. అందుకే తారల కోసం నిర్మాతలు సెట్‌లో ప్రత్యేకంగా వ్యానిటీ వ్యాన్లని సమకూర్చుతుంటారు. పని పూర్తవ్వగానే వ్యానిటీ వ్యాన్లలోకి వెళ్లి విశ్రాంతి తీసుకుంటుంటారు తారలు. అయితే ఇటీవల తారలు వాళ్ల స్థాయికి, అభిరుచులకి తగ్గట్టుగా ప్రత్యేకమైన హంగులతో సొంతంగానే వ్యానిటీ వ్యాన్లని సిద్ధం చేయించుకొంటున్నారు. అందుకోసం రూ.కోట్లు ఖర్చు పెడుతుంటారు. వాళ్ల ఇళ్లలో ఎలాంటి సౌకర్యాలుంటాయో, అంతకుమించిన హంగులతో వ్యానిటీ వ్యాన్లు సిద్ధం అవుతున్నాయి. అందులో పడక గదులు మొదలుకొని... మేకప్, విశ్రాంతి, భోజనాల గదుల వరకు అన్నీ ఉంటాయి. తెలుగులో అగ్ర కథానాయకులందరికీ అలాంటి సొంత వాహనాలు ఉన్నాయి. అల్లు అర్జున్ ఇటీవల మరో ఖరీదైన వ్యానిటీ వాహనాన్ని కొని, దాన్ని ప్రత్యేకంగా డిజైన్ చేయించారు. దానికి ఫాల్కన్ అని పేరు పెట్టారు. ఫాల్కన్ అంటే డేగ అని అర్థం.



ఫాల్కన్ అంతర దృశ్యాలు



ఆ వాహనానికి సంబంధించిన ఫొటోల్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకొన్నారు అల్లు అర్జున్. "నేను నా జీవితంలో ప్రతిసారీ పెద్దదే కొన్నాను. ఆ సమయంలో నా మనసులో ఒకటే ఆలోచన. ప్రజలు నాపై చాలా ప్రేమని కురిపించారు. వాళ్ల ప్రేమకున్నశక్తి వల్లే నేను ఇవన్నీ కొనగలుగుతున్నానని. ఆ కృతజ్ఞత నాకు ఎప్పటికీ ఉంటుంది. అందరికీ ధన్యవాదాలు. దీనికి ఫాల్కన్ అనే పేరు పెట్టా" అని ట్వీట్ చేశారు అల్లు అర్జున్. రెడ్డి కస్టమ్స్ అనే సంస్థ ఈ వాహనాన్ని డిజైన్ చేసింది. ఆ సంస్థకి కృతజ్ఞతలు చెప్పారు అల్లు అర్జున్. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ వ్యానిటీ వ్యాన్ ఖరీదు రూ.7 కోట్లు అని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు అల్లు అర్జున్.



అల్లు అర్జున్

## ఎంత మంచోడో!

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. మెహరీన్ కథానాయిక. సుభాష్ గుప్తా, శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాతలు. ఉమేష్ గుప్త సమర్పిస్తున్నారు. శుక్రవారం కల్యాణ్‌రామ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రానికి 'ఎంత మంచి వాడవురా' అనే పేరును నిర్ణయించినట్టు సినిమా వర్గాలు ప్రకటించాయి. దర్శకుడు మాట్లాడుతూ "కథకి తగ్గ పేరు ఇది. కథానాయకుడి పాత్ర ఎలా ఉంటుందో ఈ పేరునిబట్టే అర్థం చేసుకోవచ్చు. 'ఎంత మంచి వాడవురా' అనే మాటని తరచుగా వింటుంటాం. అందుకే ఈ పేరుని చిత్రానికి ఎంపిక చేశాం" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "స్వతహాగా మంచి మనిషి మా హీరో. ఆయన పాత్ర కూడా అలాగే ఉంటుంది. అచ్చమైన తెలుగు పేర్లతో సినిమాలు తీస్తుంటారు సతీష్ వేగేశ్న. పేరు ప్రకటించాక చాలా మంది ఫోన్ చేసి బాగుందంటున్నారు. ఈ నెల 24 నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తాం. హైదరాబాద్, రాజమండ్రి, ఊటీ పరిసర ప్రాంతాల్లో నిరవధికంగా చిత్రీకరణ చేస్తాం" అన్నారు. వి.కె.నరేష్, సుహాసిని, తనికెళ్ల భరణి, పవిత్రా లోకేష్, రాజీవ్ కనకాల, వెన్నెల కిషోర్‌తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రాజ్ తోట, సంగీతం: గోపీసుందర్.



కల్యాణ్‌రామ్

**పంచ్ డైలాగ్**


హనుమంతుడు సాయం మాత్రమే చేస్తాడు.
యుద్ధం చేయాల్సింది రాముడే.
చిత్రం: కల్కి
– పంపినవారు: యు.ప్రదీప్ రెడ్డి, నెల్లూరు

## రామ్ చిత్రంలో నివేద



నివేదా పేతు రాజ్

యువ కథానాయకుడు రామ్ 'ఇస్మార్ట్ శంకర్'కి గుమ్మడికాయ కొట్టేశారు. త్వరలోనే ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇంతలో ఆయన కొత్త చిత్రానికి రంగం సిద్ధమైంది. కిషోర్ తిరుమల దర్శకత్వంలో రామ్ తదుపరి చిత్రం తెరకెక్కబోతోంది. వచ్చే నెలలోనే సినిమాని సెట్స్‌పైకి తీసుకెళతారు. 'నేను శైలజ', 'ఉన్నది ఒకటే జిందగీ' చిత్రాల తర్వాత రామ్ - కిషోర్ తిరుమల కలిసి చేస్తున్న చిత్రమిది. ఇందులో నివేదా పేతురాజ్ ఒక కీలకమైన పాత్రలో నటించనున్నట్టు సమాచారం. నివేదా ఇదివరకు కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన 'చిత్రలహరి'లో నటించింది. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన 'బ్రోచేవారెవరురా'లోనూ ఆమె సందడి చేసింది. ప్రస్తుతం అల్లు అర్జున్ చిత్రంలోనూ నటిస్తోంది. రామ్ చిత్రంలో నివేదాతో పాటు మరో ప్రముఖ కథానాయిక కూడా ఉంటుందని సమాచారం.



రామ్

## వాస్తవ సంఘటనలతో 'దమ్కీ'



త్రిషాలాషా, రజిత్

రజిత్, త్రిషాలాషా జంటగా ఏనుగంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దమ్కీ'. సత్యనారాయణ సుంకర నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. నేర నేపథ్యంతో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా అందరినీ మెప్పిస్తుంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "కొత్తదనంతో కూడిన చిత్రమిది. కథ, కథనాలు ఆకట్టుకుంటాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు. అజయ్, శ్రవణ్, శ్రీనివాసరెడ్డి, పృథ్వీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: దీపక్ భగవంత్, సంగీతం: ఆనంద్.

## పల్లెటూరి ప్రేమ కథ



మంజునాథ్, తనిష్క తివారి

మంజునాథ్ కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి ప్రేమ కథ'. తనిష్క తివారి కథానాయిక. లక్ష్మీదేవి, మహేంద్రనాథ్ నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "వాస్తవ పరిస్థితుల నేపథ్యంలో తెరకెక్కించిన ఓ పల్లెటూరి ప్రేమకథ ఇది. వాటర్ ట్యాంకర్ నడుపుకునే డ్రైవర్‌కీ, నీళ్ల పట్టుకోవడానికి వచ్చిన అమ్మాయికీ మధ్య ప్రేమ పుడితే పుడితే, ఆ ప్రేమని వాళ్లెలా గెలిపించుకున్నారన్నది ఆసక్తికరం. జయ సూర్య అందించిన స్వరాలు ఆకట్టుకుంటాయ"న్నారు.



'కబీర్ సింగ్'



'భారత్'



'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్'

ప్రథమార్ధంలో బాలీవుడ్ చిత్రాల జోరు

# ఆరు నెలలు... ఆనందాల హరివిల్లు

కాలెండరులో ఆరు పేజీలు మారిపోయాయి. ఈ ఆరు నెలల్లో మూడు హిట్లు ఆరు సూపర్ హిట్లు అన్నట్లుగా బాలీవుడ్‌లో సందడి నెలకొంది. బాక్సాఫీసు వద్ద కొన్ని చిన్న చిత్రాలు చిచ్చరపిడుగుల్లా చెలరేగిపోతే, మరికొన్ని అగ్ర కథానాయకుల చిత్రాలు పరిశ్రమకు ఆనందాన్ని పంచాయి. ఆ విశేషాలు ఏంటో చూసేయండి.

జనవరిలో వచ్చిన 'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్' సంచలనం సృష్టించింది. సోలో హీరోగా పెద్ద గుర్తింపు లేని విక్కీ కౌషల్ నటించడం, దర్శకుడు ఆదిత్య ధర్‌కు తొలి చిత్రం కావడంతో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలయ్యింది. అయితే బాక్సాఫీసు వద్ద ఆశ్చర్యకరమైన వసూళ్లు రాబట్టింది. మెరుపు దాడుల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం సుమారు రూ.245 కోట్లు వసూలు చేసి పరిశ్రమ వర్గాల్లో జోష్ నింపింది. అదే నెలలో వచ్చిన 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' కూడా మంచి విజయం సాధించింది. ఝాన్సీ లక్ష్మీ బాయి జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించింది. తెలుగు దర్శకుడు క్రిష్‌తో కలిసి కంగన తెరకెక్కించిన ఈ చిత్రం హిందీతో పాటు తెలుగు, తమిళంలో విడుదలై సుమారు రూ.118 కోట్లు వసూళ్లు అందుకుంది.

ఫిబ్రవరిలో వచ్చిన 'గల్లీబాయ్' జోరు చూపించింది. ర్యాప్ గాయకుల నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్, ఆలియా భట్ జంటగా నటించారు. జోయా అక్తర్ తెరకెక్కించిన ఈ చిత్రం రూ.140 కోట్ల వసూళ్లతో విజయాన్నందుకుంది. అదే నెలలో వచ్చిన 'టోటల్ ధమాల్' ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించి కాసులు కురిపించింది. అజయ్ దేవగణ్, అనిల్ కపూర్, మాధురీ దీక్షిత్ తదితరులు నటించిన ఈ మల్టీస్టారర్ చిత్రం సుమారు రూ.155 కోట్లు ఖాతాలో వేసుకుంది.

'లుకా చుప్పి', 'బద్లా', 'కేసరి' చిత్రాలతో మార్చి నెల సందడిగా సాగింది. కార్తిక్ ఆర్యన్, కృతి సనన్ నటించిన రొమాంటిక్ కామెడీ 'లుకా చుప్పి' యువ ప్రేక్షకులను ఆకట్టుకుని దాదాపు రూ.95 కోట్లు వసూళ్లు అందుకుంది. ప్రతీకారం నేపథ్యంలో అమితాబ్ బచ్చన్, తాప్సి నటించిన 'బద్లా' మెప్పించింది. స్పానిష్ చిత్రం 'ది ఇన్‌విజిబుల్ గెస్ట్' ఆధారంగా రూపొందిన ఈ చిత్రం రూ.88 కోట్లు వసూళ్లతో విజయ తీరాలకు చేరింది. చారిత్రక సారాగఢి యుద్ధం నేపథ్యంలో అక్షయ్ కుమార్ నటించిన 'కేసరి' విజయ బావుటా ఎగరేసింది. సుమారు రూ.155 కోట్లు అందుకుంది.

ఏప్రిల్ మాత్రం కాస్త నిరాశపర్చిందనే చెప్పాలి. ఈ నెలలో భారీ అంచనాలతో వచ్చిన 'కళంక్' చతికిలపడింది. వరుణ్ ధావన్, ఆలియా భట్, సంజయ్ దత్, మాధురీ దీక్షిత్, సోనాక్షి సిన్హా, ఆదిత్య రాయ్ కపూర్ లాంటి ప్రముఖ తారాగణం ప్రధాన పాత్రల్లో నటించగా కరణ్ జోహార్ నిర్మించిన ఈ చిత్రం మెప్పించలేకపోయింది. జాన్ అబ్రహమ్ నటించిన 'రోమియో అక్బర్ వాల్టర్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. అయితే ఈ నెలలో విజయం లేదనే లోటును హాలీవుడ్ చిత్రం 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' తీర్చేసింది. ఈ చిత్రం ఇండియాలోనే రూ.370 కోట్లు కొల్లగొట్టడం విశేషం.

విజయవంతమైన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'కు సీక్వెల్‌గా తెరకెక్కిన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' మేలో విడుదలైంది. టైగర్ ష్రాఫ్‌తో పాటు కొత్త నాయికలు అనన్య పాండే, తారా సుతారియా నటించిన ఈ చిత్రం ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. అదే నెలలో వచ్చిన 'దే దే ప్యార్ దే'తో అజయ్ దేవగణ్ ఈ ఏడాది రెండో విజయాన్ని అందుకున్నారు. ఆయన సరసన రకుల్ ప్రీత్ సింగ్, టబు నటించిన ఈ చిత్రం నవ్వులు పూయించి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. అర్జున్ కపూర్ నటించిన 'ఇండియాస్ మోస్ట్ వాంటెడ్', ప్రధాని నరేంద్ర మోదీ జీవితం ఆధారంగా వివేక్ ఒబెరాయ్ నటించిన 'పీఎం నరేంద్ర మోదీ' ప్రభావం చూపించలేకపోయాయి. హాలీవుడ్ చిత్రం 'అలాద్దీన్' రూ.53 కోట్లకు పైగా వసూలు చేసింది.

జూన్‌లో 'భారత్' రాకతో మళ్లీ బాక్సాఫీసు సందడిగా మారింది. సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ జంటగా అలీ అబ్బాస్ జాఫర్ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విజయం సాధించింది. కొరియన్ చిత్రం 'ఓడ్ టు మై ఫాదర్'కు రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రం రూ.210 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అదే నెలలో వచ్చిన 'కబీర్ సింగ్' తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుంది. 'అర్జున్ రెడ్డి'కి రీమేక్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో షాహిద్ కపూర్, కియారా అద్వాణీ నటించారు. మాతృకను తెరకెక్కించిన సందీప్ రెడ్డి వంగాయే రీమేక్‌కూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం రూ.200 కోట్లకు పైగా వసూళ్లందుకుని ఇంకా జోరు కొనసాగిస్తోంది. వీటితో పాటు 'ఆర్టికల్ 15', 'తాష్కెంట్ ఫైల్స్' లాంటి చిత్రాలు వసూళ్లతో సంబంధం లేకుండా ప్రశంసలు అందుకున్నాయి.

### రూ.1850 కోట్ల వ్యాపారం

ఈ ఏడాది ప్రథమార్ధంలో సుమారు 50 బాలీవుడ్ చిత్రాలు విడుదలయ్యాయి. అందులో మూడు చిత్రాలు రూ.200 కోట్ల మార్కు అందుకున్నాయి. వాటితో కలిపి 8 చిత్రాలు రూ.100 కోట్లకు పైగా వసూళ్లు అందుకున్నాయి. మొత్తంగా ఈ ఆరు నెలల్లో బాక్సాఫీసు వద్ద రూ.1850 కోట్లకు పైగా వ్యాపారం జరిగిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. ద్వితీయార్ధంలో దీపావళి, క్రిస్మస్ లాంటి పండగ సీజన్లు ఉండటంతో పాటు అగ్ర కథానాయకుల చిత్రాలు మరిన్ని రాబోతున్నాయి. దీంతో ద్వితీయార్ధంలో మరో రూ.2000 కోట్లు రావచ్చని అంచనా వేస్తున్నారు. అదే నిజమైతే మొత్తం రూ.3850 కోట్లతో గతేడాది వ్యాపారాన్ని (రూ.3500 కోట్లు) అధిగమించి బాలీవుడ్ చరిత్రలోనే అత్యధిక వ్యాపారం జరిగిన సంవత్సరంగా 2019 నిలవనుంది.



'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'



'టోటల్ ధమాల్'



'గల్లీబాయ్'



'కేసరి'



'లుకా చుప్పి'



'బద్లా'



## కళ్లజోడులో పాటలు..

స్టైల్‌గా సన్ గ్లాసెస్ పెట్టుకోవడం కొత్తేం కాదు. కానీ, అదే కళ్లజోడు వాయిస్ కమాండ్స్‌కి స్పందిస్తే.. పాటల్ని ప్లే చేస్తే.. ఫోన్ కాల్స్‌ని సపోర్టు చేస్తే.. బోస్ కంపెనీ ప్రవేశపెట్టిన నల్ల కళ్లజోళ్లు ఇవన్నీ చేస్తాయి. ఇవి సాధారణంగా ధరించే వాటిలా కాదు. ముఖానికి ట్రెండీ లుక్ ఇవ్వడంతో పాటు మ్యూజిక్ ట్రాక్స్‌ని వినిపిస్తుంది. అందుకు తగినట్టుగా ఫ్రేములో బిల్ట్‌ఇన్‌గా స్పీకర్లను ఏర్పాటు చేశారు. మైక్రోఫోన్‌తో ఫోన్ కాల్స్ మాట్లాడొచ్చు. వాయిస్ కమాండ్స్‌తో ఫోన్ కాల్ చేయొచ్చు. రెండు వేరియంట్స్‌లో వీటిని డిజైన్ చేశారు. బోస్ కనెక్ట్ యాప్‌తో మరింత అనువుగా ఈ స్మార్ట్ కళ్ల అద్దాల్ని వాడుకోవచ్చు.

● ధర ఎంతో తెలుసా..? రూ. 21,900

మార్కెట్ షేర్

# వయసు 20 రూ. కోట్ల డీల్స్



**హైదరాబాద్ దోమల్‌గూడలోని 'సావర్ట్' ఆఫీసు.. లోపలికి వెళ్తూనే పసుపుపచ్చ టీ షర్ట్, షార్ట్, సాధారణ చెప్పులు వేసుకున్న ఓ కుర్రాడు హడావిడిగా తిరుగుతున్నాడు. ఉద్యోగుల సందేహాలు తీరుస్తూ.. ల్యాపీలో పని చేసుకుంటున్నాడు. ఆ ఇరవయ్యేళ్ల కుర్రాడి పేరు సంకర్ష్ చందా. ఈ పిన్నవయస్కుడే 'సావర్ట్' అనే స్టాక్ మార్కెట్ అడ్వైజరీ కంపెనీ సీఈఓ, ఫౌండర్! అందరూ సాఫ్ట్‌వేరు, ఇతర స్మార్ట్ రూట్స్‌లో వెళ్తోంటే..**

**ఈ షేర్ మార్కెట్ లోకంలోకి ఎందుకొచ్చారని అడిగితే... సంకర్ష్ చందా చెప్పాడిలా..**

### ఏడో తరగతిలోనే...



నా వయసు ఇప్పుడు ఇరవయ్యేళ్లు. చిన్నప్పటి నుంచి పుస్తకాలంటే ఇష్టం. అలా బాల్యంలోనే.. ఆస్ట్రోఫిజిక్స్, నానోటెక్నాలజీలను కుతూహలంతో చదివా. దీంతోపాటు ఇంగ్లిష్ కథలూ, నవలలూ చదివే అలవాటుంది. అలా ఏడోతరగతిలో ఉండగా స్టాక్‌మార్కెట్‌పై బెంజమిన్ గ్రాహం రాసిన ఓ ఆర్టికల్‌ను చదివా. బాగా నచ్చింది. మార్కెట్‌లో కొనటమేంటీ.. అమ్మటమేంటీ..? అనే ఆసక్తి నాలో పెరిగింది. వెంటనే మా అక్క దగ్గర ఉండే డీమ్యాట్ అకౌంట్ తీసుకున్నా. రాత్రికి రాత్రే స్టాక్స్‌లో డబ్బులు వస్తాయనే ఆశ ఉండేదప్పుడు. ఖర్చులకు నాన్న ఇచ్చే వెయ్యి రూపాయలనీ.., హుండీలోని డబ్బులను స్టాక్స్‌లో పెట్టా. ఒక్కో షేర్ పదిరూపాయలుంటే.. వెయ్యిరూపాయలకి ఏకంగా వంద షేర్లు వస్తాయనే ఆలోచన ఉండేది. దీంతో మార్కెట్‌లో చీపెస్ట్ కంపెనీలపై పెట్టుబడి పెట్టా. రెండునెలల్లో అంతా పోయింది. బాధపడ్డా. ఇది కాదు.. దీంట్లో ఏదో ఉందనుకున్నా. మెల్లగా మార్కెట్‌ను ఇష్టంతో స్టడీచేశా. మొదట ఓ సంస్థ సంవత్సర రిపోర్టును తీసి.. దాని పదేళ్ల చరిత్రనూ చూశా. నాకప్పుడో విషయం అర్థమైంది.. 'మార్కెట్ మనకంటే పెద్దది.. మనకంటే స్మార్ట్.. మనకంటే ఫాస్ట్' అని. ముందు మార్కెట్‌కి రెస్పెక్ట్ ఇవ్వాలనే విషయమర్థమైంది. నాకేం తెలియదో నాకు అర్థమయింది. పట్టినపట్టు విడవకుండా అలా స్టాక్స్‌లో ఓనమాలు నేర్చుకున్నా. నా అనుభవాలతోనే.. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 'ఫైనాన్షియల్ నిర్వాణ' అనే పేరుతో ఓ పుస్తకం రాసి ప్రచురించా. ఆ చిన్నబుక్ మార్కెట్‌లోకి రావాలనుకునే బిగినర్స్‌కి బాగా ఉపయోగపడుతుంది.

**సావర్ట్ అంటే.. సేవ్‌ఆర్ట్ అని అర్థం! ఇదో వెల్త్ అడ్వయిజరీ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్. షేర్‌మార్కెట్‌లో స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్, బాండ్స్‌లో ఎలా పెట్టుబడి పెట్టాలో.. మేం పరిశోధించి.. సలహాలిస్తాం. మన దేశంలోని 29 రాష్ట్రాల్లోని కొందరు వ్యక్తులు, కొన్ని ప్రయివేట్ కంపెనీలు.. దీంతోపాటు 25 దేశాల్లోని ఇతర కంపెనీలు మా సలహాలు అందుకుంటున్నాయి. మీరు వదిరూపాయలు స్టాక్‌లో పెట్టి మంచి రిటర్నులు కావాలంటే.. మేం సలహా ఇస్తాం. అందుకు పర్సెంటేజీ తీసుకుంటాం. లాభాల్లో మూడుశాతం తీసుకుంటాం. అలాగని డీమ్యాట్ అకౌంట్ తీయించి పనిచేసే స్టాక్ బ్రోకర్స్ కాదు మేం. ఐసీఐసీఐ సెక్యూరిటీ, అప్‌స్టాక్స్ లాంటి పేరున్న బ్రోకర్స్‌తో మా భాగస్వామ్యముంది. స్టాక్‌లో ఏ సమయంలో ఇన్వెస్ట్ చేయాలి, ఎంత చేయాలనే దానిమీదే మా ఫోకస్. 2017 మేలో రిజిస్టర్ అయింది మా కంపెనీ. జనంలోకి వచ్చింది 2018 జూన్‌లో. ఈ సమయంలో వెబ్‌సైట్, అల్గారిథమ్స్, ఫండింగ్, పరిశోధన అన్నీ చేసుకున్నా.**

**మాకో వెబ్‌సైట్, యాండ్రాయిడ్ యాప్ ఉంది (ఐఓయస్ త్వరలో లాంచ్ చేస్తాం). హైదరాబాద్‌లో రెండు ఆఫీసులున్నాయి. వరంగల్, పుణెలోనూ మా బ్రాంచీలున్నాయి. త్వరలోనే విజయవాడ, వైజాగ్.. లాంటి చోట్ల ఫ్రాంచైజీలిస్తాం. ప్రస్తుతం నేను బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నా. నేనో యంగెస్ట్ స్టాక్ అడ్వయిజరీ సీఈఓని. వినియోగదారుల సంతృప్తే నా సక్సెస్‌గా భావిస్తా. ఒక వ్యక్తి.. తన పిల్లల చదువులు, వాళ్ల పెళ్లిళ్లకు అప్పు తీసుకోకుండా.. స్టాక్‌లో పెట్టింది ఉపయోగపడితే.. నాకంతకంటే ఆనందం ఏముంటుంది?. నేను యువతకి చెప్పేది ఒకటే సక్సెస్‌కి రెసిపీ, ఇంగ్రిడియెంట్స్ ఏమీ ఉండవు. సక్సెస్ అయినవాళ్లు వంద చేశామని చెబుతారు. అవేమీ వినకండి. మీకు ఇష్టమున్న పని చేయటమే మీ సక్సెస్!**

### సంవత్సరం పాటు పరిశోధించా!

అప్పటికే నేను..నానోటెక్నాలజీ, ఆస్ట్రోఫిజిక్స్ చదివా, సివిల్స్ రాద్దామనుకున్నా. అయితే వాటి పరిధులు ఎక్కువని తెలిసింది. దీంతో వాటికి దూరమయ్యా. స్టాక్స్‌లో ఏదో బ్యూటీ కనిపించింది. కిక్‌గా ఫీలయ్యా. దీంతో దీనికథేంటో చూద్దామని అడుగులేశా. ఇంటర్ రెండోసంవత్సరమంతా స్టాక్ పుస్తకాలు చదువుతూ, ల్యాపీతోనే బిజీగా ఉన్నా. ఎన్నో ప్రశ్నలు వేసుకుని వాటికి సమాధానాలు కనుగొన్నా. అకడమిక్‌లో నేను నంబర్‌వన్ కాబట్టి ఇంట్లోవాళ్లు నన్ను ఇబ్బంది పెట్టలేదు. జాగ్రత్తగా ఉండమన్నారంతే. స్టాక్ మార్కెట్‌కి సంబంధించిన పుస్తకాలే నాకు మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఓ కంపెనీ గురించి రిసెర్చ్, ట్రాకింగ్ చేయటమంటే ఓ మనిషిని అర్థం చేసుకున్నట్లే. ఓ కంపెనీ చరిత్ర, ఐడియాలజీ, ఎథిక్స్, యుటిలిటీ, విజన్.. ఇలా అన్నీ ఆలోచించాలి. ఆయా వ్యక్తుల విలువలే సంస్థల్లో కనిపిస్తాయి. వాటిని పట్టాలంతే. తెలీకుండా చిన్న సంస్థలు, గవర్నెన్స్, ఎథిక్స్ లేని కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తే డబ్బులు పోతాయి.

### కుటుంబ నేపథ్యం...

నాన్న పేరు చంద్రశేఖర్. డేటా ప్రాసెసింగ్ బిజినెస్ చేశారు. ఇప్పుడు కార్యాలయ వ్యవహారాలు చూస్తుంటారు. అమ్మ పేరు సంగీత. న్యూట్రిషన్, సైకాలజీ చదివింది. మా బ్లాగ్‌కి కంటెంట్ మా అమ్మే రాస్తుంది. మా అక్క సీఏ చేసింది. కెనడాలో ఉద్యోగం చేస్తోందిప్పుడు. నా ఐడియాలు, అల్గారిథమ్స్, విజన్‌ను నమ్మి.. ఎనిమిది మంది మాకు 1.3 కోట్లు ఫండ్ ఇచ్చారు. నాకు డౌట్ వస్తే గురువు అజయ్ బాత్రాను అడుగుతా. ఆయన మాకు ఫండ్ ఇచ్చారు. అజీమ్ ప్రేమ్‌జీకి సన్నిహితుడు. నాకు కనీసం రోజుకి మూడు డౌట్స్ వస్తాయి. ఇలా రెండేళ్లనుంచీ మా గురువునే అడిగి తెల్సుకుంటున్నా. ఇప్పుడిప్పుడే సావర్ట్ సంస్థ అభివృద్ధి చెందుతోంది. ప్రతి రూపాయి అవసరమే. నేను జీతం తీసుకోను. నాకు ఎలాంటి ఖర్చులుండవు. అమ్మానాన్న చూసుకుంటారు. ఎలక్ట్రిసిటీ నుంచి స్టాక్ వరకూ అన్నిరకాల పనులు నేనే చేసుకుంటా. మా ఆఫీసులో అందరూ సమానమే.. పగలు ఆఫీసుకే పరిమితమవుతా. ఒక్కోసారి ఇంటికి కూడా వెళ్లకుండా రాత్రిపూట పనిలో పడి ఆఫీసులోనే ఉంటుంటా. నాకు క్రికెట్ ఇష్టం. పియానో ప్లే చేస్తాను. వీకెండ్స్ సినిమాలు చూస్తా. మేం ఇతర దేశాల్లోకి వెళ్తున్నాం. కొత్త లైసెన్స్‌లు తీసుకుంటున్నాం. ఫ్రాంచైజీలకు అప్లయ్ చేస్తున్నాం. ఈ ఏడాది చివరికి రూ. 150 కోట్లు ఇన్వెస్ట్ చేయించాలనేది నా ముందున్న చిన్న టార్గెట్.

### స్టాక్ మార్కెట్ అనేది ఓ సైన్సు!

అందరూ సంస్థ ఎంత వృద్ధిలో ఉంది అనేది చూస్తారేతప్ప ఆ సంస్థ చరిత్రను చూడరు. ఎమోషన్‌గా డబ్బులు పెడతారు. పోగొట్టుకుంటారు. వెంటనే.. 'మార్కెట్ గ్యాంబ్లింగ్' అంటూ తిడతారు. అర్థంకానపుడు ఏదయినా గ్యాంబ్లింగ్‌గానే కనపడుతుంది. చాలా మంది స్టాక్స్‌లో పెట్టిన మరుసటి రోజునుంచే.. ఎంత లాభమని చెక్ చేస్తారు. టెన్షన్ ఎందుకు పడతారు? ఏదో టీవీలో కనిపిస్తుందని అందరిలాగే మీరూ స్టాక్స్ చెక్ చేసుకుంటుంటారు. మార్కెట్ అనేది ఎమోషనలీ ఇంటిమేటింగ్. ఐదురూపాయలు కాస్త పదిరూపాయలయితే సంతోషపడతాం.. పదిహేను రూపాయలయితే ఐదు రూపాయలు తీసుకుని.. మిగతా పదిరూపాయలతో గేమ్ ఆడదామనిపిస్తుంది. అందుకే స్టాక్స్ ఊరికూరికే చెక్ చేయకండి. టీవీలు చూడకండి. న్యూస్‌పేపర్స్ చదవండి. అయితే ప్రభావం కావొద్దు. మంచి కంపెనీలో పెట్టుబడి పెట్టి కొన్నేళ్లలా వదిలేయండి. 'అవగాహన లేక చేసేది రిస్క్.. అవగాహనతో చేసేది రిస్క్ కాద'ంటారు అపర కుబేరుడు వారన్ బఫెట్. రిస్క్ లేకుండా ఉండాలంటే కచ్చితంగా మార్కెట్‌పై పరిశోధన చేయాల్సిందే. పరిగెత్తే గుర్రం మీద డబ్బుకాయటం అదృష్టం. మీరు స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగూ అలాంటిదే. గ్యాంబ్లింగ్‌గానే తోస్తుంది. ట్రేడింగ్ కాకుండా మీరు పక్కాగా ఇన్వెస్ట్ చేసి కొన్ని సంస్థల షేర్లుకొని, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టి వదిలేస్తే మంచి లాభాలు వస్తాయి. ఇదో సైన్సులాంటిదే..

– రాళ్లపల్లి రాజావలి

మనసులో మాట

# ప్రయత్నిద్దాం యార్

శ్రద్ధ... వాళ్ల అమ్మానాన్న ఎందుకు ఆ పేరు పెట్టారో తెలియదు గానీ... నా శ్రద్ధంతా ఎప్పుడూ తనమీదే ఉండేది. తనంటే నాకు పదో తరగతి నుంచి ఇష్టం. ఒకసారి తన నోట్‌బుక్ తీసుకొని ఐ లవ్ యూ అని రాసిచ్చాను. తను నన్ను పిలిచి... 'నాకు ఇలాంటివి ఇష్టం ఉండదు. ముందు బాగా చదువుకో' అని చెప్పింది. నా మీద కోప్పడలేదు. వాళ్లింట్లో చెప్పి గొడవ చేయలేదు. నేను పదికి పది పాయింట్లు తెచ్చుకొని పాసయ్యాను. మళ్లీ ప్రపోజ్ చేశాను. 'నువ్వంటే నాకిష్టమే... అయితే అది ప్రేమ కాదు' అంది. ఇంటర్‌లో నన్ను విజయవాడ హాస్టల్లో చేర్చారు. రెండేళ్లు... ఎప్పుడు అయిపోతాయా? అని ఎదురుచూశాను. దసరాకు, సంక్రాంతికి ఇచ్చిన సెలవుల్లో తన ఇంటిచుట్టూ ఎన్నిసార్లు తిరిగానో! కానీ తను ఎప్పుడో ఒక్కసారి కన్పించేది. నవ్వేది. ఆ నవ్వే నాకు మళ్లీ సెలవులు వచ్చేదాక ఊపిరి. అలా ఇంటర్ అయిపోయింది. ఈ సారి మా క్లాస్‌మేట్ సృజన ద్వారా తనకు విషయం చెప్పించాను. తను ఒప్పుకోలేదు. నాకు మంచి కాలేజీలో ఇంజినీరింగ్ సీటు వచ్చింది. వెళ్లక తప్పలేదు. నేను చెన్నై వెళుతూ తనకు కన్పించాను. తను నన్ను చూసి కంగ్రాట్స్ అని చేయి కలిపింది. ఆ స్పర్శ నన్ను నాలుగేళ్లు బతికించింది. చెన్నైలో ఎంతో మంది అమ్మాయిలు... ఎవరి మీద నాకు ప్రేమ కలగలేదు. నా ఊహల్లో ఎప్పుడూ శ్రద్ధే ఉండేది. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్... ఇలా అన్నింట్లో తనని రోజూ పలకరించేవాడ్ని. మా మెసేజ్‌లు, మాటలు, చర్చలు అన్నింటికి సోషల్ మీడియానే వేదికయ్యేది. ఊరికి వచ్చినప్పుడు తను కన్పిస్తే మెరిసిపోయే నా కళ్లు ఇంకెప్పుడూ అంత ఉత్సాహంతో ఉండవు. నేను ఎప్పుడు ప్రేమ గురించి మాట్లాడినా... తను చిరు కోపం ప్రదర్శించేది. నేను ఆగిపోయేవాడ్ని. చివరికి ఇంజినీరింగ్ ఫైనలియర్లో క్యాంపస్ సెలెక్షన్లలో విప్రోలో ఉద్యోగం వచ్చింది. ఫైనల్ సెమిస్టర్‌కు ముందు గట్టిగా నా మనసులో మాట చెప్పాలని నిర్ణయించుకున్నా. తనుంటున్న హైదరాబాద్‌కు వచ్చాను.



'నిన్ను కలవాల'ని వాట్సప్ మెసేజ్ పంపాను. 'ఏంటి? సడన్‌గా' అంది.. 'చాలా ముఖ్యమైన విషయం నీతో మాట్లాడాలి' అన్నా. ఇద్దరం శిల్పారామంలో కలుసుకున్నాం. దాదాపు రెండు గంటలు... ఇంత సేపు ఎవరూ ఏ అమ్మాయికి ప్రపోజ్ చేసి ఉండరు. చిన్నప్పటి నుంచి తనమీద నాకు కలిగిన ఫీలింగ్స్ అన్నీ చెప్పి... 'ఐ లవ్ యూ' చెప్పాను. తను నా కళ్లలోకి చూసింది... 'మా ఇంట్లో వచ్చి అడుగు పెళ్లి చేసుకుందాం' అంది. 'మరి ఎందుకు ఇన్ని రోజులు నా ప్రేమను అంగీకరించలేదు?' అన్నాను. 'మొదట నీ మీద నాకు ప్రేమ లేదు. తర్వాత, తర్వాత అది ప్రేమగా మారింది. అయినా ఈ ప్రేమలో పడి... మనం సమయం వృథా చేసుకోకూడదని' అంది. తన స్పష్టత, దూరదృష్టి నన్ను మరింతగా తన ప్రేమలో ముంచేశాయి. నేను ముందు విషయం మా ఇంట్లో చెప్పాను. మా వాళ్లు ఒప్పుకోలేదు. వాళ్లది వేరే కులం వద్దన్నారు. శ్రద్ధ వాళ్లింటికి వెళ్లి... వాళ్ల నాన్నతో మాట్లాడాను. ఆయనా కుదరదన్నారు. వాళ్ల అమ్మ మా ప్రేమ పట్ల కాస్త సానుకూలంగా ఉన్నా... మిగతా ఎవ్వరూ అంగీకరించలేదు. కారణం ఒక్కటే కులం. మళ్లీ, మళ్లీ ఇద్దరి ఇళ్లలోనూ చెప్పాం. వాళ్ల మనసులు కరగలేదు. తనకి వేరే పెళ్లి ఏర్పాట్లు చేశారు. 'ఇలాగే ఉండిపోతాను గానీ నేను వేరే ఎవర్నీ పెళ్లి చేసుకోను' అని శ్రద్ధ వాళ్లింట్లో బల్లగుద్ది మరీ చెప్పింది. తను ముంబయిలో జాబ్ చేస్తోంది. నేను చెన్నైలోనే ఉద్యోగం చేసుకుంటున్నా. ఇలా మా ఇళ్లలో మా ప్రేమ గురించి తెలిసి... ఇప్పటికి ఏడు సంవత్సరాలైంది. అయినా మేం ఎక్కడా విసుగు చెందలేదు. నిరాశ పడలేదు. ఇంకా ఇంట్లో వాళ్లను ఒప్పించడానికి ప్రయత్నిస్తున్నాం. వాళ్లు ఒప్పుకొనే దాకా ప్రయత్నిస్తూనే ఉంటాం. ఎందుకు ఇదంతా చెబుతున్నానంటే... ఇంట్లో ఒప్పుకోలేదని, చెబితే ఒప్పుకోరని ప్రేమికులు కొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు. దయచేసి అలా చేయకండి. మనం చనిపోతే మన ప్రేమ పెద్దలకు ఎలా తెలుస్తుంది? కొన్నిరోజులు ఏడ్చి మరిచిపోతారు? మన ప్రేమ వాళ్లకు తెలియాలంటే... మనం ప్రదర్శించాలి. మనం ప్రదర్శించాలంటే బతికుండాలి. అందుకే గట్టిగా ఉండండి. పెద్దలు ఒప్పుకొనేదాక ప్రయత్నించండి.

- శ్రద్ధా - నీరజ్

ఐకాన్ బాక్స్

# అన్‌స్టాపబుల్ అనన్య!



బోర్ అనిపిస్తే.. హెడ్‌సెట్ తీస్తారు.. రోటీన్‌గా వినేవి కాకుండా పాశ్చాత్య ట్రాక్స్‌పై పడతారు. మిలీనియల్స్ అంతే మరి. అయితే, ఇంగ్లిష్‌లో ట్రాక్స్ అంటే డెమి లొవాటోనో.. మారెన్ మొర్రిస్.. జెస్సిన్ మాత్రమే కాదు. దేశీ వాయిస్‌కీ కనెక్ట్ అవుతున్నారు. ఎవరిదా వాయిస్? ఇంకెవరూ 23 ఏళ్ల అనన్య బిర్లా. అదిరే లుక్స్.. ఆకట్టుకునే వాయిస్‌తో 'అన్‌స్టాపబుల్'గా టీన్స్ తన మ్యూజిక్ ట్రాక్స్‌తో కట్టి పడేస్తోంది. కేవలం పాడటమే కాదు. పాటలు రాస్తుంది. అందులోనూ సమాజ విలువలు ఉండేలా చూసుకుంటోంది. తన మొదటి పాట 'లివింగ్ ది లైఫ్' అధిక ప్రజాదరణ పొందింది. తర్వాత కంపోజ్ చేసిన 'మీన్ టు బీ' సాంగ్‌తో ఇండియన్ మ్యూజిక్ ఇండస్ట్రీ (ఐఎంఐ) నుంచి ప్రశంసలు అందుకుంది. అది మొదలు.. సర్కిల్స్, హోల్డ్ ఆన్, బ్లాక్‌అవుట్, బెటర్, అన్‌స్టాపబుల్, లవ్ సుసైడ్, డిస్‌అప్పియర్.. పాటలతో కుర్రకారుని ఊపేస్తోంది. పుట్టింది దేశంలోని ధనవంతుల ఇంట్లో. కానీ, వారసత్వంగా వస్తున్న వ్యాపారాలను కాదని తనదైన ప్రత్యేకత చాటుతోంది.

● 17వ ఏట నుంచే సొంతంగా వ్యాపారం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా మూడు విభిన్న వెంచర్లను నడుపుతోంది. తాను స్థాపించిన మైక్రోఫైనాన్స్ సంస్థ ద్వారా నిరుపేద మహిళలకు ఆదాయ వనరుల్ని చూపుతోంది.

● ఇంగ్లండ్‌లో చదువుకునే సమయంలో స్టూడెంట్ హెల్ప్‌లైన్ నంబరును ప్రారంభించి మానసికంగా కృంగిపోతున్న యువతకి కౌన్సెలింగ్ ఇచ్చి, వారిలో చైతన్యాన్ని తీసుకొచ్చింది. ఇప్పుడు 'ఎంపవర్' పేరుతో సంస్థని స్థాపించి తల్లి నీరజతో కలిసి మానసిక సమస్యలతో బాధపడేవారికి బాసటగా నిలుస్తోంది.

కాలేజీ స్టైలే

# బ్యాగ్ బ్యాగ్

కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైంది. కొందరికి అడ్మిషన్లు జరుగుతున్నాయి. కొందరికి కాలేజీలు తెరిచేశారు. మరి కాలేజీకి వెళ్లే కుర్రాళ్లకు బ్యాగ్ ఎంత ముఖ్యమో చెప్పనక్కర్లేదు. స్టైల్‌లో ఎవరికీ తగ్గకూడదు. ట్రెండీగా అందర్నీ తమవైపే తిప్పుకోవాలి. ల్యాపీ దగ్గర్నుంచి నోట్స్ దాకా... ఫోన్, గాగుల్స్, బండి కీ, ఇయర్‌ఫోన్స్, ఛార్జర్స్, పవర్‌బ్యాంక్స్ ఇలా అన్ని అందులోనే ఇమిడిపోవాలి. ఇలా... యువత అవసరాలను గుర్తించిన డిజైనర్లు వారి అభిరుచులకు తగ్గట్లే బ్యాగులను మార్కెట్లోకి వదిలారు. అందుబాటు ధరల్లోనే అందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. కొత్త బ్యాగ్ కొనండి. కొత్తగా కాలేజీకి వెళ్లండి.



యూఎస్‌బీ పోర్ట్‌తో పాటు.. ఇయర్‌ఫోన్ పోర్ట్ దీని ప్రత్యేకత. ఫోన్‌ను చేతితో పట్టుకోకుండానే ఇష్టమైన సంగీతం వింటూ కాలేజీకి వెళ్లొచ్చు. హిడెన్‌జిప్, ప్యాకెట్ దీని ప్రత్యేకత. దొంగతనాల నుంచి తప్పించుకోవచ్చు.

వర్షం పడ్డా ఈ బ్యాగుతో ఇబ్బందులుండవు. ఎందుకంటే దీన్ని వాటర్‌ప్రూఫ్‌గా తయారు చేశారు. లోపలున్న ల్యాపీ సహా ఫోన్ భద్రంగా ఉంటుంది.





స్టైల్‌కు స్టైలు, లుక్‌కు లుక్‌తో అలరిస్తోందీ బ్యాక్‌ప్యాక్. యూఎస్‌బీ పోర్ట్‌తో పాటు... జిప్ నంబర్ లాక్ ఇందులోని ప్రత్యేకత.

అదిరిపోయే డిజైన్‌తో యువతను ఆకట్టుకుంటోందిది. జిప్ మాగ్నట్‌తో పాటు గాగుల్స్ నుంచి మొబైల్, ఇయర్స్ ఫోన్స్‌కు ప్రత్యేక ప్యాకెట్లు ఉన్నాయి. రెయిన్ రెసిస్టెంట్ బ్యాగ్.

